fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 68 | విజయవాడ, శనివారం 10 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

ఫేస్‌బుక్ ఆసరాగా మోసం, ముఠా అరెస్టు 3

హోదా కోసం మిన్నంటిన నిరసనలు 7



మహారాష్ట్ర రైతుల మహా పాదయాత్ర 3లో

దేశంలో పెరుగుతున్న అత్యంత సంపన్నులు



వెల్లడించిన తాజా అధ్యయనం

న్యూఢిల్లీ : దేశంలో అత్యంత సంపన్నులు పెరిగి పోతున్నారని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ వెల్లడించిన వెల్త్ రిపోర్ట్-2018 నివేదిక పేర్కొంది. 2017లో వీరి సంఖ్య పెరిగిందని తెలిపింది. దేశంలో రెండు వందల మంది దాకా ఉన్న అత్యంత సంపన్నులు (సూపర్ రిచ్) 500 మిలియన్ డాలర్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని నివేదిక పేర్కొంది. అంతకుముందు ఏడాదిలో 170గా ఉన్న వీరి సంఖ్య 18 శాతానికి పెరిగిందని తెలిపింది. ఈ కేటగిరిలో చేరిన అత్యంత సంపన్నులను నైట్ ఫ్రాంక్ సంస్థ డెమి బిలియనీర్లుగా పిలుస్తోంది. వీరి సంఖ్య పెరుగుతున్నది. 2017తో కలిపి ఐదేళ్లలో 500 మిలియన్ డాలర్లు లేదా అంతకు మించిన సంపద కలిగిన భారరతీయులు సంఖ్య 43 శాతం పెరిగింది. రానున్న ఐదేళ్లలో మరో 70 శాతం పెరిగే అవకాశముందని నైట్ ఫ్రాంక్ అంచనా వేసింది. ఇదే సమయంలో పేదల సంఖ్య దయనీయంగా ఉంది. 2017లో 50 మిలియన్‌డాలర్లు అంతకు మించి సంపద కలిగిన వారి సంఖ్య 2, 929 మందిగా ఉంది. 2022 నాటికి ఈ కేటగిరిలో భారతీయులు సంఖ్య 4,980కి చేరుకుంటుందని కన్సల్టెంట్ అంచనా వేసింది. అంతేకాకుండా 2017-22 సంవత్సరాలలో మిగతా 9లో

పార్లమెంట్‌లో కొనసాగిన హోదా ఆందోళన



ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్ ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి ఎంపీలు. మొదటిసారి పాల్గొన్న కేంద్ర తాజా మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

ఉభయ సభల వాయిదా

బిజెపి, టిడిపిలపై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు

అశోక్, సుజనా రాజీనామాలకు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపి ఎంపిల ఆందోళన శుక్రవారం నాడు కూడా కొనసాగింది. ఈ ఆందోళనలో మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు. తొలుత పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టిడిపి ఎంపిలు డిమాండ్లతో కూడిన టీషర్టులు ధరించి మిగతా 9లో

రాజీనామాలిచ్చినా కేంద్రంలో స్పందన లేదు..

ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని టిడిపి మంత్రులు రాజీనామా లిచ్చినా కేంద్రంలో ఎలాంటి స్పందనా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా 9లో



న్యూఢిల్లీలో నిర్వహించిన ర్యాలీలో డి. రాజా, కవితా కృష్ణన్ తదితరులు

బిజెపి, ఆరెస్సెస్ ఫాసిస్టు దాడులు

త్రిపురలో సంఘ్ పరివార్ దాడులను వ్యతిరేకిస్తూ ఢిల్లీలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

త్రిపురలో బిజెపి, ఆరెస్సెస్ ఫాసిస్టు దాడులకు ఒడిగడుతున్నాయని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన నాటి నుండి అరాచకం సృష్టిస్తున్నాయని, శాంతికి చిరునామాగా ఉండే త్రిపురలో బిజెపి అధికారంలోకి వచ్చిన కొన్ని గంటల్లోనే అశాంతికి తెరలేచిందని మండిపడ్డారు. దేశంలో ప్రముఖుల విగ్రహాలను కూల్చడం, విగ్రహాలపై దాడి చేయడం వివేకమా? అని ప్రశ్నించారు. హింసే తమ అభిమతంగా బిజెపి, ఆరెస్సెస్‌లు వ్యవహరిస్తోన్నాయని దుయ్యబట్టారు. సిపిఎం కార్యకర్తల పైన, వారి నివాసాలపైన, సిపిఎం పార్టీ కార్యాలయాలపైన దాడి అమానుషమని అన్నారు. త్రిపురలో బిజెపి, ఆరెస్సెస్ దాడులను నిరసిస్తూ శుక్రవారం నాడిక్కడ సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఎస్‌యుసిఐ(సి), ఆరెస్పి, ఫార్వర్డ్ బ్లాక్, సిజిపిఐ- ఏడు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. తొలుత జంతర్ మంతర్ క్రాస్ రోడ్డు వద్ద చేరుకున్న వామపక్ష నేతలు, కార్యకర్తలు అక్కడ నుంచి పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. దారి పొడుగునా బిజెపి, ఆరెస్సెస్‌లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "దేశీయ తాలిబన్ ఆరెస్సెస్, బిజెపి డౌన్..డౌన్, త్రిపురలో బిజెపి హింసను ఆపాలి, బిజెపి, ఆరెస్సెస్ గూండాల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, జాతీయ తీవ్రవాదం డౌన్..డౌన్, వామపక్ష కార్యకర్తలు, పార్టీ కార్యాలయాలపై దాడులు ఆపాలి" మిగతా 9లో

రాష్ట్రానికి మరో షాక్



మార్కెట్ రుణాలకు తిరస్కరణ

కేంద్ర ఆర్థిక శాఖ లేఖ

రూ.3221 కోట్ల రుణానికి గండి

రాష్ట్ర బడ్జెట్ రోజే తొలి దెబ్బ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజే రాష్ట్రానికి కేంద్రం షాక్ ఇచ్చింది. బహిరంగ మార్కెట్ రుణాల కోసం చేసుకున్న దరఖాస్తును కేంద్ర ఆర్థిక శాఖ తిరస్కరించింది. ఇప్పటికే మీ రుణ పరిమితి అయిపోయిందని ప్రకటించింది. ఇంకా కావాలంటే అదనపు పరిమితికి అనుమతి కోసం కేంద్రాన్ని ఆశ్రయించాలని తేల్చి చెప్పింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రాష్ట్రానికి ఆర్థిక సమస్యలు చుట్టుముట్టేలా కనిపిస్తోంది.

చివరి త్రైమాసికం చివరి నెల్లో రూ. 3221 కోట్లు మార్కెట్ బారోయింగ్ తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ గత నెల 26న కేంద్ర ఆర్థిక శాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. దీంతో కనీసం జీతాల ఖర్చు నుంచైనా గట్టెక్కేందుకు ఆస్కారం ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ భావించింది. అయితే ఈ వినతిని కేంద్రం నిర్ద్వందంగా తిరస్కరించింది. ఆర్థిక సంవత్సరం చివరిదశలో రూ. 26 వేల కోట్ల వరకు మార్కెట్ రుణాలు తీసుకోవాలని ప్రతిపాదించగా, సవరణ అంచనాల్లో దీనిని రూ. 25 వేల కోట్లకు కుదించారు. ఇప్పటివరకు దాదాపు రూ. 21 వేల కోట్ల వరకు రుణాలు తీసుకున్నట్లు అధికారులు చెబుతుండగా, మరో రూ. 3221 కోట్లకు తాజాగా దరఖాస్తు చేసుకున్నారు. కేంద్రం నుంచి నిధులు, రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం కూడా తగ్గుతున్న తరుణంలో ఈ రుణం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆర్థిక శాఖ మిగతా 9లో



ఎండలు మండుతాయి

జాగ్రత్తలు తప్పనిసరి

ఐఎండి వైకె రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కోస్తా జిల్లాల్లో ఈ ఏడాది ఎండలు మండనున్నాయి. ఎండల తీవ్రత ఈ ప్రాంతాల్లో గతంలో కంటే రెండు, మూడు సెల్సియస్ డిగ్రీలు ఎక్కువగా ఉండే అవకాశముందని భారత వాతావరణ సంస్థ సంచాలకులు (ఐఎండి) వైకె రెడ్డి తెలిపారు. ప్రజలు అప్రమత్తమై ప్రభుత్వం జారీ చేసే సూచనలను అనుసరించాలని ఆయన సూచించారు. 'ఎండ తీవ్రతకు గురి కాకుండా జాగ్రత్తలు పాటిద్దాం' అనే బ్రోచర్‌ను కుంచనపల్లిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన కమీషనర్ ఎంవి శేషగిరిబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎండ తీవ్రత మార్చి మొదటి వారం నుంచి జూన్ మధ్య ప్రాంతం వరకు మిగతా 9లో

స్వచ్ఛంద మరణానికి సుప్రీం ఓకే!

న్యూఢిల్లీ : చికిత్సకు అలవికాని వ్యాధులతో బాధపడుతున్న రోగులు స్వచ్ఛందంగా మరణించాలనుకోవడం వారికి గల ప్రాథమిక హక్కని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఇందుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై విచారిస్తూ స్వచ్ఛంద మరణానికి అనుమతినిచ్చింది. ఇటువంటి కేసుల్లో అనుసరించాల్సిన పలు మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. గతేడాది అక్టోబరు 11న ఈ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసుకున్న ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిగతా 9లో



మేలో ట్రంప్-కిమ్ భేటీ



డొనాల్డ్ ట్రంప్ | కిమ్ జోంగ్ ఉన్

వాషింగ్టన్ : ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో భేటీ అయ్యేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించినట్లు ద.కొరియా, అమెరికా అధికారులు వెల్లడించారు. ఉ.కొరియా అణు కార్యక్రమాలపై దాదాపు కొన్ని నెలలపాటు కొనసాగిన హెచ్చరికలు, బెదిరింపుల పర్వం అనంతరం ఇరువురు నేతలూ భేటీకి సిద్ధం కావటం విశేషం. ఇప్పటి వరకూ అమెరికా అధ్యక్షుడెవరూ ఉ.కొరియా అధినేతలతో భేటీ కాలేదు. ద.కొరియా జాతీయ భద్రతా వ్యవస్థ డైరెక్టర్ చుంగ్ యాయంగ్ గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. అంతకు ముందు ఆయన అధ్యక్షుడు ట్రంప్‌ను కలిసి ఇటీవల ఉ.కొరియాలో తమ దేశ ప్రతినిధి బృందం జరిపిన పర్యటన వివరాలను తెలియచేశారు. దాదాపు దశాబ్దాల పాటు బద్ధ వైరులుగా కొనసాగిన అమెరికా ఉ.కొరియా దేశాల మధ్య జరుగనున్న ఈ భేటీ అనూహ్యమైనదేనని పరిశీలకులు చెబుతున్నారు. ఈ రెండు దేశాల మధ్య ప్రస్తుతం ఎటువంటి ద్వైపాక్షిక సంబంధాలూ లేవు. 1950-53లో కొనసాగిన కొరియా యుద్ధానంతరం కూడా ఈ రెండూ బద్ధ వైరులుగానే కొనసాగాయి. కొరియా ద్వీపకల్పం అణు నిరాయుధీకరణకు తాను కట్టుబడి వున్నట్లు కిమ్ చెప్పారని చుంగ్ ట్రంప్‌కు వివరించారు. గత నెలలో జరిగిన శీతాకాలం ఒలింపిక్స్ నేపథ్యంలో ఉభయ కొరియాల మధ్య ఏర్పడిన దౌత్య సంబంధాలతో కొరియా ద్వీపకల్పంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడిన విషయం తెలిసిందే. ఏప్రిల్ ద్వితీయార్థంలో ఇరుదేశాల మిగతా 9లో

జనసేనలో మాదాసు గంగాధరం

ఆవిర్భావ సభ ఏర్పాట్లు అప్పగింత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ఎంఎల్‌సి మాదాసు గంగాధరం జనసేనలో చేరారు. శుక్రవారం పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. పార్టీలో చేరిన వెంటనే ఆయనకు ఈ నెల 14న గుంటూరులో జరగనున్న ఆవిర్భావ సభ ఏర్పాట్ల బాధ్యత అప్పగిస్తున్నట్లు పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం ప్రజాజీవితంలో ఉండి రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన మాదాసు గంగాధరంను పార్టీలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామన్నారు. నిబద్ధత గల పవన్ వంటి వారితో పని చేయడం సంతోషంగా ఉందని, పార్టీలో ప్రతి కార్యకర్తకు ఒక సోదరుడిలా అండగా ఉంటానని మాదాసు అన్నారు.

చాలని పడకలు

గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో అతిసార బాధితులకు పడకలు చాలడం లేదు. దీంతో ఒక పడకపై ఇద్దరేసి, ముగ్గురేసి బాధితులను కుక్కేసి చికిత్స అందిస్తున్నారు.



గుంటూరులో అదుపులోకి రాని అతిసార

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

గుంటూరు జిల్లాలో అతిసార అదుపులోకి రావడం లేదు. దీంతో నగరంలోని చాలా ఆసుపత్రులు అతిసార బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగినా పరిస్థితిలో ఇంకా మార్పు రాలేదు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో తాగునీటి పైపులైన్లు లీకై మురుగు నీరు కలిసి అతిసార విజృంభించిన నేపథ్యంలో పది మంది మృత్యువాత పడ్డారు. దీనిపై తొమ్మిది మందిని బాధ్యులుగా చేస్తూ సస్పెండ్ చేసిన విషయమూ తెలిసిందే. అతిసార ప్రబలి ఆరురోజులైనా నేటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. సమీప ప్రాంతాల్లోని వారూ ఇదే వ్యాధికి గురవుతున్నారు. ఈ క్రమంలో గుంటూరు సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో రోగుల తాకిడి పెరుగుతోంది. ఈ క్రమంలో ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులకు చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నానికి జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నవారి సంఖ్య 217కు చేరింది. పరిస్థితి విషమించిన వారిని హుటాహుటిన సమీపంలోని రమేష్ హాస్పటల్‌కు తరలిస్తున్నారు. మరోవైపు ఆరోగ్యం కుదుటపడిందని 30 మందిని డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం జిజిహెచ్‌లో 184 మంది, రమేష్ హాస్పటల్‌లో 20 మంది చికిత్స పొందుతున్నారు. రమేష్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటిలేటర్ ద్వారా చికిత్స అందిస్తున్నారు. వీరే గాక పాతగుంటూరులో పది డివిజన్లలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులు, ప్రయివేటు ఆస్పత్రుల్లో 300 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. ఇదిలావుండగా అతిసారపై జిల్లా కలెక్టర్ కోన శశిధర్ అధికారులతో సమావేశమయ్యారు. కార్పొరేషన్ హాల్లో శుక్రవారం సమీక్షించిన ఆయన అతిసార తగ్గుముఖం పట్టిందని, వైద్యశిబిరాలు కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. బాధిత పది వార్డుల్లో తాగునీటి సరఫరాను నిలిపేసిన నేపథ్యంలో 56 ట్యాంకర్లతో రోజుకు 203 ట్రిప్పులు తాగునీరు సరఫరా చేయాలని చెప్పారు.

ప్రజ్ఞ

1. 2017-2018 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం ఎంత?
2. 2017-2018 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్ జనాభా ఎంత?
3. మేఘాలయ, నాగాలాండ్ నూతన ముఖ్యమంత్రులు ఎవరు?
4. ఇటీవల ఏ దేశంలో మత కలహాల వల్ల అత్యవసర పరిస్థితిని విధించారు?
5. ఇటీవల కేంద్ర కేబినెట్ నుండి వైదొలిగిన ఇద్దరు మంత్రులు ఎవరు?

సమాధానాలు 7లో

రాజధాని నమూనాల పరిశీలన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణ సంస్థ రూపకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. వివిధ నమూ నాలను పరిశీలించారు. స్పానిష్, ఆర్కిటెక్ట్ రిరాక్డో బోఫిల్, ఎఫ్‌హెచ్‌డి గ్రూపు, ఆర్‌ఎస్‌పి మరికొన్ని సంస్థలు రూపకల్పన చేసిన రాజభవన్, గవర్నర్ దర్బార్‌హాలు, గవర్నర్ నివాసం, ముఖ్యమంత్రి నివాసం, సిఎం గెస్ట్‌హౌస్ తదితర నమూనాలను ఆయన పరిశీలించారు.అలాగే 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న వైల్డర్‌నెస్ పార్కు నమూనానూ చూశారు. దీనిలో మూలికావనాలు, పుష్పవనాలు, రెయిన్‌ఫారెస్ట్, రెస్టారెంటు, స్పా తదితర సదుపాయాలుండ నున్నాయి. సెంట్రల్ పార్కులో భాగంగా ఇది ఉంటుంది.

మంత్రివర్గ విస్తరణపై సిఎం కసరత్తు

- సీనియర్ నేతలతో చర్చలు
- ఆశావహుల్లో ఉత్కంఠ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇద్దరు బిజెపి మంత్రుల రాజీనామాతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణపై కసరత్తు ప్రారంభించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన శుక్రవారం రాత్రి అందుబాటులో ఉన్న సీనియర్ నేతలతో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఆశావహుల్లో ఎవరికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలనే అంశంలో ఇంతవరకు మంత్రి వర్గంలో స్థానంలేని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలనేది చర్చల్లోకి వచ్చిందని సమాచారం. బిజెపి మంత్రులు రాజీనామా చేసినందున ముస్లిం మైనార్టీలకు మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని సీనియర్ నేతలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. ముస్లిం మైనారిటీల్లో టిడిపిలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా వారిద్దరూ వైసిపి నుండి టిడిపిలోకి వచ్చినవారే కావడం విశేషం. ఇలాగే గిరిజనుల్లో ఒకరికి మంత్రి పదవి ఇస్తే వారు కూడా వైసిపి నుంచి వచ్చిన వారే కావడం గమనార్హం. రాజీనామా చేసిన మంత్రుల్లో కామినేని కృష్ణా జిల్లాకు చెందిన వారు కావడంతో అదే జిల్లా నుంచి వేరొకరిని తీసుకుంటారా లేదా అనేదీ టిడిపి వర్గాల్లో చర్చ నడుస్తోంది. సామాజిక సమీకరణాల్లో భాగంగా పదవులు ఆశిస్తున్న వారి సంఖ్యా అధికంగానే ఉంది. పార్టీలో సీనియర్ నేతలైన గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కాగిత వెంకట్రావు, ధూళిపాళ్ల నరేంద్ర ఇలా పలువురు ఆశావహులున్నారు. జగ్గయ్యపేట శ్రీరాం తాతయ్య కూడా మంత్రి పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. ప్రకాశం జిల్లా నుండి క్యాబినెట్‌లో శిద్దా రాఘవరావు ఒక్కరే మంత్రి పదవిలో ఉండగా ఆజిల్లా నుంచి మరొకరికి విస్తరణలో అవకాశం కల్పించే అవకాశాలు లేక పోలేదని అంచనా వేస్తున్నారు. గిరిజనుల్లో వైసిపికి పట్టుఉండటంతో అరకు ఎమ్మెల్యే సర్వేశ్వరరావుకు మంత్రి పదవి దక్కవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

టిడిపి రాజ్యసభ అభ్యర్థులు ఆదివారం ఖరారు

ఇదిలావుండగా రాజ్యసభలో ఖాళీ అయిన స్థానాల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడు స్థానాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. వీటిలో ప్రస్తుత బలాబలాలను బట్టి టిడిపికి రెండు, వైసిపికి ఒక స్థానం దక్కుతాయి. వైసిపి తరపున ఇప్పటికే వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి నామినేషన్ వేసిన విషయం విదితమే. ఈ నామినేషన్లకు చివరి రోజు సోమవారం కావడంతో టిడిపిలో ఎవరికి రాజ్యసభ సీట్లు దక్కుతాయనేదీ ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశాన్ని ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం గ్రీవెన్స్‌హాల్‌లో ఆదివారం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ అభ్యర్థుల పేర్లు వెల్లడికానున్నాయి. రాజ్యసభకు సిఎం రమేష్ మరొక దఫా తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కడప జిల్లాకు చెందిన శ్రీనివాసరెడ్డి కూడా ఈ రేస్‌లో ఉన్నారు. సీనియర్ నేత కంభంపాటి రామ్మోహన్‌రావు కూడా రాజ్యసభకు అవకాశం కోసం నిరీక్షిస్తున్నారు. ఎస్సీ వర్గాల్లో కూడా వర్ల రామయ్య, జూపూడి ప్రభాకర్, హేమలత, మాజీ ఎమ్మెల్సీ మీసాల పద్మజ, మాజీ మంత్రి ప్రతిభాభారతి, బల్లి దుర్గాప్రసాద్. బిసిల్లో నెల్లూరు జిల్లాకు చెందిన బీదా మస్తాన్‌రావు తదితరులు రాజ్యసభ సీటును ఆశిస్తున్న వారిలో ఉన్నారు.

కేంద్రంలో..

కేంద్ర మంత్రి వర్గం నుండి సుజనాచౌదరి, అశోక్ గజపతిరాజు వైదొలగడంతో ఆ స్థానాల్లో ఎపి నుంచి బిజెపి ఎంపిలు గోకరాజు గంగరాజు, కంభంపాటి హరిబాబుల్లో ఒకరికి అవకాశం లభించవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. గతంలో హరిబాబుకు మంత్రి పదవి దక్కినట్టే దక్కి చేజారిపోయింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి సన్నిహితులు కావడంతో కేంద్రంలో తనకు మంత్రి పదవి ఖాయమనే ధీమాలో గంగరాజు ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వ నిర్ణయం తర్వాతే భవిష్యత్ కార్యాచరణ

- చర్చల్లో కొంతవరకు సానుకూలత
- విద్యుత్ కార్మికుల ఐక్య వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ప్రధాన డిమాండ్ నేరుగా వేతనాల చెల్లింపు.. ఇతర డిమాండ్లపై ప్రభుత్వ నిర్ణయం అనంతరం భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని ఐక్య వేదిక సెక్రటరీ జనరల్ బాలకాశి తెలిపారు. కార్మికుల ఐక్య వేదిక నాయకులతో యాజమాన్యం విద్యుత్ సౌధలో శుక్రవారం చర్చలు చేపట్టింది. ఈ చర్చల్లో ఐక్య వేదిక నాయకులతోపాటు ఐదు గుర్తింపు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్మికుల ప్రధాన డిమాండ్లు సమాన పనికి సమాన వేతనం, క్రమబద్ధీకరణ, నేరుగా వేతనాల చెల్లింపు, పీసు రేటు రద్దు చేసి ఫిక్స్‌డ్ వేజ్ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సానుకూల నిర్ణయం వచ్చే విధంగా కృషి చేస్తామని ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్ ఐక్య వేదిక నాయకులకు వివరించినట్లు బాలకాశి చెప్పారు. సమానపనికి సమాన వేతనానికి సంబంధించి న్యాయస్థానంలో కేసు విచారణలో ఉందని, దీనిని త్వరగా వెకెట్ చేయించేందుకు చర్యలు తీసుకుంటామని సిఎండి చెప్పారన్నారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలు, ప్రీమియం మరో 10 లక్షలు చొప్పున మొత్తం రూ.15 లక్షలు చెల్లించేందుకు, వైద్య కోసం ఇచ్చే మొత్తాన్ని రూ.50 వేల నుంచి లక్షకు పెంచేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. సమ్మెలో ఉన్న కార్మికులను విధుల్లోకి తీసుకోవడం, సమ్మె కాలానికి వేతనం చెల్లించే అంశాలను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కాంట్రాక్టు కార్మికుల చర్చల్లో పర్మినెంట్ ఉద్యోగుల సంఘాల నాయకులను అనుమతించడాన్ని ఐక్య వేదిక నాయకులు తప్పు బట్టారు. చర్చల్లో ఐక వేదిక చైర్మన్ పి.కాశీమధుబాబు, కో కన్వీనర్ కట్టా నాగరాజు, చీఫ్ కోఆర్డినేటర్ జి.హరతి, దుగ్గిరాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

13న ఎస్‌ఎస్‌ఎ సిబ్బంది చలో విజయవాడ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సర్వ శిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఎ) ప్రాజెక్టులో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఈనెల 13న చలో విజయవాడకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు ఎం బాలకాశి, బి కాంతారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జెఎసి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మార్చి 12న అన్ని విభాగాల రాష్ట్ర నాయకులతో విజయవాడలోని దర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 13న విజయవాడలోని రైల్వే స్టేషన్ నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ, అనంతరం మహా ధర్నా ఉంటాయని పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌ఎ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వాణీ మోహన్

12 నుంచి పురావస్తు శాఖ అంతర్జాతీయ వర్క్‌షాప్

కమిషనర్ వాణీ మోహన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్చి 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పురావస్తు శాఖ అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనుందని ఆ శాఖ కమిషనర్ వాణీ మోహన్ తెలిపారు. విజయవాడ బాపు మ్యూజియంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణంతో ముంపు గ్రామాల్లో కనుమరుగయ్యే ప్రమాదం ఉన్న సంస్కృతి, వారసత్వ సంపదను కాపాడి, ముందు తరాల వారికి అందించేందుకు రాష్ట్ర పురావస్తు శాఖ పనిచేస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురవుతున్న గ్రామాల్లో 341 రాతి విగ్రహాలను, రెండు దేవాలయాలను, నాలుగు బృహత్ శిలా యుగ సంస్కృతి గల స్థలాలను గుర్తించామన్నారు. వర్క్‌షాప్‌లో ఆరు దేశాల ప్రతినిధులు, పరిశోధకులు పాల్గొననున్నారని ఆమె తెలిపారు.

రైతాంగానికి సర్కారు క్షమాపణ చెప్పాలి

వైసిపి రైతు నేత నాగిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చివరి బడ్జెట్‌లోనూ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వనందుకు రాష్ట్ర రైతాంగానికి తెలుగుదేశం ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని వైసిపి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఎస్ నాగిరెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతేడాది కంటే 28.6 శాతం సాధారణ బడ్జెట్ పెంచారని, వ్యవసాయ బడ్జెట్‌ను మాత్రం కేవలం 4.6 శాతం పెంపుతో సరిపెట్టారని తెలిపారు. వరి పంటకూ గిట్టుబాటు ధర దక్కని పరిస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. సుమారు రూ.87 వేల కోట్లకు పైగా ఉన్న రైతు రుణమాఫీలో రూ.24 వేల కోట్లు మాఫీ చేస్తామని చెప్పినా ఈ మేరకూ క్షేత్రస్థాయిలో రుణాలు మాఫీ కాలేదని విమర్శించారు. పంటల సాగు విస్తీర్ణం తగ్గినా దిగుబడులు పెరిగాయంటూ ప్రజల్ని మోసం చేస్తున్నారని నాగిరెడ్డి ధ్వజమెత్తారు. రైతులకు ఉచిత విద్యుత్ వాగ్దానం చేసిన చంద్రబాబు, బడ్జెట్‌లో సూచన ప్రాయంగానైనా ఆ మాట చెప్పలేదన్నారు. 2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి ఆర్భాటపు ప్రకటనలు చేశారని విమర్శించారు. ఆక్వా, పాడి పరిశ్రమ నష్టాల్లో ఉంటే రికార్డు వృద్ధి సాధించామని అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు.

సామాజిక భద్రతకు కోత

గ్రామీణాభివృద్ధికి అరకొరే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం గత ఏడాది కంటే కేవలం రూ.174.68 కోట్లు మాత్రమే అధికంగా కేటాయించింది. ముఖ్యంగా సామాజిక భద్రత, సంక్షేమానికి సంబంధించి పింఛన్ల కేటాయింపులో కోత వేసింది. వికలాంగుల పింఛన్లకు గత ఏడాది రూ.928.13 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ.740 కోట్లకు తగ్గించారు. ఎయిడ్స్ బాధితులకు ఇచ్చే పింఛన్లకు రూ.47.10 కోట్ల నుంచి 38 కోట్లకు తగ్గించారు. వృద్ధులకు, వితంతువులకు కేటాయించే రూ.4,999.68 కోట్లు అవసరం ఉండగా కేవలం రూ.4,200 కోట్లే ప్రతిపాదించారు.

డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలకు రూ.వెయ్యి కోట్లు చొప్పున సామాజిక భద్రత, సంక్షేమానికి మొత్తంగా రూ.8,786.01 కోట్లు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం పిఎంఎస్‌కెవై, నీరంచల్ వాటర్ షెడ్ పథకంలో రూ.470.85 కోట్లు, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరో రూ.4,729.29 కోట్లు అందిస్తోంది. ఇతర గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి రూ.708.30 కోట్లు కేటాయించారు. మొత్తంగా రూ.14,705.35 కోట్లు ప్రతిపాదించారు. గత ఏడాది రూ.14,530.67 కోట్లు కేటాయించగా, 14,530.42 కోట్లు సవరించిన అంచనాలుగా ఉన్నాయి.

పిఆర్‌కు పెరిగిన కేటాయింపులు

పంచాయతీరాజ్ శాఖకు ఈ బడ్జెట్‌లో 8,733.85 కోట్లు ప్రతిపాదించారు. గత ఏడాది కేటాయింపులు 6,610.09 కోట్లుగా ఉండగా సవరించిన అంచనాల ప్రకారం 7,156.83 కోట్లకు చేరింది. ఈ ఏడాది బడ్జెట్ అంచనాల ప్రకారం... గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు 529.94 కోట్లు, నేషనల్ రూర్బన్ మిషన్ కింద రూ.222 కోట్లు, జిల్లా పరిషత్‌లకు రూ.118.02 కోట్లు, మండల పరిషత్‌లకు రూ.588.95 కోట్లు, ఆర్థిక సంఘం నిధులు రూ.1,747 కోట్లు, రూరల్ డవలప్‌మెంట్ ఫండ్ రూ.552.41 కోట్లు చొప్పున మొత్తం రూ.3,913.53 కోట్లు, ఘన వ్యర్థాల నిర్వహణకు రూ.175 కోట్లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో రోడ్ల, వంతెనల నిర్మాణం, నిర్వహణలకు రూ.1,972.50 కోట్లు ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ్) రూ.1,450 కోట్లు నిధులు ఇవ్వనుంది. ఎన్‌ఆర్‌డిడబ్ల్యూపి పథకం కింద రూ.400 కోట్లుతో సహా ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి రూ.2,623 కోట్లు చొప్పున ప్రతిపాదించారు.

శాఖ	2017-18 కేటాయింపు	2017-18 సవరించిన అంచనాలు	2018-19 కేటాయింపులు
గ్రామీణాభివృద్ధి శాఖ	14,530.67	14,530.42	14,705.35
పంచాయతీరాజ్ శాఖ	6,610.09	7,156.83	8,733.85

ఇళ్ల డిమాండ్‌కు తగ్గ నిధులేవి?

19 లక్షల గృహాల లక్ష్యానికి

రూ.4,752 కోట్లే కేటాయింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణానికి ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా గృహనిర్మాణ శాఖకు బడ్జెట్ కేటాయింపులు లేవు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గతం కంటే కేటాయింపును కొంత పెంచినా ఈ మొత్తం లక్ష్యానికి మాత్రం దూరంగానే ఉంది. ఈ ఏడాది బడ్జెట్‌లో గృహనిర్మాణానికి మొత్తం రూ.4,752 కోట్లు కేటాయించింది. గడిచిన మూడేళ్లలో పూర్తి చేసింది 2.70 లక్షల ఇళ్లు మాత్రమే. మంజూరైన 5.75 లక్షల ఇళ్లలో కొన్ని నిర్మాణ దశలో ఉండగా, మరికొన్ని ఇళ్ల నిర్మాణం ప్రారంభించాల్సి ఉంది.

రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం 20.90 లక్షల మంది అర్హులుగా తేల్చిన ప్రభుత్వం 16 వేల కోట్లు ఖర్చువుతుందని అంచనా వేస్తోంది. ఇప్పటి వరకూ నిర్మించిన 2.70 లక్షల ఇళ్లను మినహాయిస్తే, మిగిలిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి రూ.12 వేల కోట్లు వరకూ అవసరం. ఈ ఏడాది ప్రభుత్వం కేంద్రం ఇచ్చే నిధులతో కలిపి రూ.4,752 కోట్లే బడ్జెట్‌లో ప్రతిపాదించడంతో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. గత బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం 1,456.55 కోట్లు కేటాయించగా, సవరించిన ఖర్చు చేసింది రూ.1,540.39 కోట్లుగా ఉంది. ఎన్టీఆర్ పట్టణ గృహనిర్మాణానికి కేంద్రం రూ.866 కోట్లు కేటాయిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.577 కోట్లు, ఇతర సహాయక గ్రాంట్లతో కలిపి మొత్తం రూ.1,827.36 కోట్లుగా అంచనా వేశారు. ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.307. కోట్లు, బలహీన వర్గాల గృహనిర్మాణానికి మరో రూ.125.29 కోట్లు కేటాయించింది. పిఎంఎవై(గ్రామీణ) పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి కేంద్రం రూ.654 కోట్లు మంజూరు చేస్తోంది. పేదలకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు రూ.500 కోట్లు కేటాయించారు. భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మొత్తం ఎంత వరకూ సరిపోతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

గృహనిర్మాణానికి కేటాయింపులు వివరాలు. (రూ.కోట్లలో)

2017-18 (కేటాయింపు)	2017-18 (సవరించిన అంచనా)	2018-19 (కేటాయింపు)
1,456.55 కోట్లు	1,540.39	4,572.00


ప్రత్యేకం

మామిడికి మంచు దెబ్బ

- 50 శాతం రాలిపోయిన పూత, పిందెలు
- బీమా సదుపాయమూ కరువు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓ వైపు పొగ మంచు.. మరోవైపు తీవ్ర ఎండ.. ఈ ఏడాది మామిడి రైతులను దెబ్బతీశాయి. ఈ రెండు కారణాల వల్ల ఇప్పటికే 40 నుంచి 50 శాతం పూత రాలిపోయింది. మరోవైపు వరుణుడూ ముఖం చాటేయడంతో మిగిలిన పూత, పిందెలూ నిలబడే పరిస్థితి లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. అటు ప్రభుత్వం తరపున బీమా సదుపాయమూ కల్పించకపోవడంతో రైతుల్లో అలజడి మొదలైంది. రాష్ట్రంలో విజయనగరం, శ్రీకాకుళం, చిత్తూరు, కృష్ణా, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో మామిడి పంట విస్తారంగా సాగవుతోంది. అనంతపురం, కృష్ణా జిల్లాలు సాగులో ఒకటి, రెండు స్థానాల్లో ఉండగా, 1,10,000 ఎకరాలతో విజయనగరం జిల్లా మూడో స్థానంలో నిలిచింది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బ తింది. నెల రోజులుగా రాత్రి, తెల్లవారుజామున విపరీతమైన పొగ మంచు కురుస్తోంది. పగటిపూట మితిమీరిన ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీనికితోడు మూడు నెలలుగా వర్షాలు లేవు. ఈ ప్రభావం మామిడి తోటలపై చూపుతోంది. విజయనగరం జిల్లాలోని గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం తదితర ప్రాంతాల్లో ఇప్పటికే 50 శాతం వరకూ పంట పోయింది. మంచు కారణంగా తామర పురుగులు వృద్ధి చెందాయని, దీనివల్ల మామిడి పువ్వు, పిందెలు రాలిపోతున్నది వాస్తవమేనని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. దుక్కి లేదా గొప్పు, ఎరువులు, పురుగు మందు ఖర్చులు, కూలీలకు ఇచ్చిన మొత్తం కలుపుకుంటే ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టామని గంట్యాడ మండలం నీలావతికి చెందిన రైతులు గులిపల్లి వెంకటరమణ, వర్రి పెద్దినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని బుడతనాపల్లికి చెందిన వసంత సుధీర్‌నాగ్ వాపోతున్నారు. కౌలు రైతులు మరింత నష్టపోయే పరిస్థితి నెలకొంది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని మామిడి రైతుల్లో ఎక్కువ మంది ఎకరా నుంచి 5 ఎకరాల్లోపు విస్తీర్ణం గలిగినవారే. మార్కెట్ సదుపాయం కూడా స్థానికంగా లేకపోవడం వల్ల కొంతమంది రైతులే మిగిలిన రైతుల వద్ద కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. సాధారణంగా మూడేళ్లకు ఒప్పందం కుదుర్చుకోవడం ఇక్కడి ఆనవాయితీ. దీనివల్ల ఒప్పందం ప్రకారం రైతులు డబ్బులు చెల్లిస్తే కౌలు రైతులు నష్టపోతారు. లేదంటే రైతులే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇటు పంటల బీమా సదుపాయాన్ని కల్పించే బాధ్యత కూడా ప్రభుత్వం తీసుకోలేదు. రైతులు బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈ ఏడాది రెండే రెండు రోజులపాటు అవకాశమిచ్చారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మామిడి పంట బీమా విషయమై 2017 డిసెంబర్ 12న జిఒ మంజూరు చేసింది. అదేనెల 14 నుంచి 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించుకోవాలని అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ గడువు విధించింది. దీనిపై ముందస్తు ప్రచారమూ లేకపోవడంతో రైతులకు తెలిసే లోపే ప్రీమియం గడువు ముగిసిపోయింది.



పూత తక్కువగా ఉన్న మామిడి తోటలు

ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి

వ్యవసాయ పంటల మాదిరిగా మామిడి నష్టాన్ని గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. ఎందుకంటే అధిక మంచు, మితిమీరిన ఉష్ణోగ్రత, వర్షాభావం కూడా విపత్తులే. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపరిహారాన్ని ప్రకటించకపోతే రైతులను ఐక్యపరిచి ఆందోళన చేపడతాం. అందులో భాగంగానే మార్చి 7న విజయవాడలో సదస్సు ఏర్పాటు చేస్తాం.

పి.పెద్దిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సంక్షిప్తం

టెట్ 'కీ' పై 19 వేల అభ్యంతరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాల గడువు శుక్రవారంతో ముగిసింది. ఈ నెల 4న విడుదల చేసిన కీపై శుక్రవారం సాయంత్రం 5 గంటల లోపు 19,314 అభ్యంతరాలు వచ్చాయి. పేపర్-1కు 12,070, పేపర్-2కు 5,018, పేపర్-3కు 2,226 అభ్యంతరాలు వచ్చాయి. అభ్యంతరాలను పరిశీలించిన తరువాత ఈ నెల 12న తుది 'కీ'ని, 16న ఫలితాలను వెల్లడించనున్నారు.

ఆర్టీసికి 16.5 కోట్లు విడుదల

వివిధ బ్యాంకులకు ఎపిఎస్ ఆర్టీసి చెల్సించాల్సిన రుణం, వడ్డీ చెల్లించేందుకు వీలుగా 2017-18 నాలుగో త్రైమాసికానికి రూ.16.55 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టీసి వివిధ కేటగిరీలకు అందిస్తున్న రాయితీలను తిరిగి చెల్లిస్తూ 2017-18 నాలుగో త్రైమాసికానికి ప్రభుత్వం రూ.29.50 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు కూడా ఆయన శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టీసి ఎండి చేసిన ప్రతిపాదనల ప్రకారం ఈ మొత్తాన్ని విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

నేడు విజయవాడలో పిపిలకు న్యాయ విజ్ఞాన సదస్సు

న్యాయ వ్యవస్థలో మారుతున్న చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు అవగాహన కలిగించేందుకు శనివారం ఉదయం 9.30 గంటలకు విజయవాడ బందరు రోడ్డులోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రాష్ట్ర స్థాయి వర్క్ షాపు నిర్వహించనున్నామని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వర్క్‌షాపును హోమ్ సెక్రటరీ అనూరాధ ప్రారంభిస్తారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లంతా ఈ వర్క్‌షాపునకు హాజరు కావాలని ఆయన కోరారు.

ముస్లింలకు కేటాయింపులు హర్షణీయం : హిదాయత్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రి వర్గంలో మైనారిటీ వర్గాలకు చెందిన మంత్రి లేకపోయినా బడ్జెట్‌లో ముస్లింలకు భారీగా కేటాయింపులు చేయడం హర్షణీయమని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎండి హిదాయత్ అన్నారు. విజయవాడ స్టేట్ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ముస్లింలకు రూ.1,102 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అల్పసంఖ్యాక వర్గాలకు నామమాత్రంగానే నిధులు కేటాయించారని, కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసేవారని విమర్శించారు. అటువంటిది మైనారిటీల అభ్యున్నతి కోసం 2014-15లో రూ. 510, 2015-16లో 730, 2017-18లో 840 కోట్ల చొప్పున నిధులు కేటాయించారని తెలిపారు. జనాభా పరంగా తీసుకుంటే ఇంత పెద్ద బడ్జెట్ ఎక్కడా లేదన్నారు. ముస్లింలోని నూర్ భాషా వర్గానికి గతంలో రూ. 2 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరానికి రూ. 40 కోట్లకు పెంచారన్నారు. వైఎస్ఆర్ హయాంలో నాలుగు సంవత్సరాల్లో రూ. 457 కోట్లు కేటాయిస్తే, 2014 నుంచి 2018 వరకు రూ. 3,448 కోట్లు కేటాయించడం విశేషమన్నారు.

మహారాష్ట్ర రైతుల మహా పాదయాత్ర



ఐదు రోజులు..180 కిలో మీటర్లు

సమస్యల పరిష్కారానికై దండుగా కదిలిన రైతాంగం

12న లక్షమందితో అసెంబ్లీ ముట్టడి

ముంబయి : సంక్షోభంలో చిక్కుకున్న మహారాష్ట్ర రైతాంగం తమ సమస్యల పరిష్కారం కోసం కదం తొక్కారు. పంట రుణాలను పూర్తిగా రద్దు చేయాలని, కరెంట్ ఛార్జీలను మాఫీ చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో దాదాపు 30 వేల మంది రైతులు మహా పాదయాత్ర ప్రారంభించారు.. మహారాష్ట్రలోని నాసిక్ నుండి ఈనెల ఎనిమిదో తేదీన ఈ యాత్ర ప్రారంభమైంది. ఈనెల 12వ తేదీ నాటికి ముంబయి చేరుకుని రాష్ట్ర శాసనసభను ముట్టడించాలనే లక్ష్యంతో రైతులు కదిలారు. నాసిక్‌లో 20వేల మంది రైతులతో ప్రారంభమైన పాదయాత్ర రోజుకు 30 కిలోమీటర్ల చొప్పున కొనసాగుతోంది. మధ్య మధ్యలో వివిధ ప్రాంతాల నుంచి రైతులు వచ్చి పాదయాత్రలో చేరుతున్నారు. మొత్తం 180 కిలోమీటర్ల పాటు సాగే ఈ యాత్రలో చివరకు లక్ష మంది రైతులు ముంబయికి చేరుకుంటారని అంచనా వేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున రైతాంగం ఇంత దూరం పాదయాత్ర చేయడం దేశ చరిత్రలోనే మొదటిసారి. మహారాష్ట్రలో రైతాంగ సంక్షోభం రోజురోజుకూ తీవ్రమౌతూనే ఉంది. గత ఏడాది కాలంలో మూడు వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులు పెద్ద ఎత్తున అప్పుల పాలయ్యారు. పంట రుణాలను రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని గత రెండేళ్ల నుండి మహారాష్ట్రలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. గత ఏడాది జూన్‌లో రైతులు 11 రోజుల సమ్మె చేశారు. దీంతో ఫడ్నవీస్ ప్రభుత్వం దిగివచ్చి రైతు రుణాలను రద్దు చేస్తామని ప్రకటించింది. కానీ ఆచరణలో అమలు కావడం లేదు. దీంతోపాటు అనేక సమస్యలు రైతులను చుట్టుముట్టాయి.

ఉపశమనమివ్వని రైతు రుణ మాఫీ

రైతుల సమ్మెతో దిగివచ్చిన ఫడ్నవీస్ సర్కార్ రుణమాఫీ పథకాన్ని ప్రకటించింది. 89 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చేలా 34 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తామని తెలిపింది. కానీ ఆచరణలో మాత్రం రైతులకు లబ్ధి చేకూరకుండా కొర్రీలు వేస్తోంది. క్లిష్టతరమైన నిబంధనలను పెట్టింది. జూన్ 30 2016 వరకు ఉన్న రుణాలనే రద్దు చేస్తామని చెప్పింది. దీంతో రుణమాఫీ సక్రమంగా అమలు కావడం లేదు.

ఇప్పటి వరకు కేవలం ఎనిమిదన్నర లక్షల మందికే లబ్ధి చేకూరింది. అది కూడా లక్షన్నర రూపాయల వరకు మాత్రమే రుణమాఫీ జరుగుతోంది. పూర్తిగా రుణమాఫీ జరుగుతుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. దీంతో పూర్తిగా రుణమాఫీ చేయాలని కోరుతూ ఉద్యమం ప్రారంభమయింది. ఎఐకెఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైన మహా పాదయాత్రలో పూర్తి రుణమాఫీ అనేది ఒక ప్రధానమైన డిమాండ్‌గా ఉంది.

భూమిపై హక్కు కోసం ఆదివాసీల పోరాటం

నాసిక్, మరాట్వాడాతోపాటు ఇతర డివిజన్లలో ఆదివాసీలు ఏళ్ల తరబడి భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇప్పుడు వారి భూములను లాగేసుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. బలవంతంగా వారి పంటపొలాల్లోకి వచ్చి అటవీ అధికారులు మొక్కలు నాటుతున్నారు. దీంతో ఆదివాసీ రైతులు మహా పాదయాత్రలో కదం తొక్కారు. తాము సాగు చేసుకుంటున్న భూములపై తమకు హక్కు కల్పించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇలా తాము ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలపై ఆల్ ఇండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో రైతులు మహాపాదయాత్ర చేపట్టారు. 12వ తేదీన ముంబయి చేరుకొని అసెంబ్లీని ముట్టడించబోతున్నారు.

భారమైన కరెంట్ ఛార్జీలు

సరైన సాగునీటిపారుదల వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు బోర్లపైనే వ్యవసాయం చేస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు 40 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రోజుకు 16 గంటలు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ 8 గంటలకు మించి సరఫరా చేయడం లేదు. దీంతో పంటలు సరిగ్గా పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులకు కరెంటు ఛార్జీలు భారంగా మారాయి. బకాయిలు కట్టలేక రైతులు ఇబ్బందుల్లో ఉంటే అధికారులు విద్యుత్ కనెక్షన్లను తొలగిస్తున్నారు. దీన్ని రైతులు ప్రతిఘటిస్తున్నారు. కరెంట్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలు

మహారాష్ట్రలో ఇప్పటికీ రైతాంగ ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. రైతు రుణమాఫీ ప్రకటించినప్పటికీ అది సరిగ్గా అమలు కావడం లేదు. దీంతో ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందనే నమ్మకం లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రుణ మాఫీ ప్రకటించిన తర్వాత కూడా ఇప్పటి వరకు 1700 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 2017 ఒక్క ఏడాదిలోనే దాదాపు మూడు వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. గత రెండేళ్ల కాలంలో ఈ సంఖ్య ఆరువేలకు పైగానే ఉంది. చనిపోయిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. కుటుంబానికి కేవలం లక్ష రూపాయలను మాత్రమే అందిస్తున్నారు. 2017 జనవరి నుండి అక్టోబర్ 31లోపు 2414 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా కేవలం 1246 మంది కుటుంబాలకే నష్టపరిహారం అందించారు.



నాసిక్ నుంచి మహా ప్రదర్శనగా బయల్దేరిన రైతు యాత్ర

దొరకని మద్దతు ధర

మహారాష్ట్ర రైతులకు మద్దతు ధర అందని ద్రాక్ష లాగే మారింది. సోయాబీన్ పంటకు ప్రభుత్వం మూడు వేల యాభై రూపాయలు మద్దతు ధర ప్రకటించగా రైతులు రెండు వేల రూపాయలకే అమ్ముకోవాల్సి వచ్చింది. పత్తిపంటను గత ఏడాది కన్నా వెయ్యి రూపాయల తక్కువగా అమ్ముకోవాల్సి వచ్చింది. వరి ధ్యానానికి కూడా మద్దతు ధర దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. గుమ్మడి కాయలు పండించిన రైతులు ఒక్కో కాయ పది రూపాయలకే అమ్ముకోవాల్సి వస్తోంది. ధరల స్థిరీకరణకు ప్రభుత్వ జోక్యం కూడా చాలా తక్కువగా ఉంది. సోయాబీన్ మొత్తం పంటలో కేవలం మూడు శాతం మాత్రమే ప్రభుత్వం సేకరించింది. స్వామినాథన్ సిఫార్సుల మేరకు పంటకు అయిన మొత్తం ఖర్చుకు 50 శాతం అదనంగా మద్దతు ధర నిర్ణయించి అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులకు అందుబాటులో రుణాలు, పంటల బీమా, ఎరువులు, విత్తనాల పంపిణీ లాంటి విషయాల్లో స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయాలని కూడా రైతులు డిమాండ్ చేస్తున్నారు.



18న ఎపి సెట్ నోటిఫికేషన్ విడుదల

- **26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**
- **ఎయు విసి నాగేశ్వరరావు**

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ లెక్చరర్లు, యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి నిర్వహించే అర్హత పరీక్ష ఎపి సెట్ - 2018 నోటిఫికేషన్‌ను ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు ఆంధ్రా యూనివర్సిటీ ఉపకులపతి(విసి), ఎపి సెట్ ఛైర్మన్ ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నోటిఫికేషన్ వివరాలు వెల్లడించారు. మార్చి 26 నుంచి మే 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.1000 అపరాధ రుసుముతో మే 10వ తేదీ వరకు, రూ.2 వేల అపరాధ రుసుముతో మే 21 వరకు, రూ.5 వేల అపరాధ రుసుముతో జూన్ 6 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. రూ 5 వేలు అపరాధ రుసుముతో పరీక్షకు దరఖాస్తు చేసిన వారికి విశాఖపట్నంలో మాత్రమే పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎపి సెట్ పరీక్ష జులై 1న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని చెప్పారు. విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, తిరుపతి ప్రాంతీయ కేంద్రాల పరిధిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. బిసి అభ్యర్థులు రూ.800, ఎస్సీ, ఎస్టీ, పిహెచ్, విహెచ్ అభ్యర్థులు రూ.500 దరఖాస్తు రుసుము చెల్లించాలన్నారు. దరఖాస్తు రుసుమును ఆన్‌లైన్‌లో డెబిట్, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ విధానంలో చెల్లించవచ్చని, సిలబస్, నమూనా ప్రశ్నాపత్రాలు తదితర వివరాలు ఎయు వెబ్‌సైట్, ఎపి సెట్ వెబ్‌సైట్‌ల్లో పొందుపరిచామని తెలిపారు. యూజీసీ 31 సబ్జెక్టులలో పరీక్ష నిర్వహణకు అనుమతి మంజూరు చేసిందన్నారు. కామర్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాలకు ప్రశ్నాపత్రం తెలుగు, ఆంగ్ల భాషలలో ఉంటుందని, మిగిలిన అన్ని సబ్జెక్టులకు ప్రశ్నాపత్రం ఆంగ్లంలో మాత్రమే ఉంటుందని తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు పేపరు-1, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పేపరు-2 పరీక్ష జరుగుతుందని చెప్పారు. మొదటి పేపరు-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపరు-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు ఉంటాయన్నారు. పూర్తి సమాచారం కోసం ఎయు వెబ్‌సైట్, ఎపిసెట్ వెబ్‌సైట్ www.apset.net.in, www.andhrauniversity.edu.inలను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, ఎపిసెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య కె.శ్రీనివాసరావు, సభ్యులు ఆచార్య వెంకటసుబ్బయ్య, జిఎంజె. రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - చేబ్రోలు (గుంటూరు జిల్లా)

ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో రైల్వే ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నారా కోడూరులోని కొత్తపల్లి ప్రాంతానికి చెందిన తుమాటి వీరభద్రయ్య (38) కొన్నేళ్లుగా రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లోని ఒక గదిలో ఉరి వేసుకున్న సంఘటనను చూసిన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించారు. ఆర్థిక ఇబ్బందులు ఆత్మహత్యకు దారి తీసి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.

కలుషిత ఆహారం తిని ఇద్దరు మృతి

ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- హిందూపురం టౌన్

కలుషిత ఆహారం తిని ఇద్దరు మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లా హిందూపురం పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కంసలపేటలో ఆచారి పనిచేసుకుంటున్న ప్రదీప్ ఆచారి(33), శివ(34)లు ఒక గదిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. రోజులాగే పక్కన ఉన్న హోటల్ నుంచి టిఫిన్ తీసుకొచ్చి తిన్నారు. ఆ సమయంలో వారి స్నేహితుడు బాలాజి వారి గదికి వచ్చాడు. వచ్చిన వెంటనే అతన్ని కూడా టిఫిన్ తీనాలని కోరారు. అతను తింటుండగానే ప్రదీప్ ఆచారి నోటిలో నురుగువచ్చి కిందకు పడిపోయాడు. కొంతసేపటికి మరో యువకుడు శివ సైతం స్పృహ కోల్పోయి పడిపోయాడు. మరికొంతసేపటికి బాలాజి సైతం కల్లుతిరిగి పడిపోయాడు. స్థానికులు ముగ్గురిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రదీప్ మృతి చెందాడు. శివ పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలాజి ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. ఇది కలుషిత ఆహారం తినడంతో జరిగిందా లేక ఆత్మహత్యనా అన్న కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూర్పు విద్యుత్ సంస్థకు డైమండ్ అవార్డు

ప్రజాశక్తి-జిల్లాపరిషత్ (విశాఖపట్నం)

గ్రామీణ విద్యుద్దీకరణ పనులు సమర్థవంతంగా నిర్వహించినందుకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) ఇండియన్ స్మార్ట్ గ్రిడ్ ఫోరం (ఐఎస్‌జిఎఫ్) ఇన్నోవేషన్-2018లో డైమండ్ అవార్డు(మొదటి బహుమతి)ను సొంతం చేసుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామీణ విద్యుద్దీకరణ సమర్థవంతంగా, 100 శాతం అమలు చేసినందుకు ఇపిడిసిఎల్‌కు ఈ అవార్డు లభించింది. ఐఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఇండియన్ స్మార్ట్ గ్రిడ్ వీక్-2018 పేరిట సదస్సు నిర్వహించారు. ఇందులో ఉత్తమ గ్రామీణ విద్యుదీకరణలో ఇపిడిసిఎల్‌ను మొదటి బహుమతికి ఎంపిక చేశారు. ఈ డైమండ్ అవార్డును కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి బిఎన్.శర్మ చేతుల మీదుగా ఇపిడిసిఎల్ సిఎమ్‌డి హెచ్.వై.దొర తరపున సిజిఎం వి.విజయనిర్మల అందుకున్నారు.

జల్సారాయుళ్లు అరెస్టు

ఫేస్‌బుక్ ఆసరాగా మోసం, ముఠా అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఫేస్‌బుక్‌లో ధనిక కుటుంబాల్లోని అమ్మాయిలను పరిచయం చేసుకుని వారి నుంచి భారీగా నగదు, బంగారం స్వాహా చేస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాను పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ కేసు వివరాలు వెల్లడించారు. ఏలూరు కొత్తపేటకు చెందిన దత్తి బాలాజీ, గూడ్స్ షెడ్డు రోడ్డుకు చెందిన సింహాద్రి బాలచందర్ అలియాస్ బాలు, తంగెళ్లమూడికి చెందిన పిల్లా సాయి దేవేంద్రనాయుడు, గ్జేవియర్ నగర్‌కు చెందిన విపర్తి ఫ్రాన్సిస్, కొత్తపేటకు చెందిన కొండి రాజేష్, దెందులూరు మండలం వీరభద్రరావుపురానికి చెందిన గుజ్జుల రాజీవ్, ఏలూరులోని చాణిక్యపురి కాలనీకి చెందిన తుమ్మలపల్లి అశోక్‌కుమార్ స్నేహితులు. వీరంతా కొంతకాలంగా తాము జనసేన పార్టీ కార్యకర్తలమని, తమకు పవన్‌కళ్యాణ్‌తోపాటు ఇతర హీరోలు బాగా తెలుసని ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. బాలాజీ, బాలు, దేవేంద్ర నగరంలో ధనిక కుటుంబాల్లోని అమ్మాయిలకు ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపి, సినీ హీరోలను పరిచయం చేస్తామంటూ వారితో చాటింగ్ చేస్తూ, వారి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను తెలుసుకుంటూ, ఫొటోలను సేకరించారు. తమ వ్యాపారానికి కొంతసొమ్ము అవసరమైందని అడుగుతున్నారు. ఇవ్వడానికి నిరాకరిస్తే ఛాటింగ్ వివరాలను, ఫొటోలను నెట్‌లో పెడతామని బెదిరించడంతో అనివార్యంగా అమ్మాయిలు కొంత సొమ్ము ముట్టజెప్పారు. స్థానిక కళాశాలలో చదువుతున్న ఏలూరుకు చెందిన ఒక ప్రముఖ జ్యూయలర్స్ దుకాణ యజమాని కుమార్తెతో బాలాజీ రెండేళ్ల క్రితం ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పర్చుకున్నాడు. ఆమెను బెదిరిస్తూ దఫదఫాలుగా మూడున్నర కిలోల బంగారు నగలను బలవంతంగా తీసుకున్నాడు. వాటిని నగరంలోని ముత్తూట్, మణిపురం, యాక్సిస్‌బ్యాంక్ వంటి సంస్థల్లో స్నేహితుల ద్వారా తాకట్టు పెట్టాడు. వచ్చిన సొమ్ముతో తన స్నేహితులతో కలిసి 40 సార్లు గోవా పర్యటనకు వెళ్లొచ్చారు. అతి ఖరీదైన కెటిఎం డ్యూక్, కవాసకీ నింజా, చవర్లేట్ కారు, యాపిల్ కంపెనీకి చెందిన నాలుగు ఫోన్లు, ఎసి, టివి, వినియోగిస్తున్నారు. తనను మోసగించి బంగా రం అపహరించారంటూ బాధిత యువతి ఐదు రోజుల క్రితం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు గురువారం రాత్రి నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, నమ్మలేని నిజాలు వెలుగుచూశాయి. పోలీసులు శుక్రవారం వారిని కోర్టులో హాజరు పరిచారు. వీరి వద్దనుంచి కోటి రూపాయల విలువైన 3,424 గ్రాముల బంగారం, ఎనిమిది లక్షల విలువ చేసే కారు, నాలుగు లక్షల విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలు, రెండు లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి రవిప్రకాష్, వెనుకభాగంలో నిందితులు

సంక్షిప్తం

వడదెబ్బకు వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-అనంతగిరి (విశాఖపట్నం)

మార్చి రెండో వారంలోనే వడదెబ్బ తీవ్రత పెరుగుతోంది. విశాఖ మన్యంలో వడదెబ్బ తగిలి ఓ గిరిజనుడు మృత్యువాత పడ్డాడు. అనంతగిరి మండలం లుంగపర్తి పంచాయతీ తెలగలపాడు గ్రామానికి చెందిన జన్ని గాసన్న (58) శుక్రవారం పొలం పనులు చేస్తుండగా, ఎండ దెబ్బకు అకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోయాడు. అస్వస్థతకు గురైన గాసన్నను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వడదెబ్బకు గురై మృతి చెందిన గాసన్న కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.20 లక్షల బంగారం చోరీ

ప్రజాశక్తి-గుడివాడ(కృష్ణా)

స్నేహం పేరుతో మోసగించి ఇంట్లో లేని సమయంలో తాళాలు తెరచి రూ.20 లక్షల బంగారాన్ని దొంగిలించిన ఓ మహిళను కృష్ణా జిల్లా గుడివాడ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి సర్వశ్రేష్ట త్రిపాఠి మాట్లాడుతూ ఈ కేసు వివరాలను తెలిపారు. గుడివాడలోని బేతవో లుకు చెందిన సమ్మెట నాగలీలావతి, బండి నాగత్రివేణిలు స్నేహితులు. సమ్మెట నాగలీలావతి ఇంటికి తరచూ త్రివేణి వస్తూ ఉండేది. నాగలీలావతి కుటుంబ సభ్యులు ఊరు వెళుతున్నారనే విషయం తెలుసుకున్న త్రివేణి ఫిబ్రవరి 11వ తేదీ మధ్యాహ్నం తాళాలు తెరచి బీరువాలో దాచిన 24 రకాల బంగారపు వస్తువులను దొంగిలించి యథావిధిగా ఇంటికి తాళం వేసి వెళ్లిపోయిందని వివరించారు. త్రివేణిపై అనుమానంతో విచారించగా ఆమె చేసిన నేరాన్ని ఒప్పుకుందన్నారు. చోరీ చేసిన 448.88గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

సంపాదకీయం

హదియాకు స్వేచ్ఛ

పాతికేళ్ల కేరళ యువతి హదియా వివాహానికి సంబంధించి సుప్రీం కోర్టు గురువారం నాడు వెలువరించిన తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛకు పట్టం గట్టింది. హదియా తన ఇష్టప్రకారమే షఫీన్ జెహాన్ అనే ముస్లిం యువకుణ్ణి పెళ్లి చేసుకుంటే దానిని అడ్డుకునే హక్కు ఏ న్యాయస్థానానికి లేదని సుప్రీం స్పష్టీకరించడం ముదావహం. హదియా తాను ఇష్టపడి జెహాన్‌ను పెళ్లి చేసుకున్నానని పదే పదే చెప్పినా వినకుండా, ఆమె ఎవరో నడిపిస్తే నడుస్తున్నారని పోలీసులు, దర్యాప్తు సంస్థలు కట్టుకథలల్లితే వాటినే పరమ సత్యంగా భావించి కేరళ హైకోర్టు గత ఏడాది మే నెలలో ఇచ్చిన తీర్పును సుప్రీం నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. హదియాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దింది. న్యాయం కోసం గత పది మాసాలుగా ఆ కోర్టు నుంచి ఈ కోర్టుకు తిరగుతూ హదియా అనుభవించిన మానసిక క్షోభ భారత దేశంలో మరే మహిళకు పట్టకూడని విధంగా సుప్రీం చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన వ్యక్తి స్వేచ్ఛకు ఈ తీర్పు పట్టం గట్టడమే కాదు, హదియా వివాహంపై నానా యాగీ చేస్తున్న కాషాయ మూకలకు ఇదొక చెంపపెట్టు. కొత్త దంపతులను విడదీసి పైశాచికానందం పొందే పరివార్ మూకలు ఈ తీర్పు తరువాత కూడా బుసలు కొడుతున్నాయి. అందులో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, ప్రజాతంత్రయుతంగా పనిచేయాల్సిన దర్యాప్తు సంస్థలు హదియా స్వేచ్ఛను హరించాలని చూడడమే బాధాకరం. ఆరెస్సెస్, బిజెపి ఎజెండాకు అనుగుణంగా దర్యాప్తు సంస్థలు వ్యవహరించడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. వీరి దన్ను చూసుకునే మనువాదులు పెట్రేగేపోతున్నారు. ప్రేమబంధానికి ఉగ్రవాద ముద్రను అంటగట్టి ఆ నవ దంపతులను వేధిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కలచి వేస్తోంది. హదియా ఎవరి అదుపులోనూ ఉండనవసరం లేదనీ, తనకు నచ్చిన వ్యక్తితో జీవించవచ్చునని తీర్పు సుప్రీం స్పష్టం చేసిన తరువాత కూడా ఆమె భర్తకు ఉగ్రవాదంతో సంబంధముందన్న కోణంలో దర్యాప్తు సంస్థలు వెంటాడుతున్నాయి. జెహానాకు ఉగ్రవాదంతో సంబంధాలున్నట్లు ఆధారాలుంటే అరెస్టు చేయవచ్చు. కానీ, ఇన్ని నెలలైనా ఒక్క ఆధారం సేకరించకుండా ఇంకా దర్యాప్తు కొనసాగింపు పేరుతో వెంటాడడంలో ఔచిత్యమేమిటి? దర్యాప్తు సంస్థలను ఆ దిశగా నడిపిస్తున్నదెవరో తెలుస్తునే వుంది. దర్యాప్తు సంస్థల పరిస్థితి పంజరంలో బందీ అయిన చిలుకల్లా తయారైందని సుప్రీం ఎన్నడో చెప్పింది. కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ చేతిలో పావులుగా ఇవి వ్యవహరిస్తున్నంతకాలం ఇవి ప్రజల విశ్వాసాన్ని చూరగొనలేవు.

హదియా కేసులో కేరళ హైకోర్టు వెలువరించిన తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానం మొదటి నుంచి ఆగ్రహంతో వున్నది. యుక్తవయస్కురాలైన ఒక మహిళ వివాహాన్ని రద్దుచేసే విషయంలో మీకున్న అధికారాలు ఏమిటో చూసుకున్నారా? అని గతంలోనే నిలదీసింది. ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా చేసుకున్న పెళ్ళిని న్యాయస్థానాలు రద్దుచేయగలవా?, వారి నిర్ణయంలో జోక్యం చేసుకొనే అధికారం వాటికి ఎక్కడిది?' అని సుప్రీం ధర్మాసనం సూటిగా నిలదీసింది. ఆమె తనకు తగిన వ్యక్తిని ఎంచుకున్నదా లేదా, ఈ వివాహం ఆమె ప్రయోజనాలను కాపాడుతుందా లేదా అన్న విషయాలను కూడా న్యాయస్థానాలు నిర్ధారించలేని, నిర్ధారించకూడని అంశాలని తిరుగులేని రూలింగ్ ఇచ్చింది.

పాతికేళ్ళ వయసున్న తాను మనసావాఛా ఇష్టపూర్వకంగానే షఫీన్ జహాన్‌ను వివాహం చేసుకున్నానని, తనకు నచ్చినమేరకే అతని మతాన్ని స్వీకరించాననీ, సునిశితంగా ఇస్లాంను అధ్యయనం చేసిన తర్వాతే తాను మతం మార్చుకున్నానని, ఈ ప్రక్రియ మొత్తంలో ఎక్కడా ఎవ్వరి ఒత్తిడీ తనపై లేదని నవంబరులో సుప్రీంకోర్టు ముందు హదియా వెళ్లబోసుకున్న గోడును చూసి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు చలించిపోయారు. హదియా మొత్తంలో అతిపెద్ద చిక్కుగా భావించేది ఆమె భర్తకు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే అంశం. నేరపూరితమైన ఈ కోణంలో సాగాల్సిన దర్యాప్తు హదియా వ్యక్తిగత స్వేచ్ఛ, స్వతంత్రతలకు భంగం కల్గించడం, ఆమెను ఇబ్బందులకు గురిచేయడం ఎంతమాత్రం అనుమతించరానిది. హిందూత్వ శక్తులు ప్రత్యేకంగా దృష్టి నిలిపిన ఒక్క కేరళలోనే హదియా లాంటి 89 జంటల కేసులను 'లవ్ జిహాదీ' కేసులుగా జాతీయ దర్యాప్తు సంస్థ వెంటాడివెంటాడి వేధింపులకు గురి చేస్తోందంటే దేశంలో ఎంతటి ప్రమాదకర పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు.

మతతత్వ శక్తుల ఒత్తిళ్లకు తలొగ్గిన సొంత కుటుంబ సభ్యులే స్వచ్ఛమైన తమ ప్రేమకు ఉగ్రవాద కోణాలను అంటగట్టి ఛీకొట్టినా, న్యాయస్థానాల్లో కేసులు, దర్యాప్తు సంస్థల విచారణలు ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా నిత్య మానసిక సంఘర్షణలోనూ అలుపెరగక సంయమనంతో హదియా, ఆమె భర్త షఫీన్ సగౌర్వంగా సర్వోన్నత న్యాయస్థానంలో విజయం సాధించిన తీరు, వారి మొక్కోవని పోరాట స్ఫూర్తి ఎంతైనా ప్రశంసనీయం.వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో కుటుంబాన్ని ధిక్కరించవచ్చా? అని పితృస్వామ్యవాదులు కొందరు లేవనెత్తిన ప్రశ్నకు వ్యక్తిగత స్వేచ్ఛే ముఖ్యమని సుప్రీం కోర్టు తిరగులేని రీతిలో సమాధానమిచ్చింది. అందుకే ఈ తీర్పుఅనేక విధాలుగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇదీ విషయం



ఇదేం వింత కాపురమో
అంతుపట్టడం లేదు...
పదవులు మాత్రమే త్యాగం
అనుబంధం వీడలేదు!


ప్రజలు వేరు ప్రభువు వేరు
ఆంధ్రుల దుస్థితి...
జనం కళ్ళు తెరవకుంటే
మారదు ఈ దుర్గతి!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

ఉత్పత్తి రంగాన్ని ఉద్ధరించేది ఇలాగేనా?

2018-19 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ రూ.1.91 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌ను 'వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్' అంటూ మరో ఉప బడ్జెట్‌ను వ్యవసాయ శాఖ మంత్రి ప్రవేశపెట్టారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా అంకెలు పెంచి భారీ బడ్జెట్‌గా చూపించారు. సహజంగా బడ్జెట్‌లో ఉత్పత్తి రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం పెరుగుదల అంతంత మాత్రంగానే ఉంది. ఈ రెండు రంగాల్లో ఉత్పత్తి పెరగకుండా రాష్ట్రాభివృద్ధి అసాధ్యం. రాష్ట్ర ఆర్థిక స్థూల ఉత్పత్తి పెరుగుదల రేటును 2018-19కి 11.07 శాతానికి అంచనా వేశారు. 2015-16లో మత్స్య శాఖ ఉత్పత్తిని కలిపి 13.01 శాతంగా వృద్ధి రేటు చూపారు. కానీ వ్యవసాయ శాఖను మాత్రం నిర్లక్ష్యం చేశారు. వ్యవసాయ రుణ మాఫీకి రూ.4100 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇదే చివరి బడ్జెట్ కావడంతో వచ్చే బడ్జెట్‌లో పూర్తి రుణ మాఫీ చెల్లిస్తారో లేదో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. 2018-19 సంవత్సరంలో వ్యవసాయానికి కేటాయించిన రూ.4100 కోట్లు రుణ మాఫీ తగ్గించి, వేతనాలను తగ్గిస్తే ఇక వ్యవసాయానికి మిగిలేదెంత? ప్రత్యేక బడ్జెట్ పేరుతో 18 శాఖల బడ్జెట్‌లను కలిపి రూ.19,000 కోట్లు ప్రకటించారంతే! పైకి మాత్రం భారతదేశంలోనే మొదటి రాష్ట్రంగా అభివృద్ధి చెందుతుందన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగిస్తున్నారు.




సారంపల్లి మల్లారెడ్డి

2017-18 సంవత్సరానికి రాష్ట్రంలో 166.70 లక్షల ఎకరాల సాగును లక్ష్యంగా పెట్టుకున్నారు. ఖరీఫ్, రబీ కలిసి 176.64 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు లక్ష్యంగా చేసుకున్నారు. 16 లక్షల ఎకరాలలో పంటలు వేయలేదు. 140 లక్షల టన్నులకు మించి ఆహార ధాన్యాల ఉత్పత్తి వస్తుందన్న నమ్మకం లేదు. కోటి ఎకరాలలో హార్టీకల్చర్ పంటలు వేసి ఎగుమతులు చేసి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. సుబాబుల్, జామాయిల్, పత్తి, కందులు, మిరప, కూరగాయలు వేసిన రైతులు పెట్టుబడులు రాక దివాళా తీస్తున్నారు. వ్యవసాయ ఆదాయాన్ని సుస్థిరం చేయడం ఈ ప్రభుత్వాల లక్ష్యం కాదు. అస్థిరంగా ఉంచుతూనే రైతులు తమ భూములు కోల్పోయే విధంగా ధరలు అమలు చేస్తున్నారు.

పారిశ్రామిక రంగాన్ని పరిశీలిస్తే ఈ మధ్య అవగాహనా సదస్సుల పేరుతో విశాఖపట్నంలో వరుసగా విదేశీ కంపెనీలను రాబట్టే ప్రయత్నం జరిగింది. కానీ అదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో 105 యూనిట్లు (పరిశ్రమలు) మూతపడ్డాయి. 38 వేల మంది కార్మికులు తొలగించబడ్డారు. మరో 6 వేల మందికి ఉద్వాసన జరగబోతున్నది. వ్యవసాయ రంగానికి రూ.9889 కోట్లు, పరిశ్రమలకు రూ.3075 కోట్లు మాత్రమే కేటాయింపులు చూపారు. కేటాయించిన పద్దులలో కూడా ఆ రంగానికి సంబంధించనివి ఉన్నాయి. వాస్తవంగా వ్యవసాయ రంగానికి రూ.2500 కోట్లు, పరిశ్రమలకు రూ.2000 కోట్లు కేటాయించినట్టు తెలుస్తుంది. ఇప్పటికే ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నాము. పంచదార, పత్తి, వంట నూనెలు, పప్పుధాన్యాలు, బట్టలు కూడా దిగుమతి అవుతున్నాయి. ఇంత జరుగుతున్నా రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నట్టు చెప్పడం ముఖ్యమంత్రికే చెల్లింది.

బడ్జెట్‌లో గ్రాంట్ల పేరుతో రూ.50,696 కోట్లు చూపారు. ఇందులో కేంద్రం నుండి అధిక మొత్తం వస్తుందని ప్రభుత్వ అంచనా. అయినప్పటికీ రూ. 24 వేల కోట్లు ద్రవ్య లోటు ఉంది. 2015-16లో రాష్ట్ర బడ్జెట్ రూ.1.13 లక్షల కోట్లు కాగా 2018-19 బడ్జెట్ రూ.1.91 లక్షల కోట్లకు పెరిగింది. బడ్జెట్ పెరుగుదలతో పాటు రాష్ట్ర రుణం కూడా అదే దామాషాలో పెరిగింది. 2018 మార్చి నాటికి అప్పు రూ.2.25 లక్షల కోట్లు వుండగా...2019 మార్చి నాటికి రూ.2.50 లక్షల కోట్లకు చేరుకుంటున్నదని బడ్జెట్ ధృవీకరిస్తున్నది. మద్యంపై రూ.7,357 కోట్ల ఆదాయం వస్తుంది. ఇందులో సగం కూడా వ్యవసాయానికి ఖర్చు చేయడం లేదు. రాష్ట్రంలోని పరిశోధనా కేంద్రాలన్నీ మూతబడ్డాయి. విదేశీ టెక్నాలజీని మనం దిగుమతి చేసుకుంటున్నాం. వ్యవసాయానికి అనుబంధంగా ఆదాయాన్ని పెంచుతామని ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం రోజున ప్రకటించారు. ఏరువాక పూర్ణిమ పథకాన్ని అమలు చేయడంతోపాటు కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి వారికి పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల పరిహారం, బీమా సౌకర్యం, ప్రభుత్వ రాయితీ పథకాలు అందిస్తానన్నారు. 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' చందంగా ఉంది.

వ్యవసాయానికి అనుబంధంగా ఆదాయాన్ని పెంచుతామని ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం రోజున ప్రకటించారు. ఏరువాక పూర్ణిమ పథకాన్ని అమలు చేయడంతోపాటు కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి వారికి పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల పరిహారం, బీమా సౌకర్యం, ప్రభుత్వ రాయితీ పథకాలు అందిస్తానన్నారు. 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' చందంగా ఉంది.



బలహీన వర్గాల స్థానమెక్కడ?

2014 నుండి దళితులకు ఉప ప్రణాళిక కింద రూ.40,356 కోట్లు, బడ్జెట్ కింద రూ.28,245 కోట్లు మొత్తం రూ. 68,601 కోట్లు కేటాయించారు. ఇందులో 2018-19 సంవత్సరానికి రూ.11,228 కోట్లు ఉప ప్రణాళిక కింద, రూ.4,278 కోట్లు బడ్జెట్ కింద చూపారు. అలాగే గిరిజనులకు రూ.27,566 కోట్లు బడ్జెట్, ఉప ప్రణాళిక కింద చూపారు. ఇందులో 2018-19 సంవత్సరానికి బడ్జెట్ కింద రూ.2,129 కోట్లు, ఉప ప్రణాళిక కింద రూ.4,176 కోట్లు చూపారు. ఈ రెండు రంగాలకు కేటాయించిన నిధులలో కనీసం 70 శాతం ఖర్చు చేసినా ఈ రోజు సమాజంలో వారి స్థితికి గుర్తింపు వచ్చేది. వేల కోట్ల కేటాయింపులు ఏమైనట్టు? ఈ రెండు రంగాలకు కలిపి ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు రూ.96,167 కోట్లు కేటాయింపులు చూపారు. ఆచరణకు నోచుకోని కేటాయింపులు ఎందుకు? తలసరి ఆదాయం పెరగుతున్నా దరిద్రుల సంఖ్య ఎందుకు పెరుగుతున్నది. 52 శాతంగా ఉన్న వెనుకబడిన తరగతుల వారికి కేటాయించింది రూ. 6,213 కోట్లు మాత్రమే. మైనార్టీలకు రూ.1102 కోట్లు, 50 శాతంగా ఉన్న స్త్రీ, శిశు, వికలాంగులకు రూ.3,008 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ కేటాయింపులతో ఈ వర్గాలకు ఏ మాత్రం లబ్ధి చేకూరుతుంది? పోనీ, ఈ కేటాయింపులన్నా వ్యయం చేస్తున్నారంటే అదీ లేదు.

బడ్జెట్లు కేవలం పాలకుల ఆత్మ సంతృప్తి కొరకే తప్ప ప్రజల సమస్యలను పరిష్కరించేలా లేవు. వనరులను ఎక్కువగా చూపి కేటాయింపులు చేసి ఆ తరువాత ఖర్చు చేయని అనైతిక విధానం కొనసాగుతున్నది. నైతికంగా బడ్జెట్ కేటాయింపులు తప్పనిసరిగా వ్యయం చేయాలన్న రాజ్యాంగ నిబంధనా లేకపోవడం వల్ల పాలకులు రివైజ్డ్ పేరుతోగానీ, వాస్తవ వ్యయం పేరుతోగానీ తమకు తోచిన పద్దులకు ఖర్చు చేస్తున్నారు.

బడ్జెట్‌లో మొదటి ప్రాధాన్యత ఉత్పత్తి రంగాలైన వ్యవసాయం, పరిశ్రమలకు ఇవ్వాలి. ఆ తరువాత విద్య, వైద్యానికి కేటాయింపులు చేయాలి. బడ్జెట్‌లో చేసే వ్యయం ప్రభుత్వానికి ఆస్తులు సంపాదించేదై ఉండాలి. కేంద్రం నుండి గానీ, ఇతర ప్రాంతాల నుండి వచ్చే గ్రాంట్లను ప్రతి రూపాయిని సద్వినియోగం చేయాలి. పాలక వర్గాల ప్రయాణాలకు, ఆడంబరాలకు వృథా వ్యయం చేయరాదు. టూరిజం పేరుతో చేసే వ్యయం కూడా తిరిగి రావడం లేదు. ప్రజల జీవన ఆదాయాన్ని పెంచే దిశగా పాలక వర్గ విధానాలుండాలి. ఆకలికి ఏ ఒక్కరు బలి కాకుడదు. 96 శాతం విద్యను 2 సంవత్సరాలలో పూర్తి చేయాలి. ప్రభుత్వ వైద్యశాలలను మెరుగుపర్చి మందులు, డాక్టర్లను అందుబాటులో పెట్టాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోగులు వచ్చే విధంగా ఉండాలి. 14 సంవత్సరాల వరకు ఉచిత భోజనం, బట్టలు, పుస్తకాలు ఇచ్చి విద్యను ప్రోత్సహించాలి. పదవ తరగతి వరకు ప్రయివేటు విద్యను అనుమతించకూడదు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, రెండవ ఎఎన్‌ఎమ్‌లను ప్రోత్సహించి అక్ష్యరాస్యత పెంపుదలకు, పిల్లలను సమీకరించడానికి వారి తోడ్పాటును తీసుకోవాలి. గ్రామ స్థాయివరకు రైతు కమిటీలు వేసి వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు కృషి చేయాలి. వ్యవసాయ పరిశోధనలు నిరంతరం సాగించాలి. విదేశీ టెక్నాలజీపై ఆధారపడకూడదు. వ్యవసాయ రంగంలోకి ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి. వ్యవసాయోత్పత్తుల ధరలను రాష్ట్ర ప్రభుత్వమే పెట్టుబడి వ్యయం ఆధారంగా నిర్ణయించి రాష్ట్ర అవసరాల మేరకు కొనుగోలు చేయాలి. ప్రాథమికంగా చదువుకున్నవారికి వృత్తి నైపుణ్యం పెంచడానికి నిరంతర శిక్షణా తరగతులు అమలు చేయాలి.

పైవిధంగా ప్రణాళిక రూపొందించి ప్రస్తుత బడ్జెట్‌ను ప్రణాళిక బద్ధంగా కేటాయించి ఖర్చు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. కానీ, కార్పొరేటు విధానాలను బలపరిచే శక్తులు ఈ విధానాలను అమలు జరగనివ్వవు. అలాంటప్పుడు బడ్జెట్‌కు సార్థకత ఏముంటుంది? కాగితాలకే పరిమితం అయిన బడ్జెట్ ఎంత భారీగా వున్నా ఏం లాభం?ఉత్పత్తి రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే ఏం జరుగుతుందో సోమాలయా అనుభవం మన ముందున్నది. ఈ విషయం గుర్తెరిగి పాలకులు వ్యవహరించాలి.

(రచయిత అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు, సెల్ : 9490098666)

సమాచారం

ఆ పదాలకు అర్థాలే వేరు



రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉపయోగించే పదాలు తెలుగు, ఆంగ్లంలోకి మారాయి. కానీ రెవెన్యూ శాఖలో మాత్రం చక్రవర్తులు, నిజాం కాలంనాటి పదాలే నేటికీ వాడుకలో ఉన్నాయి. వీటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

గ్రామ కంఠం

గ్రామంలో నివసించడానికి కేటాయించిన భూమినే గ్రామ కంఠం అంటారు. ఇది గ్రామానికి చెందిన ఉమ్మడి స్థలం. దీనిలో ప్రభుత్వ సభలు, సమావేశాలు నిర్వహించుకోవచ్చు.

అసైన్డ్ భూమి

భూమి లేని నిరుపేదలకు సాగు చేసుకోవడానికి, ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం మంజూరు చేసిన భూమిని అసైన్డ్ భూములుగా పేర్కొంటారు. ఈ భూమిని వారసత్వ సంపదగా అనుభవించాల్సిందే గాని ఇతరులకు అమ్మడానికి, బదలాయించడానికి వీలుండదు.

ఏ డబ్ల్యూ భూములు

శిస్తును నిర్ధారించిన ప్రభుత్వ భూములు లేదా అసైన్డ్ వేస్ట్ ల్యాండ్ అంటారు. శిస్తు కట్టిన ఏ డబ్ల్యూ భూములు మెట్ట భూములైతే ల్యాండ్స్ అంటారు. వీటిని భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేసే అవకాశం ఉంటుంది.

బంజరు భూమి

గ్రామం, మండల పరిధిలో ఖాళీగా, నిరుపయోగంగా ఉన్న భూములను బంజరు భూములుగా గుర్తిస్తారు. వీటిని రెవెన్యూ రికార్డులలో ప్రత్యేక గుర్తులతో సూచిస్తారు.

అగ్రహారం

పూర్వకాలంలో బ్రాహ్మణులకు శిస్తు లేకుండా తక్కువ శిస్తుతో ఇనాంగా అందజేసిన గ్రామం లేదా అందులో కొంత భాగాన్ని అగ్రహారం అంటారు.

అడంగల్

దీనినే పహాణి అని కూడా అంటారు. గ్రామంలోని సాగు భూముల వివరాలు ఈ దస్త్రం (రిజిస్టర్)లో నమోదు చేస్తుంటారు. దీన్నే గ్రామ లెక్కల మూడో నంబరు రిజిస్టర్‌గా పిలుస్తారు. ఆంధ్రాలో అడంగల్ అని పిలుస్తుండగా తెలంగాణాలో పహాణీగా వాడుకలో ఉంది.

చిట్టా

రోజువారీ వసూళ్లు తెలిపే రిజిస్టర్‌ను చిట్టా అంటారు. దీన్ని గ్రామ లెక్క నంబరు-6 అని అంటారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన నీటి పన్ను, భూమి శిస్తు వగైరాలను అసామీల వారీగా వసూలు చేసి రిజిస్టర్‌లో నమోదు చేస్తారు.

జమాబందీ

ప్రభుత్వానికి రావాల్సిన భూమి శిస్తు, నీటి పన్ను, ఇతర బకాయిలు సక్రమంగా లెక్క కట్టడం. రెవెన్యూ లెక్కల్లోకి తీసుకు వచ్చారా లేదా అని నిర్ధారించడం, గ్రామ, మండల రెవెన్యూ లెక్కల విస్తృత తనిఖీలను జమాబందీ అంటారు.

అజమాయిషీ

భూమికి సంబంధించి గ్రామ రెవెన్యూ అధికారి నిర్వహించే గ్రామ లెక్కలు ఉన్నదీ, లేనిదీ తనిఖీ చేయడాన్ని అజమాయిషీ అంటారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో రాసిన లెక్కల్లోని వివరాలను సంబంధిత తహశీల్దారు, ఉప తహశీల్దారు తనిఖీలు నిర్వహించాలి. తనిఖీ చేసిన వివరాలను గ్రామ లెక్క నంబరు 3లో నమోదు చేయాలి. ఈ విధంగా అజమాయిషీని ఏటా నిర్వహించాల్సి ఉంటుంది.

దస్తావేజు

భూములకు సంబంధించిన కొనుగోళ్లు, అమ్మకాలు, కౌలుకు ఇవ్వడం, ఇతర లావాదేవీలను తెలియజేసే పత్రం. భూ బదలాయింపులు చేసే సమయంలో ఈ దస్తావేజులను చట్టపరంగా, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ)

భూ స్వరూపాన్ని తెలియ జేసే ధ్రువపత్రం. 32 ఏళ్లలోపు ఓ సర్వే నంబరు భూమికి గల లావాదేవీలను తెలియజేస్తుంది.

బందోబస్తు

వ్యవసాయ భూములను సర్వే నిర్వహించి వర్గీకరణ చేపట్టడాన్ని బందోబస్తుగా పేర్కొంటారు.

బీమెమో

ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్న వ్యక్తికి శిస్తు చెల్లించాలని ఆదేశిస్తూ ఇచ్చే నోటీసు. అర్హులైతే కొనసాగిస్తారు. అనర్హులైతే తొలగిస్తారు.

ఫసలీ

ఏటా జులై 1 తర్వాత నుంచి తర్వాత సంవత్సరం జూన్ 30 వరకు ఉన్న 12 నెలల కాలాన్ని 'ఫసలీ' అంటారు. ఈ పదం మొఘల్ చక్రవర్తుల కాలం నుంచి వాడుకలో ఉంది.

ఎకరం

ఇది భూమి విస్తీర్ణానికి కొలమానం. 4,840 చదరపు గజాల స్థలం లేదా 100 సెంట్లు (సెంటు అంటే 48.4 గజాల స్థలం) లేదా 40 కుంటలు (కుంట అంటే 121 చదరపు గజాల స్థలం). వీటిని ఎకరంగా పరిగణిస్తారు.

- అప్పారావు, తహశీల్దారు, ఉంగుటూరు.

జన వాక్యం

పిచ్చి నమ్మకాలు



వాస్తు పేరుతో వున్న ఇంటిని, కార్యాలయాలను కూల్చేసే వాళ్లు మనకు కోకొల్లలుగా కనబడుతుంటారు. ఈ పిచ్చి వున్న వాళ్లు వాస్తు చెప్పే వాళ్ల బూటకపు మాటలను తూచ తప్పకుండా పాటిస్తారు. ప్రభుత్వాలు వీటిపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి. కానీ పాలకులే వాస్తు పిచ్చిలో మునిగి తేలుతున్నారు. వీరి వల్ల సమాజానికి చేటే గాని మేలు కలగదు. ఇక సంఖ్యా శాస్త్రం చూస్తే, ఆంగ్ల పదాలకు కొన్ని అంకెలు కేటాయించి పేరులో మార్పు చేసుకుంటే అదృష్టం వస్తుందని చెప్పి డబ్బు గుంజుతున్నారు. కష్టపడకుండా పేరులో మార్పులు చేసుకుంటే ఐశ్వర్యవంతులు ఎలా అవుతారు? ఇలా ఒకటా రెండా ఎన్ని శాస్త్రాలో? ప్రజలను మోసం చేయడానికే తప్ప ఎందుకు పనికిరావు. సోమరితనం ఎక్కువై శారీరక శ్రమ చేయని వారే ఇలా రోజుకో శాస్త్రాన్ని చెప్పి ప్రజలను నాశనం చేస్తున్నారు. ఇలాంటి వారి మాయలో పడి ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకోవద్దు.

విరాజిత, ఇమెయిల్ ద్వారా.


వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

సందర్భం

ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) నిర్వచనం ప్రకారం ఆరోగ్యం అంటే కేవలం జబ్బు లేకపోవడమే కాదు. ఒక మనిషి శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఆరోగ్యంగా ఉండటమే సంపూర్ణమైన ఆరోగ్యం అవుతుంది. 1946లో స్వాతంత్ర్యం రాక పూర్వం, నియమించిన భోర్ కమిటీ నివేదిక ప్రకారం కూడా ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత.

భారత రాజ్యాంగ పీఠిక ప్రకారం ప్రజల ఆరోగ్య స్థాయిలను మెరుగు పరిచే బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించాలి. తన ప్రజలకు పుష్టికరమైన ఆహారాన్ని అందించడం ద్వారా, వారి జీవన ప్రమాణాలను పెంచడం ద్వారా ప్రజారోగ్యాన్ని మెరుగు పర్చవచ్చని, అది ప్రభుత్వ బాధ్యతని కూడా రాజ్యాంగం స్పష్టపరుస్తోంది. ఆర్టికల్ 39 ప్రకారం పిల్లలకు, కార్మికులకు ఆరోగ్య రక్షణ కల్పించాలి. పని ప్రదేశంలో న్యాయమైన, మానవత్వంతో కూడిన పని పరిస్థితులు కల్పించాలని ఆర్టికల్ 42 సూచించింది. పౌష్టికాహారాన్ని అందించడం, నివాసానికి అనుకూలమైన ప్రాంతాల్లో ప్రజలు జీవించేలా చూడటం ద్వారా ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చేలా కృషి చేయాలని ఆర్టికల్ 47 నిర్దేశించింది. పర్యావరణాన్ని కాపాడటం ద్వారా కాలుష్యం ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టాలని ఆర్టికల్ 48ఎ స్పష్టం చేస్తోంది. అంటే, ఈ అన్ని అంశాల ఆధారంగా ప్రజారోగ్యం-ప్రభుత్వ బాధ్యతే అని స్పష్టంగా చెప్పవచ్చు. 1978లో 'అల్మా అటా' ప్రకటనకి కట్టుబడి ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థకి చెందిన దేశాలు నిర్ణయించాయి. దాని ప్రకారం ప్రాథమిక ఆరోగ్య సేవలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి. ప్రజలందరి ఆరోగ్యాన్ని పరిరక్షించాలి. అయితే మన దేశం ఇంతవరకు ఆ లక్ష్యాన్ని చేరుకోలేదు. పైగా ఇతర దేశాలతో పోలిస్తే ఆరోగ్యపరంగా చాలా వెనుకబడింది. అంతేకాక 2000 నాటికి 'అందరికీ ఆరోగ్యం' లక్ష్యాన్ని చేరుకోవాలని భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేసింది. అయితే ఆచరణలో అలసత్వం వల్ల లక్ష్యాన్ని చేరుకోకపోగా పరిస్థితులు ఇంకా దిగజారాయి.




పి దక్షిణామూర్తి

జాతీయ ఆరోగ్య రక్షణ పథకం

ఈ సంవత్సరం గాంధీ జయంతి నుండి 'జాతీయ ఆరోగ్య రక్షణ పథకం' ప్రారంభిస్తామని బడ్జెట్లో ప్రకటించారు. దీని ద్వారా పది కోట్ల పేద కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని అంటున్నారు. పైగా ప్రపంచంలోనే ఏ ప్రభుత్వమూ ఇంత పెద్ద పథకాన్ని ఆరోగ్య రంగంలో అమలు చేయట్లేదని ప్రభుత్వంలోని పెద్దలు దీన్ని 'మోడీ కేర్' గాను 'నమో కేర్' గాను ఆకాశానికెత్తుతున్నారు. 'ఆయుష్మాన్ భారత్'గా పేర్కొంటున్న ఈ ఆరోగ్య బీమా పథకం ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలను, బడా కార్పొరేట్, ప్రయివేట్ ఆస్పత్రులను ఆదుకోవడానికే అని వేరే చెప్పనక్కర్లేదు. 'నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ 71వ రౌండ్' నివేదిక ప్రకారం ఏడాదిలో 4.4 శాతం పట్టణ ప్రజలు, 3.5 శాతం గ్రామీణ ప్రజలు మాత్రమే చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వారిలో కూడా అత్యధికులు ప్రయివేటు ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరే వారు సగటున గ్రామీణ ప్రాంతాల్లో రూ.21 వేలకు పైగా పట్టణ ప్రాంతాల్లో రూ.32 వేలకు పైగా ఉన్నారని గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఇంకా సగటున గ్రామీణ ప్రాంతాల్లో 86 శాతం ప్రజానీకానికి, పట్టణ ప్రాంతాల్లో 82 శాతం ప్రజానీకానికి ఎటువంటి ఆరోగ్య బీమా సౌకర్యమూ లేదు. ఇంతకు ముందే అంటే 2008లో ప్రవేశపెట్టిన 'రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన' కానీ 2015 నుండి అమలులో ఉన్న 'స్వాస్థ్య సురక్షా బీమా యోజన' కానీ విఫల ప్రయోగాలని తెలుస్తూనే ఉంది. అంటే ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎంతో చేయాల్సి ఉన్నా, చిత్తశుద్ధి లేకపోవడం వల్ల వైద్య ఆరోగ్య రంగాలను మార్కెట్ శక్తులకు వదిలివేస్తున్నారు. అంటే ఈ విధానం ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రయివేటు ఆస్పత్రులకు వరంగా మారుతోంది.

ఆరోగ్యం అందరికీ కలేనా!



అంతేకాక దేశ వ్యాప్తంగా లక్షన్నర స్వస్థత కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఈ కేంద్రాల్లోనే అన్ని ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, సాధారణ వ్యాధులకు చికిత్సలు లభిస్తాయని, అత్యవసరానికి మందులు దొరుకుతాయని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా చేస్తారని చెప్పడమే కాక మాతా శిశు వైద్యం కూడా ఇక్కడే లభిస్తుందని ఊదరగొడుతున్నారు. అయితే లక్షన్నర స్వస్థత కేంద్రాలకు కేటాయించింది రూ.1200 కోట్లే! ఏడు నుండి 8 వేల మంది ఆరోగ్య అవసరాలకు తీర్చడానికి ఉద్దేశించిన సెంటరుకు ఏడాదికి కేటాయించింది కేవలం రూ.80 వేలు అంటే తల ఒక్కింటికి పది రూపాయలతో అదీ సంవత్సరానికి 'అన్నీ' ఎలా వచ్చేస్తాయో పెద్దలే శెలవివ్వాలి!

క్షయ వ్యాధి బాధితులకు పౌష్టికాహార నిమిత్తం నెలకు రూ.500 ఇచ్చే పథకం ఇంకొకటి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రతి ఏటా సుమారు మన దేశంలో 28 లక్షల కొత్త క్షయ కేసులు నమోదవుతున్నాయి. ఒక్కొక్క రోగికి నెలకి రూ.500 ఇవ్వాలంటే సంవత్సరానికి రూ.1680 కోట్లు కావాలి. కానీ కేటాయించింది రూ.600 కోట్లే! అంటే ఒక్కొక్కరికి నెలకి రూ.175 మాత్రమే. ఇక దేశంలో నాణ్యమైన వైద్య విద్య, ఆరోగ్య పరిరక్షణ లభ్యతను పెంచేందుకు ప్రస్తుతమున్న జిల్లా ఆస్పత్రుల స్థాయిని పెంచడం వల్ల కొత్తగా 24 ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రులను ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. దీనివల్ల ప్రతి రాష్ట్రంలోనూ మూడు పార్లమెంటరీ నియోజక వర్గాలకు కనీసం ఒక్కటి చొప్పునైనా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పడుతుందని చెప్పారు. వాస్తవానికి ప్రతి వెయ్యి మంది జనాభాకి కనీసం ఒక డాక్టరు ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలు నిర్దేశిస్తున్నాయి. మన దేశంలో ఇంకా అది 1674 మందికి ఒక డాక్టరుగానే ఉంది. ప్రతి ఏటా సుమారు 45-50 వేల మంది వైద్యులు 25 వేల మంది పోస్టు గ్రాడ్యుయేట్ వైద్యులు 479 కళాశాలల నుండి ఉత్తీర్ణత సాధిస్తున్నా అసలు డిమాండ్‌కు ఇంకా చాలా దూరంలోనే ఉన్నామని అర్థమవుతోంది. ఒక అధ్యయనం ప్రకారం ఇంకా దాదాపు 5 లక్షల మందికి పైగా డాక్టర్ల అవసరం దేశానికి వుంది. మరి 24 వైద్య కళాశాలల నుండి ఎంత మంది డాక్టర్లు వస్తారో, భారత ప్రజల ఆరోగ్య అవసరాలకు తీర్చడానికి ఎన్ని వైద్య కళాశాలలు అవసరమో ఈ ప్రభుత్వానికి తెలియంది కాదు.

ఆరోగ్యం వ్యాపార సరుకుగా మారే పరిస్థితిని అరికట్టాలంటే ప్రభుత్వ వైద్య ఆరోగ్య రంగాన్ని పటిష్టపరచాలి. సమగ్రమైన ప్రాథమిక ఆరోగ్య విధానం మాత్రమే ఉచిత సార్వజనీన ఆరోగ్య సేవలని అందించగలదు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వైద్య విధానం రూపొందించ గలదు. నిధుల కేటాయింపు పెరగాలి. వైద్య సిబ్బంది నైపుణ్యం పెరగాలి. అందరికీ ఆరోగ్యాన్ని అందించాలనే సంసిద్ధత పెంపొందాలి. సామాజిక భాగస్వామ్యం పెరగాలి. ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులోకి రావాలి. ఆరోగ్యాన్ని ఒక వరంగా కాక ఒక ప్రాథమిక హక్కుగా చూసిన నాడే ఇది సాధ్యమవుతుంది. సోషలిస్టు సమాజంలో, ఇతర దేశాల్లో ఈ మార్పు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆయా దేశాల నమూనాలు అధ్యయనం చేసి, మన దేశానికి అనుగుణమైన విధానాలు రూపొందిస్తే ప్రజారోగ్యం పట్ల మన లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోగలం.

('ప్రజారోగ్యం-ప్రభుత్వ బాధ్యత' నినాదంతో నేటి నుంచి రెండు రోజుల పాటు కర్నూలులో జరిగే ఏపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా)

ప్రజాశక్తి
jeevanapageps@gmail.com



ఇద్దరూ ఉన్నతంగా చదువుకున్న వారే. అతనో బ్యాంకు మేనేజర్. అయితే భార్యతోనూ మేనేజర్‌లా వ్యవహరిస్తే ఆమె ఏం చేయాలి? భార్యాభర్తల మధ్య ఉండాల్సిన విషయాలు మూడో వ్యక్తికి చేరవేస్తే ఆమె ఏం చేయాలి? తను ప్రవర్తించే తీరు వల్లే ఆమె పుట్టింటికి వెళ్లిపోయిందనే విషయం తెలుసుకోలేని అతను .. ఆమె తల్లి కారణంగానే తనను వద్దంటుందిగానీ.. తమ మధ్య మాత్రం ఎలాంటి విభేదాలు లేవంటూ 'ఐద్వా అదాలత్'కు వచ్చాడు. చివరకు ఏమైందో తెలుసుకోవాలంటే ఈ వారం 'ఫ్యామిలీ కౌన్సెలింగ్'లోని 'కేస్‌స్టడీ' చదవండి.

ఫ్యామిలీ కౌన్సెలింగ్

ఐద్వా అదాలత్

అతనిదో లెక్క.. అదో తిక్క

అతని పేరు చంద్రశేఖర్. ఆమె పేరు చంద్రిక.

చంద్రశేఖర్‌కు ఒక తమ్ముడు ఉన్నాడు. చిన్నప్పటి నుంచి బాగా చదివేవాడు. ఆ తెలివితేటలే అతన్ని చిన్నవయస్సులోనే బ్యాంకు మేనేజర్ స్థాయికి చేర్చాయి. అతని తమ్ముడూ వేరే రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అంతా హాయిగా సాగిపోతున్న వీరి కుటుంబంలో అనుకోని విషాదం ముంచుకొచ్చింది. అదే చంద్రశేఖర్ తండ్రి హఠాన్మరణం. దీంతో అతను చాలా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. అతను కోలుకోవాలంటే బంధువుల సలహా మేరకు కొడుక్కి పెళ్లి చేయాలని నిర్ణయించింది తల్లి. ఆమె ప్రతిపాదనకు ముందు అంగీకరించని చంద్రశేఖర్ చివరకు ఒప్పుకున్నాడు. దాంతో పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టింది తల్లి. చంద్రిక సంబంధం ఆమె స్నేహితుల ద్వారానే వచ్చింది. ఫొటో చూడగానే ఎటువంటి భేషజాలు లేకుండా సింప్లీ సూపర్బ్ అని ఒప్పేసుకున్నాడు చంద్రశేఖర్.

చంద్రిక తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు. ఎంతో గారాబంగా పెంచారు. అయితే మొదటి నుండి చంద్రిక సౌమ్యత గల అమ్మాయి. గొడవలు అంటే ఆమడదూరం ఉంటుంది. అందరూ కలిసిమెలిసి ఉండాలనే తత్వం. చదువంటే ప్రాణం.. అందుకే ఆమె ఇష్టం మేరకు ఎంటెక్ వరకూ చదివించారు తల్లిదండ్రులు. క్యాంపస్ ఫస్టు వచ్చిన చంద్రిక సామాజికంగానూ కాస్త చైతన్యం గల అమ్మాయే. ఫొటోలో చంద్రశేఖర్‌ను చూసి తల్లిదండ్రులు చూసుకోవడానికి రమ్మందాం అంటే.. ఓకే అంది.

చూసీచూడగానే ఇరువైపులా అంగీకారం కుదరడంతో అట్టే రోజులు గడవకుండానే పెళ్లి చేసేద్దాం అన్నారు. అయితే అప్పటికి చంద్రిక చదువుకు చివరి స్టేజ్‌లో ఉంది. చదువు పూర్తయ్యాక చేసుకుంటానంది చంద్రిక. తర్వాత ముహూర్తాలు లేవు.. పెళ్లయ్యాకైనా చదువుకోవచ్చు అని ఆమె తల్లి తొందరపెట్టింది. తప్పక చదివిస్తాను అని చంద్రశేఖర్ కూడా హామీ ఇవ్వడంతో పెళ్లికి ఒప్పుకుంది చంద్రిక. ఎంగేజ్‌మెంట్ అయ్యింది. ఇద్దరూ రోజూ కాసేపు చాట్ చేసుకునేవారు. అదీ వారం కూడా గడవకుండానే పెళ్లి జరిగిపోయింది. అతనితో వెళ్లినా.. కొద్దిరోజులకే తన చదువు నిమిత్తం చంద్రిక మళ్లీ పుట్టింటికి వచ్చింది. ఆమె వెళ్లడం చంద్రశేఖర్‌కు నచ్చలేదు. దాంతో అతను ఫీలవుతాడని కొంత ప్రాజెక్టు వర్క్ అయ్యాక ప్రిన్సిపల్ పర్మిషన్ తీసుకుని, చంద్రశేఖర్

> **"సమస్య వచ్చినప్పుడే ధైర్యంగా నిలబడాలి. మొక్కవోని ధైర్యంతో జీవితంలో స్థిరపడాలి. నీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే ముందుకు వెళ్లమ్మా..**

దగ్గరకు వచ్చేసింది.. కొన్నిరోజులు బాగానే ఉన్నారు. ఆమె పరీక్షల సమయం రావడంతో మళ్లీ పుట్టింటికి బయలు దేరింది. ఇష్టంలేకుండానే పంపించాడు చంద్రశేఖర్. తీరా వెళ్లాక అతను వీకెండ్‌లో భార్య దగ్గరకు వెళ్లాడు. ఆమెతో అక్కడ సరైన ప్రైవసీ లేదనీ.. దీనికంతటికీ ఆమె తల్లే కారణం అంటాడు చంద్రశేఖర్. పరీక్షల తర్వాత అతని దగ్గరకు వెళ్లిన నెలకే చంద్రికకు ప్రెగ్నెన్సీ వచ్చింది. 'హనీమూన్‌కి అప్పటికే ప్లాన్ చేశాను. ఇంత తొందరగా ప్రెగ్నెన్సీనా?' అని అతను అనగానే.. 'ఇది మన అదృష్టం. మా పిన్నీ వాళ్లు పిల్లలు లేక ఎంత ఇబ్బంది పడుతున్నారో? అలా అనకండీ..' అంది చంద్రిక. దాంతో హనీమూన్ క్యాన్సిల్ చేసుకున్నాడు చంద్రశేఖర్. అయితే ఆ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. వాళ్లిద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఫలితంగా ఆమెను తీసికెళ్లడానికి పుట్టింటి వారు వచ్చారు. దాంతో గొడవైంది. ఆమె వాళ్లవాళ్లతో వెళ్లిపోయింది. ఆ తర్వాత



కొన్నిరోజులకే ఆమెకు అబార్షన్ అయ్యింది. ఈ విషయం అతనికి తెలియలేదు. ఎన్నిరోజులైనా ఆమె రాకపోవడంతో అతను ఆమె వద్దకు వెళితే, అక్కడ లేదు. ఆమె గురించి సరైన సమాచారం ఇవ్వడం లేదు. ఎలాగో తెలుసుకుని వెళితే, ఆమె అతన్ని కలవడానికి ఇష్టపడలేదు. దీంతో అతను గొడవ పడ్డాడు. ఆమె అతనిపై కేసు పెట్టింది. అతను తనకు వద్దని చెప్పేసింది. 'అక్కడ ఆమె నాతో ఏమీ మాట్లాడలేదు. నాదేమీ తప్పులేదని పోలీసులకు చెప్పి, బెయిల్ తెచ్చుకున్నా. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తుంది' అని చెప్పాడు. 'ఇంతకీ ఆమెకు నేనెందుకు వద్దో కారణాలు తెలియదు. మా మధ్య ఏమీ సమస్య లేదు. వాళ్లమ్మ వల్లే సమస్యంతా.. ఆమెను పిలిచి మీరు మాట్లాడితే.. మా కాపురం సరైపోతుంది' అన్నాడు చంద్రశేఖర్.

బాధ్యులు పంపిన లేఖ అందుకుని చంద్రిక వచ్చింది..

చంద్రిక: అతను చెప్పేవన్నీ అబద్ధాలే.. మేమిద్దరం ఎంగేజ్‌మెంటులో మాట్లాడుకున్న విషయాలన్నీ వాళ్లమ్మతో షేర్ చేసుకున్నాడు. పెళ్లయ్యి వెళ్లిన కొత్తల్లోనే మా సంభాషణలన్నీ చదివానని అత్తయ్య చెప్తుంటే ఆశ్చర్య పోయాను. అతనలా చెప్పడం ఏమిటి? ఆమె చదవడం ఏమిటి? ఒకరోజు అత్తయ్యా, నేనూ సినిమా చూస్తుంటే అందులో హీరోయిన్ తొలిరాత్రి నిద్రపోతూ ఉంటుంది. 'నువ్వూ అంతేనంటగా? రాత్రిళ్లు ఎక్కువసేపు మెలకువ ఉండవంటగా? వాడు చెప్పాడులే' అని ఆమె అనగానే నేను నోరు తెరిచా. అవి తల్లితో చెప్పడం ఏమిటి? చదువు పూర్తి చేయిస్తానంటేనే పెళ్లికి ఒప్పుకున్నా. కొన్నిరోజుల తర్వాత కాలేజీకి వెళ్లి మళ్లీ వచ్చాక, పరీక్షలకని వెళుతుంటే.. 'నువ్వు కాపురం చేయడానికా? వ్యభిచారం చేయడానికా వచ్చింది?' అని అడిగాడు. షాక్ అయ్యా. ఏదో నా అదృష్టం బాగుండి వెంటనే ప్రెగ్నెన్సీ వచ్చింది. డాక్టర్ ఆ విషయం చెప్పగానే.. పెళ్లి అయిన డేట్ నుండి లెక్కలేసుకుంటూ.. 'నీ కడుపులో బిడ్డకు నేనేనా తండ్రిని?' అని అడిగితే ఏం చెప్పాలి? డాక్టర్ కొన్నిరోజులు మమ్మల్ని వైవాహిక జీవితానికి దూరంగా ఉండమన్నారు. 'నిన్ను పెళ్లి చేసుకుంది ఎందుకు? బయటికి వెళితే డబ్బులు ఖర్చవుతాయి. ఊరికే చేసుకున్నానని అనుకుంటున్నావా?' అన్నాడు. అప్పటికి అతని పరిస్థితి అర్థమై రెండోసారి వచ్చేటప్పుడు ఇంట్లో 'నాకేమైనా అయితే అతనిదే బాధ్యత' అని లెటరు రాసిపెట్టి వచ్చాను. ఈ పరిస్థితుల్లో జరిగిన గొడవల్లో మా అత్తగారు మా నాన్నను మగాడు కాదనీ, మా అమ్మ గయ్యాళి అనీ కామెంట్ చేశారు. నాకు కోపం రాదా? అందుకే పెళ్లి ఫొటోలు నా ల్యాప్‌టాప్‌లోంచి డిలీట్ చేశా. దానికి వాళ్లు మా ఇంటికి గొడవకు వచ్చారు. ఎంతలా గొడవ చేశారంటే.. మా సందులో వాళ్లంతా మా ఇంటి ముందు గుమిగూడిపోయారు. ఆ సమయంలో అందరిముందూ తను చెప్పినమాట వినిపించుకోవడం లేదని.. వాళ్లమ్మను అతను చెంపమీద కొట్టాడు. తల్లిని కొట్టడం ఏమిటి? ఇవన్నీ నాకు అతనంటే ద్వేషం కలిగించింది. అతను నా మెళ్లో తాళి తీసేయమని గంటలు గంటలు నస పెడుతుంటే.. భరించలేక తీసేశా. అన్నీ సర్దుకుని వెళ్లిపోమంటూ, తనకు పెట్టిన బంగారాన్నీ ఇచ్చేశాడు. నన్ను తీసికెళ్లడానికి రమ్మంటే బాబాయి వచ్చారు. ఆయన్ని ఇంటికి రానీయకుండా ఉదయం నుండి రాత్రి వరకూ స్టేషన్‌లోనే ఉంచేశారు. తీరా బాబాయి వచ్చాక, అన్నీ తీసుకుని బయల్దేరుతుంటే, బాబాయి నన్నే సర్దుకుపొమ్మని చెప్పి వెళ్లిపోయారు. నేను ఏడుస్తూ ఉండిపోయాను.

గొడవలు సర్దుబాటు కాకపోవడంతో కొన్ని రోజులకే మా వాళ్లు వచ్చి, పుట్టింటికి తీసికెళతామన్నారు. అతను ఏమీ మాట్లాడలేదు. అలా ఇంటికి వచ్చేశాను. నా భవిష్యత్తు ఏమిటో నాకు అర్థంకాలేదు. తీవ్ర ఒత్తిడికి లోనయ్యాను. ఆ ఒత్తిడికి అబార్షన్ అయిపోయింది. నేను మరింత డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాను. ఇక నేను అతన్ని భరించదలుచుకోలేదు. మౌనంగానూ ఉండదలచుకోలేదు. అందుకే నేను ఒక కోర్సు చదువుతున్నా. వీలైనంత త్వరలో ఉద్యోగంలో చేరిపోతా. నాకు మాత్రం అతను వద్దు. అతను పెట్టే టార్చర్ కన్నా సమాజంలో డైవర్సీ అనిపించుకునే బాధ పెద్ద బాధే కాదు. అన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకున్నా.

> **అడ్రస్**
> **కుటుంబ న్యాయ సలహా కేంద్రం**
> **మోటూరు ఉదయం ట్రస్టు**
> **ఎంబి భవన్ హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.**
> **ఫోన్ 9494383220**

బాధ్యులు ఏమన్నారంటే..

చంద్రశేఖర్‌కి పేరెంటింగ్ సరిగా లేదు. అదే సందర్భంలో అతని ప్రవర్తనా సమస్యలతో ఉన్నారు. బిహేవియర్ థెరపీ తీసుకోవాల్సి ఉంది. అతని నైతిక విలువలు లేని మాటలు, చేష్టలు.. సెక్స్యువల్లీ పర్వర్టెడ్ అనిపిస్తుంది. దీనికి చికిత్స అవసరం. దీనికి తగిన చికిత్స తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. అతను చికిత్సకు ఒప్పుకుని, తీసుకుంటే ఒక అవకాశం ఇస్తే మంచిదేమో ఆలోచించండి చంద్రికా! తప్పులు జరిగినప్పుడే సమస్యలు ఉత్పన్నమవుతాయి. వాటిని సరిజేసుకొనే అవకాశమూ ఇవ్వాలి.

చంద్రిక అతనితో జీవనానికి ససేమిరా ఒప్పుకోనంది. అతను కూడా తన తప్పులు ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో చంద్రిక చట్టపరంగానే విడిపోతానని తేల్చి చెప్పింది.

'బలవంతంగా కలిసి ఉండమనీ చెప్పం. విడిపోమని చెప్పలేం. మా ఆధ్వర్యంలో అతనికి చికిత్స చేయించాక, డాక్టర్ సర్టిఫై చేశాకే మీరు కాపురానికి వెళదురుగానీ' అని బాధ్యులు నచ్చజెప్పినా చంద్రిక అంగీకరించలేదు. చంద్రశేఖర్ మాత్రం తనవైపు సమస్యలేమీ లేవనీ ఆధారాలు చూపిస్తూ మాట్లాడాడు. చంద్రికా ఆధారాలు చూపిస్తూ టార్చర్ భరించలేనంది.చంద్రశేఖర్‌నే కొంతసమయంలో తీసుకుని నిర్ణయించుకోమన్నారు పెద్దలు. 'ఆమె నిర్ణయం తీసేసుకుంది కాబట్టి.. ఇక నేను తీసుకునేదేమీ లేదు' అన్నారు. బాధ్యుల చెప్పిన మేరకు కొన్ని రోజుల తర్వాత ఇద్దరూ మ్యూచువల్ విడిపోవడానికే సిద్ధపడ్డారు.

'చంద్రికా! సమస్య వచ్చినప్పుడే ధైర్యంగా నిలబడాలి. మొక్కవోని ధైర్యంతో జీవితంలో స్థిరపడాలి. నీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే ముందుకు వెళ్లమ్మా.. నీకు మా సహాయం ఎప్పుడు కావాలన్నా రావొచ్చు. ఆల్ ది బెస్ట్ తల్లీ! చంద్రశేఖర్! నీ అప్రోచ్ మార్చుకోవడం భవిష్యత్తులో కూడా సమస్యలు ఎదురుకాకుండా ఉండటానికి ఉపయోగం. అందుకు మీరు కౌన్సెలింగ్ తీసుకోండి' అన్నారు బాధ్యులు.

ఇద్దరూ బాధ్యులకు థ్యాంక్స్ చెబుతూ తల్లిదండ్రులతో వెనుదిరిగారు.

- శాంతిశ్రీ

జీవన సౌరభం


పుట్టుకతోనే పూలవనం కాదు జీవితం.. ప్రతి మొక్క నువ్వే నాటి.. అందమైన పూల వనంగా మలచుకోవాలి.

మీకోసం



నీరు తాగడం ఆరోగ్యానికే కాదు, చర్మం కాంతివంతంగా ఉండటానికి దోహదపడుతుంది.

ప్రగతి పథంలో ప్రకృతి



బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన ఇరవై ఐదేళ్ల ప్రకృతి చరిత్ర సృష్టించింది. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి)లో కాంబాట్ అధికారిగా చేరిన మొట్టమొదటి మహిళగా గుర్తింపు సాధించింది. 2016వ సంవత్సరం నుంచీ భారత హోమ్ మంత్రిత్వశాఖ దేశ భద్రతకు సంబంధించిన శాఖల్లో మహిళలను చేర్చుకోవడానికి మార్గం సుగమం చేసినప్పటి నుంచి వివిధ శాఖల్లో మహిళా అధికారులు ప్రవేశిస్తున్నారు. అందులో భాగంగానే ఐటిబిపి కూడా ప్రకృతిని నియమించింది.



ప్రకృతి చిన్నప్పటి నుంచీ ఆర్మీ యూనీఫారమ్‌లో కనిపించాలనే కలలు కంటుండేది. తండ్రి భారత వాయు సేనలో ఉద్యోగి కావడంచేత ప్రకృతికీ దేశాభిమానం అధికంగా ఉండేది. అయితే ఐటిబిపిలోనే చేరాలనే కోరిక ఆమెకు మొదటి నుంచీ ఉండటం, దాన్ని సాకారం చేసుకోవడంతో ఆమె కల నెరవేరింది. ప్రకృతి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసింది. తర్వాత యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో విజయం సాధించింది. తన మొదటి ప్రయత్నంలోనే సెంట్రల్ ఆర్మ్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ప్రవేశాన్ని పొందింది. అయితే ఐటిబిపిలో మొట్టమొదటి మహిళా అధికారిని నియమించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తెలుసుకున్న తర్వాత ప్రకృతి అదే ఫోర్స్‌లో చేరాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం డెహ్రాడూన్‌లో జరుగుతున్న శిక్షణాకాలం పూర్తయిన తర్వాత ఐటిబిపిలో అసిస్టెంట్ కమాండెంట్‌గా చేరబోతుంది.

ఇక్కడొక ఆసక్తి కలిగించే విషయమూ ఉంది. తన నియామకాన్ని తెలుసుకుని మీడియా తనని పలకరించాలని వెళ్లినప్పుడు ప్రకృతి తన ఇంటిపేరును బయటకు చెప్పడానికి ఇష్టపడలేదు. ఎందుకంటే భారత సమాజంలో ఇంటిపేరు చెప్పినా దాన్నిబట్టి కుల ముద్ర వేస్తూ మాట్లాడతారనే అభిప్రాయం వల్ల. అంతేకాదు, ప్రకృతి సహజంగానే ప్రగతిశీల భావాలు కలిగిన అమ్మాయి. తన విజయంలో తల్లిదండ్రుల పాత్ర ఉందని చెబుతూనే, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆడ, మగ అంటూ తేడాలు చూపి.. పెంచకూడదంటుంది. పిల్లలు ఎలాంటి భవిష్యత్తు కోరుకుంటున్నారో దానికి తల్లిదండ్రులు సాధ్యమైనంత వరకూ సహకరించాలి తప్ప.. లింగ వివక్షతో వారి భవిష్యత్తుని పాడు చేయవద్దంటుంది.

చైనాతో 1962లో యుద్ధం తర్వాత ఐటిబిపిలో ఉన్న 83 వేల సైన్యంలో 15 వందల మంది మహిళలున్నారు. అయితే వీళ్లంతా కానిస్టేబుళ్లే. ప్రకృతి నియామకాని కంటే ముందున్న మహిళా అధికారుల్లో వైద్యవిభాగంలో మహిళలున్నారు తప్ప.. కాంబాట్ విభాగంలో ప్రకృతే మొదటి మహిళగా నిలిచింది. ★

నోటి దుర్వాసన లేకుండా!



చాలామందికి నోటి దుర్వాసన ఒక పెద్ద సమస్యే. కొన్నిసార్లు ఇది శరీరంలో వివిధ రుగ్మతల వల్ల వచ్చినప్పటికీ, ఎక్కువగా నోటిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం, అనారోగ్యకరమైన అలవాట్లవల్ల ఏర్పడుతుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దీనిని దూరం చేయొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

- ఉదయాన్నే పళ్లని తోముకునేటప్పుడు నాలుకనూ టంగ్ క్లీనర్‌తో బాగా శుభ్రం చేయాలి. ఎందుకంటే రోజంతా తినేటప్పుడు వివిధ ఆహార పదార్థాలు చాలా లవణాలను, ద్రావకాలను నాలుకపై వదులుతాయి. ఇవే రాత్రంతా పేరుకుపోయి ఇన్ఫెక్ట్ అయి, దుర్వాసన వేస్తాయి. అందుచేత నాలుకను శుభ్రం చేసుకోవడం చాలా అవసరం.
- ఆపిల్ లేదా క్యారట్‌ను రోజూ తినడం వల్ల పళ్లపై ఒత్తిడి పెరిగి వాటిపై పేరుకుంటున్న మలినాలు శుభ్రపడతాయి. దీంతో నోరు తాజాగా, ఎటువంటి దుర్వాసన లేకుండా ఉంటుంది. సాఫ్ట్‌గా క్రీం లాగా ఉండే ఆహార పదార్థాలు పళ్లపై, నాలుకపై అంటుకొని, బ్యాక్టీరియాని పెంచి దుర్వాసనకు దారితీస్తుంది. ఇలాంటివాటిని తినకూడదు.
- కాఫీ నోటి దుర్వాసనకు ఓ మూలకారణం. అయితే టీ, కాఫీల బదులు గ్రీన్‌టీ తాగడం వల్ల శ్వాస గణనీయంగా మెరుగుపడుతుంది. కాఫీ, టీలు తాగడం మాని, గ్రీన్‌టీ తాగడం మంచిది.
- అప్పుడప్పుడూ లవంగాలను నమలడం వల్ల నోటి దుర్వాసన బాగా తగ్గుతుంది ★

అతనూ నేనూ పదేళ్లుగా ప్రేమించుకుంటున్నాం. స్కూలు, కాలేజీ కలిసే చదువుకున్నాం. అయితే మా కులాలు వేరు. ఊరిలో అగ్రకులం మాది. వాళ్లకీ మాకూ కులం, అంతస్తులలో చాలా అంతరాలు ఉన్నాయి. ఇద్దరం ప్రస్తుతం టీచింగ్ వృత్తిలో ఉన్నాం. పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం. మా మధ్య ఉన్న కులం, అంతస్తు అన్న తేడా రేపు ఎలాంటి ప్రమాదంలోకి నెట్టేస్తుందో అన్న భయంలో ఉన్నాం? ఏం చేయాలో సలహా ఇవ్వండి.

- ఓ సోదరి

సైకాలజీ

మా పెళ్లికి కుల..మతాలే అడ్డు



పదేళ్లుగా ఒకరంటే ఒకరికి ప్రేమ విషయంలో కులాలు అడ్డు కాలేదు. ప్రేమ పెళ్లిగా రూపాంతరం చెందక తప్పదు అనే ఆలోచనా మీకుంది. అలాంటప్పుడు పెళ్లి అన్న విషయంలో అభ్యంతరాలు ఉంటాయన్న నిజమూ సహజమే! మీరున్న సాంఘిక పరిస్థితుల్లో మీకు ఎదురయ్యే అభ్యంతరాలను గురించి ఇంత కాలంలో ఆలోచించాల్సిన విషయం. అభ్యంతరాలు ఉంటాయనే సమస్య ప్రేమని మీరు పరస్పరం నిర్వచించుకున్నప్పటి నుంచి మీకు తెలిసే ఉండాలి. అయితే సమస్య తెలిసినప్పుడు దాని పరిష్కారం గురించీ ఆలోచించాలి. అది తార్కికంగా అప్పటి నుంచే జరిగి ఉండాలి. ఆ క్రమంలో మీరు మీ కుటుంబాలను ఎంతవరకు మీ పెళ్లి నిర్ణయం గురించి సంసిద్ధులను చేయగలిగారనేది ప్రశ్న? మీరిద్దరూ ఇరు కుటుంబాలలో విషయం చెప్పారా? ఎదురైన అభ్యంతరాలు ఏమిటి? వాటికి కలిసికట్టుగా మీరివ్వగలిగే సమాధానాలు ఏమిటి? ఇవన్నీ విశ్లేషణాత్మకంగా ఆలోచించండి. మీ సమాధానాలతో సంతృప్తి చెంది మీ పెద్దవారు మిమ్మల్ని అంగీకరిస్తే సంతోషమే! అలా కానప్పుడు మీ ఇష్టప్రకారం పెళ్లి చేసుకోవడం ఒక విధానమైతే, వాళ్ల ఇష్టాన్ని గౌరవించి, వారు నిర్ణయించిన మార్గంలో పోవడం మరో విధానం.



డా. పద్మజ, సైకాలజిస్టు

రెండు విధానాలను అనుసరించినప్పుడు లాభనష్టాలు, కష్టసుఖాలు ఉంటాయి. రెండు విధానాల్లోనూ పర్యవసానాలను స్వీకరించడానికి మీరు ఎంత సంసిద్ధులుగా ఉన్నారు? దీని పర్యవసానాలను మరింత ధైర్యంగా ఎలా స్వీకరించగలరు అన్న విశ్లేషణను ముందుగా మీరిద్దరూ కలిసి చేసుకోవాలి. రెండు విధానాల్లో ఏవిధానం వైపు మీరు మొగ్గు చూపినా.. కచ్చితమైన నిర్ణయం తీసుకున్నా.. ఆ నిర్ణయానికి మీరే బాధ్యత వహించి, జీవితాంతం కట్టుబడి ఉండగలరా?

ఒకవేళ గనుక మీ పెద్దల ఇష్టానికి వ్యతిరేకంగా మీరు పెళ్లి చేసుకుంటే వచ్చే పర్యవసానాలను తట్టుకోవడానికి అతను మీకు కలకాలం అండగా నిలబడగలడా? ఈ ప్రశ్నలకు వాస్తవికంగా సమాధానాలను ఆలోచించండి? అన్ని కోణాల్లోను పరిశీలించి నిర్ణయం తీసుకోండి. ★

సెన్సెక్స్ ↓ 44
33,307

నిఫ్టీ ↓ 16
10,226

రూపాయి ↓ 01 పై॥
అమెరికా డాలరుకు రూ.
65.16



ఉబెర్ ప్రచారకర్తగా కోహ్లీ..

ప్రముఖ క్యాబ్ సర్వీసుల సంస్థ ఉబెర్ ఇండియాకు క్రికేటర్ విరాట్ కోహ్లీ ప్రచారకర్తగా నియమితులయ్యారు. దేశంలో మరిన్ని పెట్టుబడులు కొనసాగిస్తూ, తమ డ్రైవర్ భాగస్వాములకు అలానే రైడర్‌లకు అనుకూలమయ్యే దారులను ఆవిష్కరిస్తామని ఉబెర్ ఇండియా ప్రెసిడెంట్ అమిత్ జైన్ పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం పట్ల కోహ్లీ సంతోషం వ్యక్తం చేశారు.



హోండా ఎయిర్‌క్రాఫ్టు విస్తరణ..

హోండా ఎయిర్‌క్రాఫ్టు కంపెనీ భారత్‌కు తన హోండా జెట్ అమ్మకాలను విస్తరిస్తున్నట్లు ఆ కంపెనీ ప్రెసిడెంట్ మిచిమసా ఫుజినో తెలిపారు. ఈ అధికృత డీలర్‌షిప్ బాధ్యతలను అరో ఎయిర్‌క్రాఫ్టు సేల్స్ అండ్ చార్టర్స్‌కు అప్పజెప్పుతూ ఆ కంపెనీ హెడ్ రోహిత్ కపూర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో వారు ఈ ప్రకటన చేశారు.

20 ఏళ్లలో 1750 విమానాలు

ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్ అంచనా



ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

వచ్చే 20 సంవత్సరాల్లో భారత్‌కు 1750 కొత్త విమానాలు అవసరం అవుతాయని ఎయిర్‌బస్ అంచనా వేసింది. యూరోపియన్‌కు చెందిన ఈ విమానాల తయారీ కంపెనీ భారత విమానయాన వృద్ధిపై అంచనాలు విడుదల చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో వింగ్స్ ఇండియా ప్రదర్శన ఏవియేషన్ ప్రదర్శన వద్ద ఎయిర్‌బస్ కమిర్షియల్ ఎయిర్‌క్రాఫ్టు ఇండియా ప్రెసిడెంట్ శ్రీనివాసన్ ద్వారకనాథ్ మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా వచ్చే 10 సంవత్సరాల్లో సగటున వారానికి ఒక్క విమానం చొప్పున భారత్‌కు డెలివరీ చేయనున్నామని అన్నారు. దేశంలో విమాన ప్రయాణానికి భారీగా డిమాండ్ పెరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న వద్ధిని అందిపుచ్చుకోవాలంటే 1350 సింగిల్ అయిసల్ ఎయిర్ క్రాఫ్ట్, 430 వైట్ బాడీ ఫ్లైట్స్ కావాల్సి వస్తుందని అంచనా వేశారు. వచ్చే 20 ఏళ్లలో దేశీయ విమాన ప్రయాణీకుల సంఖ్య 5 రెట్లు పెరుగొచ్చన్నారు. ఇదే కాలంలో అమెరికా విమాన ప్రయాణీకుల సంఖ్యను మించనుందన్నారు. ప్రస్తుతం ఈ కంపెనీ భారత్‌లో 300 విమానాలను కలిగి ఉంది.

క్లబ్ వన్ ఎయిర్‌కు మరో ఫాల్కన్ విమానం



ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

కార్పొరేట్ తరగతి కార్యకలాపాలకు విమాన సేవలందించే ఛార్టర్ ఫ్లైట్ ఆపరేటర్ అయిన క్లబ్ వన్ ఎయిర్ ఏవియేషన్ మరో ఎయిర్‌క్రాఫ్టును సమకూర్చుకున్నట్లు ప్రకటించింది. కొత్తగా డస్సాల్ట్ ఏవియేషన్ కంపెనీ నుండి నాల్గవ ఫాల్కన్ 2000 ఎయిర్‌క్రాఫ్ట్‌ను కొనుగోలు చేశామని ఆ కంపెనీ సిఇఒ రాజన్ మెహ్రా తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో వింగ్స్ ఇండియా ప్రదర్శన వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశ మార్కెట్‌లో తమ విస్తరణ కార్యకలాపాల కోసం ఫాల్కన్ 2000 మంచి సామర్థ్యం కలిగి ఉందన్నారు. క్లబ్ వన్ ఎయిర్ విదేశాలకు మరియు దేశీయంగా మరిన్ని కార్యకలాపాలు నిర్వహణకు సహాయపడేందుకు మరిన్ని విమానాలను సమకూర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

9 నెలల్లో లక్ష కోట్లు

ఉద్దేశ్యపూర్వకంగానే బ్యాంకులకు ఎగ్గొట్టారు



- ఐదేళ్లలో 2.3 లక్షల కోట్ల అప్పులు రద్దు
- చర్యలు తీసుకుంటున్నాం

మంత్రి ప్రతాప్ శుక్లా వెల్లడి

న్యూఢిల్లీ : ప్రభుత్వ పాలన, చట్టాల్లోని లోసుగులను ఆసరాగా తీసుకుని ఉద్దేశ్యపూర్వకంగానే అప్పులు ఎగ్గొడుతున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు (పిఎస్‌బి)లకు ఈ బెడదా మరీ ఎక్కువగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలంలో కావాలని రుణాలు ఎగవేసే వారి సంఖ్య 1.66 శాతం పెరిగి 9,063కు చేరిందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా తెలిపారు. వీటి విలువ రూ,1,10,050 కోట్లుగా ఉందని శుక్రవారం ఆయన లోకసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. వివిధ కంపెనీల్లో ప్రమోటర్లు, డైరెక్టర్లుగా చెలామణి అవుతున్న ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారులపై సెబీ చర్యలు తీసుకుంటుందన్నారు. వారికి మార్కెట్ నుంచి నిధులు సమీకరించకుండా నిబంధనలు పెట్టిందన్నారు. అదే విధంగా బ్యాంకు దివాలా చట్టం కింద తీర్మానాల్లో పాల్గొనకుండా చేశామన్నారు. 2017 డిసెంబర్ 31 నాటికి 2,108 మంది ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారులపై పిఎస్‌బిలు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశాయన్నారు. 8,461 మంది నుంచి రికవరీ కోసం కోర్టుల్లో కేసులు పెట్టాయన్నారు. మరో 6,962 మందిపై సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సీయల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ కింద చర్యలు తీసుకున్నట్లు శుక్లా తెలిపారు. 2016 మార్చి నాటికి ఐదేళ్లలో 2.3 లక్షల కోట్ల అప్పులు రద్దు చేసినట్లు మరో ప్రశ్నకు మంత్రి సమాధానంగా చెప్పారు.

ఆధార్‌తో 87 కోట్ల ఖాతాల లింక్

2018 మార్చి 5 నాటికి దేశంలో 87.79 కోట్ల బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం అయ్యాయని మంత్రి శుక్లా పార్లమెంట్‌కు తెలిపారు. అదే విధంగా 16.65 కోట్ల పాను కార్డులు కూడా లింక్ అయ్యాయని అన్నారు. బ్యాంకు శాఖల్లో మార్చి 2 నాటికి 6,811 ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ జరిగిందన్నారు. ఎవరైనా ఆధార్ నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మార్చి 31 కల్లా బ్యాంకు ఖాతాదారులు తమ ఎకౌంట్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. అదే విధంగడా పాను కార్డుతో పాటు ఆదాయపు పన్ను చెల్లింపునకు ఆధార్‌ను తప్పనిసరి చేశామన్నారు.



జిఎస్‌టిలో కోటి వ్యాపారస్తులు..

మార్చి 2 నాటికి జిఎస్‌టి నెట్‌వర్క్‌లో 1.03 కోట్ల మంది వ్యాపారస్తులు తమ సంస్థలను నమోదు చేసుకున్నారని మంత్రి శుక్లా తెలిపారు. దేశంలో పన్ను విధానం సరళతరంగా ఉండాలని జిఎస్‌టిని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ విధానం ఇప్పటి వరకు బాగానే సాగుతుందన్నారు. 64.42 లక్షల వ్యాపార పన్ను చెల్లింపుదారులు జిఎస్‌టి నెట్‌వర్క్‌లో చేరగా, కొత్తగా 39.56 లక్షల పన్ను చెల్లింపుదారులు కొత్తగా నెట్‌వర్క్‌లోకి వచ్చారన్నారు. జిఎస్‌టి ద్వారా గతేడాది జులైలో రూ.93,500 కోట్లు, ఆగస్టులో 93వేల కోట్లు, సెప్టెంబర్‌లో 95,100 కోట్లు, అక్టోబర్‌లో 85.9 వేల కోట్ల చొప్పున పన్ను వసూళ్లు అయ్యాయన్నారు. నవంబర్‌లో రూ.83,716 కోట్లు, డిసెంబర్‌లో 88,929 కోట్లు, జనవరిలో 88,047 కోట్ల చొప్పున వసూళ్లయ్యాయి.



ఇక ఉడాన్ ఇంటర్నేషనల్

ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

దేశంలో చౌక ధరల్లో విమానయానాన్ని అందుబాటులోకి తెచ్చిన ఉడాన్ పథకంలో ఇకపై అంతర్జాతీయ రూట్లలోనూ ఈ సదుపాయాన్ని తేవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం కావాల్సిన విదివిధానాలపై ఇంకా కసరత్తు జరుగుతుందని పౌర విమానయాన శాఖ కార్యదర్శి రాజీవ్ నయన్ చౌబే తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2018లో ఆయన మాట్లాడుతూ అయితే ఈ పథకంలో అంతర్జాతీయ రూట్లలో సేవలు అందించడానికి తాము మార్గనిర్దేశం, బిడ్డింగ్ వ్యవహారాలు మాత్రమే చేయనున్నామన్నారు. అవసరమైన నిధులను మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చు కోవాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో భగ్గుమంటున్న ముడి చమురు ధర విమాన యాన రంగాన్ని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తుందన్నారు. ప్రాంతీయంగా విమాన సేవలు అందించే ఉద్దేశంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఉడాన్ పథకంలో గత రెండేళ్లలో 56 నూతన విమానాశ్రయాలను ఏర్పాటు చేసిందన్నారు.

ఎయిర్‌టెల్ పేమెంట్స్‌కు ఆర్‌బిఐ జరిమాన

న్యూఢిల్లీ : నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు ఖాతాలు తెరిచిన ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకుకు రిజర్వు బ్యాంకు రూ.5 కోట్ల జరిమాన విధించింది. ఖాతాదారుల నుంచి నిర్దిష్ట లేదా స్పష్టమైన అనుమతి లేకుండా ఖాతాలను తెరిచి వారి గ్యాస్ సబ్సీడీని ఆ ఖాతాల్లోకి మళ్లించిన విషయం తెలిసిందే. దీనిపై రిజర్వు బ్యాంకు, ఆధార్ కెవైసి నిబంధనలపై ఆర్‌బిఐ ఆదేశాలు విరుద్ధంగా వ్యవహరించింది. బ్యాంకు ప్రత్యుత్తరం, వ్యక్తిగత విచారణలు పరిశీలించిన తరువాత ఎయిర్‌టెల్ పేమెంట్స్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని ఆర్‌బిఐ కూడా తేల్చింది. దీనిపై జనవరి 15 వ తేదీన బ్యాంకుకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఖాతాదారులకు తెలియకుండానే 23 లక్షల ఖాతాలు తెరిచింది.

విజేత

S.S.C. MODEL PAPER

SOCIAL PAPER-II

(Contemorary World and India)

(PART-A&B)

Time: 2.45 Hours - Max Marks: 40

Part - A

Time : 2Hr 15Mts Marks : 30

Note : (i) Write answers to the FOUR questions in one or two sentences.
(ii) Each question carries ONE mark.


SECTION - I 4 ×1= 4 marks

1.What are the measures announced by Roosevelt to face economic depression?
2. Write the major difference between Indian and American democracy?
3. “ The French colonisers thought that education was one way to civilise natives”.
what is their main idea of educating Vietnam people?
4. Write two slogans on awareness of Right to vote.


Section – II 5×2=10 Mrs

Note : (i) Write answers to the FOUR questions in one or two sentences.
(ii) Each question carries ONE mark.

5. “ In every country some people are differentiated because of their identity”. Do you agree?
6.What role did schooling play in the national movements?
7. How did the wars effected the world in the beginning of 19th century?
8. Observe the given map and answer the following questions



1. Name the ORIGIN of Narmada river?
2. Into which sea Narmada river drains?
9. Observe the given graph and answer the questions:



Section – III 4 × 4= 16 Mrs

Note : (i) Answer the FOUR questions given below.
(ii) Each question has internal choice. You can choose any one.
(iii) Each question carries FOUR marks

10. How did Versailles treaty lead to second world war again? Explain?

OR


“ After independence, language played an important role in the reorganisation of states”
How can you justify the statement.

11.”When elections were announced in January 1977, it took everyone by surprise.Noone had expected elections to be held. Indira Gandhi also released all political prisoner, removed censorship as well as all other regulations.........”
Write your comment on 1977 elections.

OR

“ With the creation of a Muslim nation, Pakistan , Painful and unimaginable situation arose before many people. Most Hindus living on one side of the newly drawn border became insecure and forced to leave........”
What are the problems faced by common people in the period of partition?

12. Timeline chart



Study the above timeline chart and answer the following questions

1.Which prime minister had relation with operation blue star?
2.Who was the first non-congress prime minister of India?
3.When was the assassination of Indira Gandhi took place?
4.Which prime minister implemented Mandal commission report?

OR

Observe the given table and answer the questions

Sl. No	Name of the party	1952 elections	1962 elections
1	Congress party	364	361
2	CPI	16	29
3	Socialist party	12	12
4	Kissan Mazdur party	9	-
5	People's democratic front	7	-
6	Ganathanthra parishad	6	-
7	Others	38	27
8	Independents	37	20
9	Jana sangh	-	18
10	Praja socialist party	-	12
11	DMK	-	7

1. Which political party got more seats in 1962 than 1952?
2.Which political parties were not participated in 1962 elections?
3. Which political party got least seats in 1962 elections?
4. Frame any question from the above table.

13. Locate the following in the given world outline map points.
A) 1.Spain 2. Israel
3. Kwamenkrumaa belongs to this country
4.The capital city of Poland

OR

B) 1. Meirapaibi moment related to this country
2. Namibia 3. Indonesia,
4. The capital city of England

PART - B

Time: 30 Mints Max Marks: 10

I. Choose the correct Answers 20 × ½ = 10 M

14. The Principles of united nations organisation ( )
1) Preserve peace
2) Reduce unemployment
3) Promote human rights
4) Prevent pollution
A) 1 & 2 B) 2&3
C) 3&1 D) All

15. The countries in wereTriple entente group ( )
1. Englnd 2.USSR
3.France 4. Germany
5.Italy 6.Austria
A) 1,2,3 B) 3,4,5
C) 4,5,6 D) 1,3,5

16. The ottoman empire in Turkey was replaced by ( )
A) dictator government
B) democratic and secular government
C) Aristocrtic form of government
D) None of the above

17. Identify the wrong statement ( )
A) Feudal lords owned most of the lands in Russia
B) Russia was the biggest loser of human lives in world war 1.
C) Sround 10,000 women took out a procession demanding ‘peace and bread’ in Russia.
D) In 1920, soviets were formed by Lenin in Russia.

18. The appeasement policy followed by western capitalist countries because ( )
A) They were afraid of soviet socialism
B) They were afraid of Hitler
C) They were afraid of Hitler’s policy
D) They were afraid of peace moments

19. The principles of sun-yat-sen were ( )
A) Nationalism,democracy,socialism
B) Secularism,socialism,democracy
C) Socialism, secularism, nationalism
D) Socialism, democracy,liberalism

20. Match the following ( )
1) Diet ( ) a. Germany
2) Reichstag ( ) b. Russia
3) Duma ( ) c. Japan
A) 1-a,2-b,3-c
B) 1-c,2-a,3-b
C) 1-b,2-c,3-a
D) 1-c,2-b,3-a

21. People’s republic of China established in
A) 1911 B) 1949 ( )
C) 1919 D) 1954

22. The aim of cripps mission sent by Churchil to India is ( )
A) to estimate the status of their power in India
B) to compromise with Gandhiji and congress
C) to stop the freedom movement in India
D) to visit the tourist places in India

23. For the first time in India, the elections conducted and provincial governments formed as per this act ( )
A) 1909 B) 1920
C) 1935 D) 1919

24. Arrange the following in chronological order ( )
1) Quit India moment
2) Cripps Mission
3) Indian government act
4) salt satyagraha
A) 1,2,3,4
B) 2,1,4,3
C) 4,3,2,1
D) 4,2,1,3

25. Which of the following is not a feature of Indian constitution ( )
A) federal form of government
B) Parliamentary form of government
C) A written constitution
D) Dual citizenship

26. Political equality can be defined with the following feature ( )
A) Right to get admission in any school
B) Principle of one person one vote
C) Right to enter in any religious place
D) All the above

27. Election commission used symbols in first general elections because ( )
A) Illiterates can easily identify symbols
B) Easy to allot
C) Only few people are literates in 1952
D) A & C

28. Identify the wrong pair ( )
A) Chief architect of NAM-Jawahar lal Nehru
B) Zionist moment-Jews
C) Bandung conference-1969
D) Liberation of Bangladesh -1971

29. ‘Veto’ means ( )
A) accepted B) Rejected
C) criticised D) Illegal

30. The aim of Suez canal is to ( )
A) Reduce the distance between Egypt and Red sea
B) Reduce the distance between red sea and blacksea
C) Reduce the distance between red sea and Meditteranean sea
D) All the above

31. Malala Yusufja was awarded with ( )
A) Bharatharatna B) Jnanapeeth
C) Noble peace prize D) Booker prize

32.Dalailama is a holy priest of ( )
A) China B) Tibet
C) India D) Japan

33. Civil rights moment took place in ( )
A) Britain B) America
cC) France D) Japan

★

Part -B (Answers)

14. C 15. A 16. B 17. D
18. A 19. A 20. B 21. B
22. B 23. C 24. C 25. D
26. B 27. D 28. C 29. B
30. C 31. C 32. B 33. A

నిన్నటి బిట్‌పేపర్ సమాధానాలు

Part -B (Answers)

14-D 15-A 16-A 17-B
18-D 19-B 20-B 21-A
22-A 23-A 24-A 25-C
26-B 27-C 28-C 29-A
30-D 31-B 32-D 33-A

కార్పొరేట్ మీడియాతో మరింత సాంస్కృతిక కాలుష్యం : జ్యోతిరాణి

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

ఐక్యరాజ్య సమితి కనీస మానవ హక్కులుగా పేర్కొన్న మహిళల భద్రత, రక్షణ విధ్వంస సంస్కృతి ద్వారా ధ్వంసమయ్యాయని కాకతీయ యూనివర్శిటీ విశ్రాంత ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గుంటూరులో స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సదస్సుకు సంఘటన రాష్ట్ర అధ్యక్షులు సి.విజయ అధ్యక్షతన నిర్వహించిన సభలో జ్యోతిరాణి మాట్లాడారు. కార్పొరేట్ శక్తుల లాభాపేక్షతో నడుస్తున్న ప్రచార, ప్రసార మాధ్యమాల వల్ల సాంస్కృతిక సంక్షోభం మరింత బలోపేతమవుతోందని పేర్కొన్నారు.



సదస్సు గుంటూరులో స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి

బడ్జెట్లో సంక్షేమ రంగానికి కోత

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రజలను మభ్యపెట్టేదిగా ఉన్న రాష్ట్ర బడ్జెట్‌ను నిరసిస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. బడ్జెట్లో జరిగిన అన్యాయాన్ని సరి చేయాలని, కేటాయింపులు పెంచాలని వక్తలు డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్లో కర్నూలు జిల్లాకు మొండిచేయి చూపడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కర్నూలులోని కొత్తబస్టాండ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో పేదల సంక్షేమానికి సక్రమంగా నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడుతూ బడ్జెట్లో సంక్షేమ రంగానికి కోత పెట్టారన్నారు. బడ్జెట్ అంతా అంకెల గారడీగా ఉందని విమర్శించారు. ధర్నాకు అగ్రిగోల్డ్ ఏజెంట్ల సంఘం మద్దతు తెలిపింది. రాష్ట్ర బడ్జెట్లో ప్రకాశం జిల్లాకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఒంగోలు కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య అధ్యక్షతన జరిగిన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు ప్రకాశం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాలు ముగిసేలోపు ప్రకాశం జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో ఇంత అన్యాయం జరిగినా జిల్లాకు చెందిన మంత్రి శిద్దా రాఘవరావు, ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ప్రాజెక్టులకు నిధులు పెంచాలని, అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ ఈ నెల 12న 'చలో కలెక్టరేట్' చేపడతామని తెలిపారు. సిపిఎం, సిపిఐ, వైసిపి, సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ), సిపిఐ ఎంఎల్ (న్యూ), జిల్లా అభివృద్ధి వేదిక, గిరిజన పోరాట సమితి నాయకులు పాల్గొని ప్రసంగించారు.

హోదా కోసం మిన్నంటిన నిరసనలు

- రాయలసీమలో జీపుజాతాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వడం కుదరదని కేంద్ర మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు ఢిల్లీలో నిరసన తెలిపిన వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులపై పోలీసులతో దాడి చేయించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిరసనలు మిన్నంటాయి. పలుచోట్ల వినూత్న రీతిలో ఆందోళనలు నిర్వహించారు. 'ప్రత్యేక హోదా మా హక్కు', 'విభజన హామీలు నెరవేర్చాలి' అంటూ ప్రజానీకం నినదించారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలంటూ రాయలసీమలో జీపుజాతాలు నిర్వహించారు.

సిపిఎం ఆధ్వర్యాన విజయనగరం జిల్లా విశాఖ-అరకు ప్రధాన రహదారిలో బొడ్డాం జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ వద్ద కేంద్రప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. నరసాపురంలోనూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గిరిజనసంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు.



కర్నూలు జిల్లా ఆదోనిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

పెద్దాపురం, సామర్లకోటలో సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు చేశారు. విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద ఆటోకార్మికులు ధర్నా చేశారు. సెంట్రల్ సిటీ ఆటోవర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు పాల్గొన్నారు. స్థానిక లెనిన్ సెంటర్ వద్ద ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ కృష్ణా జిల్లా అధ్యక్షులు ఎన్.కోటి పాల్గొన్నారు. సిపిఎం ఆధ్వర్యాన స్థానిక కస్తూరిబాయ్‌పేట రెడ్ సర్కిల్ నుంచి పుష్పాహోటల్ వరకూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు అర్ధనగ్నంగా, జోలి పట్టి భిక్షాటన చేస్తూ వాహనదారులకు, పాదచారులకు కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా చేసిన మోసాన్ని వివరించారు.

ఎపిని విస్మరిస్తే పుట్టగతులుండవు

ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన చట్టంలో ఇచ్చిన హామీలను బిజెపి, టిడిపిలు విస్మరిస్తే ఆ పార్టీలకు పుట్టగతులుండవని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు అన్నారు. శుక్రవారం తిరుపతి సిపిఎం జిల్లా జాతా కార్పొరేషన్ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యాన ప్రారంభమైంది. 14వ తేదీ వరకూ జీపుజాతా ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. చిత్తూరు జిల్లా సిపిఎం జాతా చిత్తూరు బస్టాండ్ సర్కిల్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.చైతన్య ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి చల్లా వెంకటయ్య మాట్లాడుతూ 14న కలెక్టరేట్ ముందు నిరసన తెలియజేయనున్నట్లు చెప్పారు. కర్నూలు జిల్లాలో సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన జీపుజాతా రెండోరోజు మంత్రాలయం, కోసిగి, కౌతాళం, ఆదోని ప్రాంతాల మీదుగా సాగింది. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు టి.షడ్రక్ పాల్గొన్నారు.

'రిమ్స్' సెక్యూరిటీ గార్డుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన రిమ్స్ సెక్యూరిటీగార్డులు శుక్రవారం నిరవధిక సమ్మెకు దిగారు. రిమ్స్ జనరల్ ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో సిఐటియు డివిజన్ అధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జై బాలాజీ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2016 అక్టోబరులో సిఐటియుతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు జిఒ 45 ప్రకారం నెలకు రూ.9,030 చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. ఆ ఒప్పందాన్ని యాజమాన్యం ఉల్లంఘించి కార్మికుల శ్రమను దోచుకుంటోందని విమర్శించారు. దీనిపై జిల్లా కలెక్టర్, రిమ్స్ యాజమాన్యం స్పందించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు డి.గణేష్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఈ శిబిరంలో యూనియన్ నాయకులు డి.సింహాచలం, బి.శ్రీను, ఎస్.శ్రీను, రామారావు, రాజేంద్ర, మురళీ, సంతోషి, మాధవి, కనకం, మాలతి, శశి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్‌ను వెనక్కి తీసువాలని అంగన్‌వాడీల మహాధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు టౌన్

బయోమెట్రిక్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పది రోజులుగా కలెక్టరేట్ వద్ద జరుగుతున్న దీక్షలు ముగింపుగా శుక్రవారం కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. బయోమెట్రిక్ వద్దంటూ అంగన్‌వాడీలు నినాదాలతో హోరెత్తించారు. డిఆర్‌ఒతో సిఐటియు, అంగన్‌వాడీ నాయకుల చర్చలు విఫలమవడంతో ఐసిడిఎస్ పీడీ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యాలయాన్ని ముట్టడించారు. పి.డి వచ్చేవరకు అంగన్‌వాడీలు నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, దీని కోసం జాయింట్ మీటింగ్ వేస్తామని పీడీ హామీ ఇచ్చారు. బయోమెట్రిక్ తన పరిధిలో లేదని, మీ వినతిని ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. బయోమెట్రిక్‌పై పి.డి హామీ స్పష్టంగా ఇవ్వకపోవడంతో అంగన్‌వాడీ, సిఐటియు నాయకులు ముట్టడి వద్దనే బయోమెట్రిక్ పై చలో అసెంబ్లీకి అంగన్‌వాడీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మహిళా హక్కులపై ఫాసిస్టు దాడులను ఖండించండి

ప్రజాశక్తి-నెల్లూరు/విజయనగరం

మహిళల హక్కులు, స్వేచ్ఛపై హిందూ, ఫాసిస్టుల దాడులను ఖండించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.పద్మ వివిధ ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను కోరారు. శుక్రవారం నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న పిఒడబ్ల్యు జిల్లా కార్యలయంలో ఆమె కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ హక్కులను, స్వేచ్ఛను కాపాడుకోటానికి మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వారు సాధించుకున్న హక్కులను బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు హరించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా రచనలు చేసిన మహిళా జర్నలిస్టు గౌరీలంకేశ్‌ను హిందూ ఫాసిస్టు శక్తులు హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మహిళా టీచర్ల సదస్సు జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న మహిళా హక్కులను రక్షించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

సిపిఎం నేత కృష్ణకుమారి కన్నుమూత

- నేడు రాజమహేంద్రవరంలో అంత్యక్రియలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి/శ్రీకాకుళం

సిపిఎం నాయకురాలు, జిఎస్ బాలాజీదాస్ సతీమణి, రాజమహేంద్రవరం మాజీ కౌన్సిలర్ జి.కృష్ణకుమారి(84) శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు కన్నుమూశారు. బాలాజీదాస్, కృష్ణకుమారి దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా తన అల్లుడు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబూరావు ఇంటి వద్దే కృష్ణకుమారి ఉంటున్నారు. మోరంపూడి దగ్గరలోని సాయినగర్ మిడియం బాబూరావు ఇంటిలోనే ఆమె తుదిశ్వాస విడిచారు. రాజమహేంద్రవరం మున్సిపాలిటీగా ఉన్నప్పుడు 1968-81లో ఆమె కౌన్సిలర్‌గా పనిచేశారు. ఆమె నగరానికి సమర్థవంతమైన సేవలందించారు. అనేక ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అధిక ధరలపై ఉద్యమం చేసిన నేపథ్యంలో 1974లో కృష్ణకుమారిని అరెస్టు చేసి, రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలుకు తరలించారు. ఆనందనగర్, శాటిలైట్ సిటీ ప్రాంతాల్లో పేదలకు ఇళ్లపట్టాలు ఇప్పించడంలో విశేష కృషి చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంవిఎస్ శర్మ, మంతెన సీతారాం, ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ టిఎస్.ప్రకాష్, సిపిఎం నాయకులు ఎస్ఎస్.మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, ఎన్.భీమేశ్వరరావు తదితరులు కృష్ణకుమారి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా (కాకినాడ) కమిటీ కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యులు శేషబాబ్జీ, రాజ మహేంద్రవరం జిల్లా కమిటీ కార్యదర్శి టి.అరుణ్, ఐద్వా రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి పి.తులసి తదితరులు నివాళులర్పించారు.

కృష్ణకుమారి మృతికి సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం

సిపిఎం సీనియర్ నాయకులు జి.కృష్ణకుమారి మృతికి సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి సంతాపం తెలిపారు. కృష్ణకుమారి మహిళా ఉద్యమాల్లోనే కాకుండా ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లోనూ పాల్గొన్నారన్నారు. బాలజీదాస్‌కు వెన్నుదన్నుగా ప్రజా ఉద్యమాల్లో ఆమె కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంవిఎస్.శర్మ కృష్ణకుమారి భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. జీవితమంతా ఎర్రజెండాకే ఆమె అంకితమయ్యారని శర్మ అన్నారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ పార్టీ కార్యక్రమాల పట్ల నిబద్ధతతో పనిచేశారన్నారు. నేటితరానికి కృష్ణకుమారి ఆదర్శమన్నారు.

సిపిఎం నాయకులు కృష్ణకుమారి మృతికి ఆ పార్టీ సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు తీవ్ర సంతాపం తెలిపారు. బాలాజీదాస్ అడుగుజాడల్లో కృష్ణకుమారి నడిచి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారని తేజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెతో ఉన్న అనుబంధాన్ని తేజేశ్వరరావు గుర్తు చేసుకున్నారు. ఇటీవల తాను రాజమండ్రిలో ఆమెను పరామర్శించేందుకు వెళ్లినప్పుడు లేవలేని స్థితిలో ఉన్నా, తనను గుర్తించి సంజ్ఞలతోనే పలకరించారని పేర్కొన్నారు. కృష్ణకుమారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆమె కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.



కృష్ణకుమారి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంవిఎస్ శర్మ, మంతెన సీతారాం, టిఎస్ ప్రకాష్

11 గంటలకు అంతిమ యాత్ర

శనివారం ఉదయం 11 గంటలకు మోరంపూడి సాయినగర్ ప్రాంతంలోని దుర్గగుడి రోడ్డులో ఉన్న మిడియం బాబూరావు స్వగృహం నుంచి కృష్ణకుమారి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇన్నీసుపేటలోని గోదావరి నది ఒడ్డున అంత్యక్రియలు జరుగుతాయని పేర్కొన్నారు

మోహన్‌బాబు, విష్ణులను అరెస్టు చేయాలి

ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల్లో పనిచేసే మహిళా ఉద్యోగిని పట్ల అమానుషంగా వ్యవహరించడమే గాకుండా, అవమానించేలా హేళన చేసిన సినీనటుడు మోహన్‌బాబు, విష్ణులను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మోహన్‌బాబు, విష్ణు పోస్టర్లతో నిరసన తెలిపారు. చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో ఆ మహిళా ఉద్యోగిని ఫిర్యాదు చేస్తే, ఆమెపైనే విద్యానికేతన్ విద్యాసంస్థల యాజమాన్యం తప్పుడు కేసులు బనాయించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షురాలు అండాళ్లు, సాయిదీప్తి, హేమలత, అరుణ, జయంతి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె కుమార్‌రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ జయచంద్ర పాల్గొన్నారు.

మందులు, వైద్య పరికరాలపై జిఎస్‌టి మినహాయింపు ఇవ్వాలి

మెడికల్ రెప్స్ జాతీయ అధ్యక్షులు విశ్వనాథన్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

ప్రజారోగ్యానికి సంబంధించి మందులు, వైద్య పరికరాలపై ప్రభుత్వాలు జీరో శాతం జిఎస్‌టి ఇవ్వాలని మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ జాతీయ అధ్యక్షులు ఆర్.విశ్వనాథన్ డిమాండ్ చేశారు. యూనియన్ ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా కర్నూలులో స్వర్ణోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కర్నూలులోని బుధవారపేటలో మెరిడియన్ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ 345 శాఖలతో లక్షకు పైగా సభ్యత్వానికి చేరుకుందన్నారు. ప్రధానంగా మందులు, వైద్య పరికరాలపై జీరో శాతం జిఎస్‌టి పరిధిలో ఉంచాలని, మందుల ధరలు, మందుల తయారీ ధరలను అమ్మకపు ధర ఆధారంగా నిర్ణయించాలన్నారు. అనైతిక వ్యాపారం, న్యాయబద్ధత లేని మార్కెటింగ్ విధానంపై ఉక్కుపాదం మోపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. డిమాండ్ల సాధనకు నవంబర్‌లో దేశవ్యాప్త సమ్మెకు సిద్ధపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం మందుల రంగంలో జరుగుతున్న అవకతవకలను అరికట్టడంలో వైఫల్యం చెందడాన్ని పక్కన పెడితే అదే మందుల కంపెనీలకు అండగా నిలవడం విడ్డూరమన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1.1,42,054 కోట్లు
2.5,10,41000 కోట్లు
3.కాన్రాడ్ సంగ్మా, నియోఫియో రియో
4.శ్రీలంక
5.సుజనా చౌదరి, అశోక్ గజపతిరాజు

విగ్రహాల కూల్చివేతపై ఆందోళనలు

ప్రజాశక్తి యంత్రాంగం

త్రిపురలో లెనిన్, తమిళనాడులో పెరియార్ రామస్వామి, ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాల కూల్చివేతకు, బిజెపి, ఆర్ఎస్ఎస్ ఆరాచకాలకు నిరసనగా రాష్ట్రమంతటా శుక్రవారం వివిధ రూపాల్లో ఆందోళనలు జరిగాయి. విజయనగరం జిల్లా బొబ్బిలిలో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. నెల్లిమర్ల జంక్షన్లో రాస్తారోకో చేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో బిజెపి మతోన్మాద దిష్టిబొమ్మను సిపిఎం నాయకులు దహనం చేశారు. యలమంచిలి మండలం చించినాడలో జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. గుంటూరు జిల్లా నకరికల్లులో అద్దంకి-నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా తిరువూరు బోసుబొమ్మసెంటరులో ప్రదర్శన, సిపిఐ, మాలమహానాడు ఆధ్వర్యంలో అవనిగడ్డలో ధర్నా జరిగాయి.కర్నూలులో కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్, ఇతర దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీపు జాతా

ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాల్సిందే

జీపు జాతాలో గిరిజన సంఘాల జెఎసి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి- కురుపాం, కొమరాడ (విజయనగరం జిల్లా)

ఆంధ్రాకు ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాల్సిందేనని గిరిజన సంఘాల జెఎసి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. ఈ నెల ఎనిమిదో తేదీన శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో ఆంధ్రప్రదేశ్ గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన గిరిజన జీపుజాతా శుక్రవారం విజయనగరం జిల్లాలోని కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో సాగింది. ఈ జాతాకు ఆయా ప్రాంతాల్లోని గిరిజన సంఘం నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయని మర్శించారు. హోదా కోసం కాకుండా ప్యాకేజీ కోసం చంద్రబాబునాయుడు మాట్లాడుతుండడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని నిర్వాసితుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాకే



కొమరాడ మండల కేంద్రంలో మాట్లాడుతున్న మిడియం బాబూరావు

ప్రాజెక్టుల పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరిస్తే గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జెఎసి జిల్లా చైర్మన్ కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ విశాఖలో రైల్వేజోన్, విజయనగరం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని హామీల అమలుకు పోరాడుతామని తెలిపారు.

సంక్షిప్తం

'ఆదిత్యుని' తాకని కిరణ స్పర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆకాశంలో మబ్బుల కారణంగా శ్రీకాకుళం జిల్లా అరసవల్లి ఆలయంలోని ఆదిత్యుని పాదాలను కిరణ స్పర్శ జరగలేదు. ఏటా ఉత్తరాయణంలో మార్చి తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు, దక్షిణాయంలో అక్టోబరులో ఒకటి నుంచి మూడో తేదీ వరకూ భానుని లేలేత కిరణాలు ఆదిత్యుని పాదాలను తాకే అద్భుత ఘట్టం ఆవిష్కృతమవుతుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఆదిత్యుని కిరణ స్పర్శ కోసం యాత్రికులు పెద్దసంఖ్యలో అరసవల్లి ఆలయానికి చేరుకున్నారు. ఉదయం 6.25 గంటలకు ఆదిత్యుని పాదాల చెంతకు సూర్యకిరణాలు రావాల్సి ఉన్నా, మబ్బుల కారణంగా ఆ సమయం దాటిపోయింది. దీంతో, యాత్రికులు నిరాశతో వెనుదిరిగారు.

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం)

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, సంస్థలో నుంచి తొలగించిన కాంట్రాక్టు కండెక్టర్లను, డ్రైవర్లను విధుల్లోకి తీసుకొని రెగ్యులర్ చేయాలని, వేతన సవరణ వెంటనే అమలు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక డిపో ఆవరణలో శుక్రవారం ధర్నా జరిగింది. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కొత్తకోట వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా మాట్లాడారు. 2018 జనవరి నుండి రావాల్సిన డిఎను ప్రకటించాలని, సమస్యల పరిష్కారం కోసం వెంటనేఊ గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలన్నారు.

బకాయిల కోసం జూడాల ధర్నా

ప్రజాశక్తి -కాకినాడ

స్టయిఫండ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో జూనియర్ డాక్టర్లు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం జిల్లా నాయకులు డాక్టర్ సురేష్, డాక్టర్ వందన మాట్లాడారు. పెంచిన స్టయిఫండ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు.



పెందుర్తి కూడలిలో సిఐటియు ఆధ్వర్యాన ఆశ కార్యకర్తల నిరసన

ఆశా కార్యకర్తల అరెస్టులు అన్యాయం

సిఐటియు

ప్రజాశక్తి-పెందుర్తి, విశాఖ

ఆశా కార్యకర్తల సేవలను ప్రభుత్వం గుర్తించాలని ఎపి వాలంటరీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (ఆశా) జిల్లా గౌరవాధ్యక్షులు మణి డిమాండ్ చేశారు. రాజమండ్రిలో ఆశా కార్యకర్తల అరెస్టులను ఖండిస్తూ విశాఖ జిల్లా పెందుర్తి కూడలిలో శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు కేరళలో రూ.7,500, త్రిపుర, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.6 వేలు, హర్యానాలో రూ.4,500ల చొప్పున అక్కడి ప్రభుత్వాలు అందిస్తుండగా, రాష్ట్రంలో మాత్రం మొండిచేయి చూపిస్తున్నారని విమర్శించారు. మాతా, శిశు మరణాలను అరికట్టడంలో ఆశా కార్యకర్తలదే కీలకపాత్ర అన్నారు. పలకరింపు, పల్స్‌పోలియో, గర్భిణులకు వ్యాక్సిన్, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు ఆశా కార్యకర్తలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. రూ.6 వేల కనీస వేతనమివ్వాలని కోరిన ఆశా కార్యకర్తలను అరెస్టు చేయించడం ప్రభుత్వ దమనకాండకు నిదర్శమని వ్యాఖ్యానించారు. మహిళా దినోత్సవం రోజునే ఆశా కార్యకర్తలను మగ పోలీసులతో అరెస్టు చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల పట్ల తన నైజాన్ని చాటుకున్నారన్నారు. మహిళలను గౌరవించడం ముఖ్యమంత్రి తెలుసుకోవాలన్నారు. ఆశా కార్యకర్తలకు రూ.6 వేల కనీస వేతనాన్ని అమలు చేయకపోతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు.

గౌరీ లంకేష్ హత్య కేసులో సిట్ దర్యాప్తు : మేజిస్ట్రేట్ కోర్టు

బెంగళూరు : గౌరీ లంకేష్ హత్య కేసులో నిందితుడైన కెటి నవీన్ కుమార్‌పై ప్రత్యేక విచారణ బృందం(సిట్) విచారణకు బెంగళూరు మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం ఆమోదం తెలిపింది. గత సెప్టెంబర్ 5న గుర్తు తెలియని వ్యక్తులు గౌరీ లంకేష్‌ను ఆమె ఇంటి వద్ద హత్య చేసిన సంగతి తెలిసిందే. నిందితుడిని 5 రోజుల పాటు సిట్ విచారించనుంది. ఫిబ్రవరి 18న బుల్లెట్లు అక్రమంగా కలిగి ఉన్నట్లు గుర్తించి నవీన్‌ను అరెస్టు చేసి విచారించగా గౌరీ లంకేష్‌ను హత్య చేసినట్లు అంగీకరించాడని కర్ణాటక పోలీసులు తెలిపారు. దీంతో మార్చి 3న సిట్ కస్టడీలోకి తీసుకొని విచారించింది. అతనికి హిందూత్వ గ్రూప్, హిందూత్వ యువ సేనతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలున్నాయి.



అగ్ని ప్రమాదం ।

ముంబయికి 150 కిలోమీటర్ల దూరంలోని పల్‌ఘర్ ప్రాంతంలో ఓ ప్రయివేట్ కెమికల్ ఫ్యాక్టరీలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పేలుడు శబ్దం పది కిలోమీటర్ల వరకు వినిపించింది. ఈ ఘటనలో ముగ్గురు చనిపోయారు.

మహారాష్ట్ర కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

ముగ్గురు మృతి, 13మందికి గాయాలు

ముంబయి : మహారాష్ట్రలోని పల్‌ఘర్ ప్రాంతంలో ప్రైవేట్ కెమికల్ ఫ్యాక్టరీలో గురువారం రాత్రి భారీ పేలుడుతో కూడిన అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, 13 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది. ఈ కంపెనీ ముంబయికి 150 కిలోమీటర్ల దూరంలో ఉందని, ప్రమాదం రాత్రి 11.15కి జరిగిందని పోలీస్ అధికారి ప్రమోద్ పవర్ తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలు ఇంకా తెలియలేదన్నారు. కాగా, పేలుడు శబ్దం 10 కి.మీటర్ల వరకు వినిపించిందని, పేలుడు ధాటికి స్థానికంగా ఉన్న ఇళ్లు, భవనాలు స్వల్పంగా కంపించాయని ఆయన తెలిపారు. ఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్లను తరలించామని, సహాయ చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. పేలుడు బాయిలర్ గదిలో సంభవించి ఉండవచ్చునని భావిస్తున్నారు.

దినకరన్ వర్గానికి 'ప్రెషర్ కుక్కర్' గుర్తు

ఇసిని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : అన్నాడిఎంకె బహిష్కృత నేత టిటిడి దినకరన్ వర్గానికి తాత్కాలిక చిహ్నంగా ప్రెషర్ కుక్కర్‌ను కేటాయించాలని ఎలక్షన్ కమీషన్(ఇసి)కు ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే వారు అభ్యర్థించిన అన్నాడిఎంకె (అమ్మ) పేరును కూడా కేటాయించాలని పేర్కొంది. దినకరన్–శశికళ వర్గానికి వారు విజ్ఞప్తి చేసిన పేరు, గుర్తును మూడు వారాల్లో కేటాయించడానికి ఉత్తర్వులను జారీ చేయాలని ఇసికి జస్టిస్ రేఖ పల్లి సూచించారు. రెండాకుల గుర్తును ముఖ్యమంత్రి ఇ.కె పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంకు ఇసి కేటాయించడాన్ని సవాలు చేస్తూ గత సంవత్సరం నవంబర్‌లో పిటిషన్ దాఖలు చేశారు. అన్నాడిఎంకె ఎన్నికల గుర్తుపై తుది నిర్ణయం గైకొనేవరకు ఆర్కేనగర్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ వర్గానికి ప్రెషర్ కుక్కర్‌ను తాత్కాలిక ఎన్నికల చిహ్నంగా కేటాయించాలని, అలాగే తమ వర్గానికి కొత్త పార్టీ పేరును కూడా కేటాయించాలని టిటిడి దినకరన్ దాఖలు చేసిన మరో వ్యాజ్యంపై ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది.

కార్తీ 'కస్టడీ' పొడిగింపు

సిబిఐ విజ్ఞప్తికి కోర్టు 'ఓకె'



న్యూఢిల్లీ : ఐఎన్‌ఎక్స్ మనీ లాండరింగ్ కేసులో నిందితుడు కార్తీ చిదంబరం కస్టడీని మరో మూడు రోజులు పొడిగించేందుకు శుక్రవారం ఢిల్లీ పాటిలాయా కోర్టు అనుమతించింది. తీహార్ జైలులో కార్తీ తో పాటు ఆయన చార్టెడ్ అకౌంటెంట్ భాస్కర్‌ను సిబిఐ విచారించేందుకు 'గ్రీన్ సిగ్నల్' ఇచ్చింది. ఫిబ్రవరి 28న చెన్నైలో సిబిఐ అధికారులు కార్తీని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కాగా, అంతకుముందు మార్చి 20 వరకు కార్తీని అరెస్టు చేయవద్దని ఢిల్లీ హైకోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ను ఆదేశించింది. గత మేలో సిబిఐ దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్‌పై దర్యాప్తు చేసే అధికారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)కు లేదని కార్తీ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు.

త్రిపుర ముఖ్యమంత్రిగా బిప్లబ్ కుమార్ దేవ్ ప్రమాణ స్వీకారం



అగర్తలా : త్రిపుర ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేవ్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అగర్తలా లోని అస్సాం రైఫిల్స్ గ్రౌండ్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, బిజెపి అధ్యక్షులు అమిత్ షా, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు బిజెపి సీనియర్ నేతలు ఎల్.కె. అద్వానీ, మురళీమనోహర్ జోషి తదితరులు హాజరయ్యారు. ఇప్పటి వరకు త్రిపుర ముఖ్యమంత్రిగా వున్న మానిక్ సర్కార్‌తో పాటు బిజెపి పాలిత రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు కూడా ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో ఉన్నారు. ఉప ముఖ్యమంత్రిగా విష్ణు దేవ్ వర్మ ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 12 మంది సభ్యులతో కలిసి కొత్త మంత్రి వర్గం ఏర్పడింది. ఇందులో ఇద్దరు బిజెపి మిత్రపక్షమైన ఇండిజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి)కి చెందిన వారు.

యుపిలో దళిత మహిళ సజీవ దహనానికి యత్నించిన దుండగులు

లక్నో : తమ వద్ద అప్పుగా తీసుకున్న రూ.20 వేలను తిరిగి చెల్లించలేదన్న కారణంతో కొందరు దుండగులు ఒక దళిత మహిళను సజీవ దహనం చేసేందుకు యత్నించిన ఘటన ఉత్తర ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. రాష్ట్రంలోని బాలియాలోని జాజౌలి గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరిని అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. రేష్మా దేవి (45) తన ఇంటిలో నిద్రిస్తుండగా గురువారం ఈ సంఘటన జరిగింది. కొంతమంది దుండగులు ఆమెపై కిరోసిన్ పోసి నిప్పు పెట్టారని ఎస్‌పి అనిల్ కుమార్ సింగ్ తెలిపారు. గాయపడిన రేష్మాను ఆసుపత్రికి తరలించ్చినట్లు ఆయన చెప్పారు. ఆమె పరిస్థితి నిలకడగానే ఉన్నదని వైద్యాధికారులు తెలిపి నట్లు వెల్లడించారు. మెజిస్ట్రేట్‌కు ఆమె ఇచ్చిన వాంగ్మూలం మేరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి సోను, సిద్దు సింగ్ అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి చ్చిన ఫిర్యాదు మేరకు ఆ మహిళా తమ వద్ద 20 వేలు అప్పుగా తీసుకున్నది. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించినప్పటికీ దుండగులు ఆమె నుండి వడ్డీని డిమాండ్ చేస్తున్నారని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు.

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలి

ధర్నాలో ఇయు అదనపు ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

వేతనాల సవరణలో జాప్యమవుతున్నందున వెంటనే తాత్కాలిక భృతి (ఐఆర్) ప్రకటించాలని ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు) అదనపు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడ డిపో వద్ద శుక్రవారం చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. తాము ఎన్‌ఎంయు మాదిరి ప్రభుత్వం వద్ద, యాజమాన్యం వద్ద లొంగుబాటుగా వ్యవహరించి, కార్మికుల హక్కులను తాకట్టుపెట్టబోమని, కార్మికుల పక్షానే పోరాడుతామని దామోదరరావు అన్నారు. ఆర్టీసి గుర్తింపు సంఘం ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఇయుదే విజయమని, ఎన్‌ఎంయు నాయకుల డ్రామాలు అందరికీ తెలిసిపోయాయని వ్యాఖ్యానించారు. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం కార్మికులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేక పోయిందో సమాధానం చెప్పాలన్నారు. రెండేళ్లుగా గుర్తురాని సమస్యలు ఇప్పుడు గుర్తొచ్చినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. తొలగించిన కాంట్రాక్టు కండక్టర్లు, డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకుని రెగ్యులర్ చేయాలని, 2018 జనవరి నుంచి రావాల్సిన డిఎను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని, సమైక్యాంధ్ర సమ్మె కాలాన్ని సెలవుగా ప్రకటించాలని కోరారు. బస్సుల తగ్గింపు, కార్మికుల కుదింపు వంటి విధానాలను విడనాడాలన్నారు. మహిళా కండక్టర్ల సమస్యలను పరిష్కరించాలని, కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చట్ట వ్యతిరేకంగా ఉన్న షెడ్యూళ్లను మార్చాలని, సుప్రీం ఆదేశాల ప్రకారం హయ్యర్ పెన్షన్ చెల్లించాలని కోరారు. ధర్నాలో ఇయు రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జివి నరసయ్య, కృష్ణా జిల్లా రీజినల్ కార్యదర్శి వై శ్రీనివాసరావు, డిపో నాయకులు వైఎంఎస్ రావు, వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు

మోడీపై సోనియా ధ్వజం

13న ప్రతిపక్ష నేతలతో విందు సమావేశం



న్యూఢిల్లీ : ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన తర్వాతనే అభివృద్ధి జరిగిందని మోడీ చెప్పుకుంటున్నారని, 2014 ముందు వరకు దేశంలో అభివృద్ధి జరగలేదా? అని కాంగ్రెస్ నేత సోనియా ప్రశ్నించారు. ఇలా అనడం దేశ ప్రజల మేధస్సును అవమానించడమే కాగలదని ఆమె అన్నారు. 'ఇండియా టుడే' శుక్రవారం నిర్వహించిన ఒక సదస్సులో సోనియా మాట్లాడుతూ, ప్రస్తుతం న్యాయ వ్యవస్థ సంక్షోభంలో వుందని, సమాచార హక్కు చట్టం కోల్డ్ స్టోరేజీలో వుందని, ఆధార్ 'అనుచితమైన నియంత్రణా సాధనం'గా మారిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాల వాణిని ప్రభుత్వం నొక్కేస్తోందని విమర్శించారు. 'మా స్వేచ్ఛ దాడికి గురవుతోంది. ఈనాడు తిరోగమన దృష్టి కొనసాగుతోంది. పార్లమెంట్ అనేది పరస్పరం అభిప్రాయాలను పంచుకునే వేదిక. ఇక్కడ మనల్ని మాట్లాడేందుకు అనుమతినివ్వకపోతే ఇక అర్థం ఏముంది?" అని ఆమె ప్రశ్నించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, మాజీ ప్రధాన మంత్రి అతల్ బీహారి వాజ్‌పేయిల వ్యవహార శైలిలో వున్న వ్యత్యాసంపై ఆమె వ్యాఖ్యానిస్తూ, పార్లమెంటరీ ప్రక్రియ పట్ల వాజ్‌పేయికి అమితమైన గౌరవముండేదన్నారు. భిన్నాభిప్రాయాలపై చర్చలను ప్రజాస్వామ్యం అనుమతిస్తుంది గాని.. ఇటువంటి స్వగతాలను అనుమతించదంటూ మోడీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మోడీ ప్రభుత్వంపై ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ విధానాలపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. దేశంలో పెరిగిపోతున్న అసహనాన్ని ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రజల గొంతు నొక్కేస్తున్నారు. ఎన్నికల్లో గెలుపొందాలనే ఏకైక లక్ష్యంతో మత ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారు. పారదర్శకత కోసం తీసుకువచ్చిన సమాచార హక్కు చట్టాన్ని కోల్డ్ స్టోరేజీలో పెట్టారని విమర్శించారు. భయాందోళనలు, బెదిరింపులనేవి ఈనాటి పరిస్థితని, ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని, మత ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నారని సోనియా విమర్శించారు. కాంగ్రెస్‌ను ముస్లిం పార్టీగా చూపించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రజలతో సంబంధాలు ఏర్పరచుకోవడంలో కాంగ్రెస్ కొత్త విధానాన్ని అవలంబించాల్సిన అవసరం వుందని అన్నారు. పార్టీలోకి యువతను, నైపుణ్యం, ప్రతిభ వున్నవారిని తీసుకుంటామని చెప్పారు. నాయకురాలిగా తన పరిమితులు తనకు తెలుసునని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఐక్య ఫ్రంట్ ఏర్పాటుకు తాజాగా ప్రయత్నాలు చేసే క్రమంలో ఈ నెల 13న విందుకు రావాలని ప్రతిపక్ష పార్టీల నేతలను సోనియా ఆహ్వానించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి గట్టి పోటీ ఇచ్చేందుకు ప్రతిపక్షాన్ని బలోపేతం చేసే దిశగా ఇదొక చర్య అని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

రైతు సంఘం నేతను చెప్పుతో కొట్టిన బిజెపి మహిళా నేత

అసభ్య పదజాలం వాడారని ఆరోపణ

చెన్నై : తనను దూషించాడనే ఆరోపణతో బిజెపి మహిళా నేత నెల్లాయ్ అమ్మల్ రైతు సంఘం నాయకుడు అయ్యకన్నుపై చెప్పుతో దాడి చేసిన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. మొబైల్ ఫోన్‌లో తీసిన వీడియో సోషల్ మీడియాలో షేర్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గత సంవత్సరం ఢిల్లీలో జరిగిన రైతుల ఆందోళనకు అయ్యకన్ను నాయకత్వం వహించారు. కాగా, టుటి కోరియన్‌లోని తిరుచేందర్ మురుగన్ దేవాలయం వెలుపల ఆయన కరపత్రాలను పంచుతున్న సమయంలో అక్కడకు వచ్చిన ఆమె ఆయనను మోసకారని దూషించారు. దీంతో వారిద్దరీ మధ్య వాగ్వాదం జరుగుతుండగా, ఆమె తన చెప్పుతో అతనిపై దాడి చేసింది. ఈ ఘటనపై ఆయన స్పందిస్తూ తాను ఎటువంటి అసభ్య పదజాలాన్ని వాడలేదని, తాము జన్యుపరమైన మార్పిడి పంటలు, నదుల అనుసంధానం కోసం కరపత్రాలను పంచుతున్నామని తెలిపారు. కాగా నెల్లాయ్ తమను అడ్డగించి వాగ్వాదానికి దిగారని తెలిపారు. తాము ఆలయం వెలుపల ఉన్నామని, తమ ర్యాలీని దెబ్బతీసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

రాజ్యసభకు ముగ్గురు బిజెడి అభ్యర్థుల నామినేషన్లు

భువనేశ్వర్ : రాజ్య సభ ఎన్నికలకు ఒడిస్సా నుండి బిజు జనతాదళ్ (బిజెడి) అభ్యర్థులుగా ప్రశాంత్ నంద, సౌమ్య రంజన్ పట్నాయక్, అచ్యుత సమంత శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఒడిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, మంత్రి బిక్రం కేసరీ ఆర్యా, సీనియర్ నేతల సమక్షంలో వారు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. వచ్చే నెలతో బిజెడి నేతలు ఎయు సింగ్‌డియో, దిలీప్ తిర్కే, బిజెపి మద్దతు గల ఇండిపెండెంట్ అభ్యర్థి ఎవి స్వామి రాజ్యసభ పదవీ కాలం ముగియనుండటంతో ఆ స్థానాలకు తిరిగి ఎన్నికలు అవసరమయ్యాయి.

శ్రీశ్రీ రవిశంకర్‌పై కేసు నమోదు

హైదరాబాద్ : ముస్లింల మనోభావాలు కించపరిచారంటూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీ శ్రీ రవి శంకర్ పై కేసు నమోదయ్యింది. అయోధ్య అంశంపై రెచ్చగొట్టే విధంగా మాట్లాడి ముస్లింల మనోభావాలను గాయప రిచారన్న ఆరోపణలతో ఫిర్యాదు అందిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది.

అయోధ్య వివాదానికి పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నిస్తున్న ఆధ్యాత్మిక గురు శ్రీ శ్రీ రవి శంకర్‌పై దర్సగహ్‌జిహాద్ ఓ షహదత్ (డిజెఎస్) దాఖలు చేసిన ఫిర్యాదుకు సంబంధించి రవి శంకర్‌పై కేసు నమోదయ్యిందని మొఘల్‌పురా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్. దేవేందర్ తెలిపారు. అయోధ్య వివాదం నేపథ్యంలో ముస్లింల మనో భావాలను, విశ్వాసాలను గాయ పరుస్తూ రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యానించారని ఫిర్యాదుదారు ఆరోపించారు. అయోధ్యలో మందిర నిర్మాణానికి వ్యతిరేకంగా కోర్టు తీర్పు వస్తే దేశంలో రక్తపాతం జరుగుతుందని, సిరియా తరహా పరిణామాలు సంభవిస్తాయని పటిషనర్ పేర్కొన్నారు.

జస్టిస్ లోయా కేసు

దవె వ్యాఖ్యలపై 'సుప్రీం' ఆగ్రహం



న్యూఢిల్లీ : జస్టిస్‌లోయా కేసులో న్యాయమూర్తులపై అపవాదులు మోపి న సీనియర్‌న్యాయవాది దుష్యంత్ దవేపై సుప్రీం కోర్టు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. లోయా మృతి కేసును తమ ముందుంచిన వారిపై "శోధించే ప్రశ్నలు" న్యాయమూర్తులు అడుగుతున్నారని, మహారాష్ట్ర ప్రభుత్వాన్ని అడగటం లేదని న్యాయవాది ఆరోపించారు. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎఎం ఖన్విల్కర్, డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలను తిరస్కరించారు. ఆ తరహా వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తం చేసింది. న్యాయాన్ని అందించడంలో మనస్సాక్షి చెప్పిన విధంగా చేస్తామన్నారు. ఎవరి నుంచి ఎటువంటి సర్టిఫికెట్‌లు తమకు అవసరం లేదన్నారు. జస్టిస్ లోయా కేసులో మహారాష్ట్ర తరుపున హాజరైన సీనియర్‌అడ్వకేట్ ముకుల్ రోహత్గిని ఎటువంటి ప్రశ్నలు అడగడం లేదని, తాను వాదిస్తుంటే మాత్రం అన్ని ప్రశ్నలు తానే ఎదుర్కోవలసి వస్తోందని దుష్యంత్ దవే అన్నారు. ఈ వ్యాఖ్యలను న్యాయమూర్తులు త్రోసిపుచ్చారు.

యుబి గ్రూపునకు రూ.12,400 కోట్లకు పైగా ఆస్తులు

రుణాలు తీర్చేయవచ్చునని కోర్టుకు వెల్లడి

ఎంగలూరు : తమకు రూ.12,400 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు విజయ మాల్యా యుబి గ్రూపుకు చెందిన యునైటెడ్ బ్ర్యూవరీస్ హోల్డింగ్స్ (యుబిహెచ్‌ఎల్) కర్ణాటక హై కోర్టులో పేర్కొంది. ఆ మొత్తంతో రూ. 6 వేల కోట్ల రుణాలతో సహా మొండి బకాయిలన్నిటినీ సులభంగా తీర్చి వేయవచ్చునని తెలిపింది. అప్పుల ఊబిలో కూరుకు పోయిన కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్ తీసుకున్న రుణాలకు యుబిహెచ్‌ఎల్ గ్యారంటీర్‌గా ఉంది. కంపెనీ ఆస్తులను, షేర్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్ట్ ద్వారా వేలం వేయించడం ద్వారా కంపెనీ నిర్వహణ సామర్థ్యం కుంటు పడటంతో అంతకుముందు కోర్టు ఆదేశించిన విధంగా ఏదైనా ప్రతిపాదనతో గాని, అదనపు డిపాజిట్లతో కాని కంపెనీ ముందుకు రాలేక పోయిందని తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి దినేష్ మహేశ్వరి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ఈ కేసు విచారణను ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.

రిజర్వేషన్ టిక్కెట్‌ను మరొకరి పేరుకు బదిలీ చేసుకోవచ్చు

- రైల్వేల తాజా నిర్ణయం

న్యూఢిల్లీ : రైలు రిజర్వేషన్ టిక్కెటును ఇతరులెవరికైనా బదిలీచేసే అవకాశాన్ని రైల్వేలు కల్పించాయి. ఈ మేరకు నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. ఏ కారణం చేతనైనా రిజర్వేషన్ టిక్కెట్టుపై ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడితే వెంటనే దానిని మరో ప్రయాణికుడికి, మీ కుటుంబ సభ్యులకు బదిలీ చేయవచ్చునని నోటిఫికేషన్ పేర్కొంది. ప్రధాన రైల్వే స్టేషన్లలో చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్ మీ టిక్కెట్టును మరొకరి పేరుకు మార్చే అధికారాన్ని కలిగి ఉంటారు. ఆ అధికారి అనుమతితో మీకు కేటాయించిన బెర్త్, సీట్ మరో ప్రయాణీకుని పేరు మీదకు బదిలీ అవుతుంది. రిజర్వేషన్ టిక్కెట్టుపై ప్రయాణించే వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగి అయ్యుండి,విధులకు హాజరవ్వాల్సిన సందర్భంలో రైలు బయలు దేరడానికి 24 గంటలు ముందుగా రిజర్వేషన్ టిక్కెటు బదిలీకి సంబంధించి లిఖితపూర్వకంగా అభ్యర్థనను అందించాల్సి ఉంటుంది. దీంతో ఆ టిక్కెట్టును మరో ప్రయాణికుడి పేరుకు బదిలీ చేస్తారు. సాధారణ ప్రయాణీకులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. రిజర్వేషన్ ధృవీకరించబడిన టిక్కెటను ఆయన కుటుంబ సభ్యుని పేరుకి గాను, లేదా ఇతరుల పేరుకు గాని బదిలీ చేసుకోవచ్చు. ఇందుకు గాను రైలు బయలుదేరడానికి 24 గంటలు ముందుగా లిఖిత పూర్వక అభ్యర్ధనను సమర్పించాల్సి ఉంటుంది. ఒక వేళ ప్రయాణికులు గుర్తించ బడిన విద్యా సంస్థకు చెందిన విద్యార్థులైతే ఆ విద్యా సంస్థకు చెందిన అధికారి రైలు బయలు దేరడానికి 48 గంటలు ముందుగా సంబంధిత అధికారికి లిఖిత పూర్వక అభ్యర్థనను ఇవ్వాల్సి ఉంటుంది. విద్యార్థి పేరుపై రిజర్వు చేసిన టిక్కెట్టును అదే సంస్థకు చెందిన మరో విద్యార్థి పేరు పై బదిలీ చేసుకోవచ్చునని రైల్వే శాఖ జారీ చేసిన నోటిఫికెషన్ తెలిపింది. ప్రయాణీకులందరు మారేజ్ పార్టీకి చెందిన వారైతే వారు కూడా 48 గంటలు ముందుగా లిఖిత పూర్వక అభ్యర్థనపై రిజర్వేషన్ టిక్కెట్లను బదిలీ చేసుకోవచ్చు. ఎన్‌సిసి అభ్యర్థులకు కూడా ఈ అవకాశం ఉందని నోటిఫికేషన్‌పేర్కొంది.. ఇటువంటి అభ్యర్థనలను ఒక్కసారికి మాత్రమే పరిమితం చేస్తారన్నారు. అయితే విద్యార్థులు, మ్యారేపార్టీ, ఎన్‌సిసి అభ్యర్థుల విషయంలో మొత్తం గ్రూపులో 10శాతం మించి బదిలీ చేసే అవకాశం ఉండదని నోటిఫికేషన్ పేర్కొంది.

శాంతి నెలకొనే దాకా పోలింగ్ వాయిదా

చారిలామ్‌పై ఈసిని కోరిన సిపిఎం



న్యూఢిల్లీ : త్రిపురలోని చారిలామ్ నియోజక వర్గంలో శాంతి నెలకొనే దాక ఎన్నికను వాయిదా వేయాలని సిపిఎం శుక్రవారం భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)ను కోరింది. ఈ నియోజక వర్గంలో సిపిఎం అభ్యర్థి మృతి చెందడంతో ఎన్నిక ఈ నెల 12కు వాయిదాడిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో కాషాయ పార్టీ గెలిచిన నాటి నుంచి సిపిఎం పార్టీ కార్యాలయాలపైన, జిల్లా కార్యాలయాలు, కేడర్‌పైన బిజెపి దాడులు పెరిగి పోయాయని సిపిఎం విమర్శించింది. త్రిపురలో నెలకొన్న హింసాత్మక పరిస్థితుల మధ్య నిష్పాక్షిక, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు జరగడం సాధ్యం కాదని సిపిఎం భావిస్తున్నది. హింసాత్మక సంఘటనలపై రాష్ట్ర పోలీసులకు అవగాహన ఉన్నదని, అయితే వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ ఎన్నికలు వాయిదా వేయాలని కోరింది. రాష్ట్రంలోని హింసకు బిజెపి కార్యకర్తలే కారణమని విమర్శించింది . ఈ సందర్భంగా సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓం ప్రకాష్ రావత్‌ను కలుసుకున్నారు. ఆయనతో పాటు తన డిప్యూటీలు అయిన సునీల్ అరోరా, అశోక్ లావాసాను కూడా కలుసుకున్నారు. ఎన్నికల అనంతరం పార్టీ ఆస్తులు ఏ మాత్రం ధ్వంసమయ్యాయో ఒక జాబితాను ఆయనకు అందించారు. సిపిఎం, ఆర్ ఎస్‌పిలకు చెందిన 11 పార్టీ కార్యాలయలకు నిప్పు పెట్టారని సిపిఎం ఆరోపించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలకు చెందిన 58 నివాసాలు లూటీకి గురయ్యాయని చెప్పింది. 19 మంది కార్మికులపై భౌతికంగా దాడికి దిగారని వారికి స్వల్ప గాయాలయ్యాయని పార్టీ పేర్కొంది. చారిలామ్ నియోజక వర్గంలో పార్టీకి చెందిన ఒక్క బూత్ కమిటీ ఆఫీసును కూడా వదలకుండా ధ్వంసం చేశారని చెప్పారు. బిషర్‌గంజ్ వద్ద సిపిఎం, ఆర్‌ఎస్‌పిలకు చెందిన కార్యాలయాలను ఆక్రమించినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. వాస్తవాలను పరిశీలించిన అనంతరం ఈ ఘటనలపై తగిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల కమిషన్ అధికారులు హామీ ఇచ్చారని ఆయన వెల్లడించారు.

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తరువాత నుంచి బిజెపి కార్యకర్తల హింసాత్మక సంఘటనలు పెరిగిపోయాయి. అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న సంఘటనలలో కాషాయ పార్టీ కార్యకర్తలు లెనిన్ విగ్రహాన్ని కూల్చి వేసిన సంఘటన ఒకటి. ఇది టెలివిజన్‌లో కూడా ప్రసారమైంది. రామ్ మాధవ్, తథాగత్‌రాయ్ తదితర బిజెపి నేతలు ట్విట్టర్‌లో ఈ సంఘటనను ఆమోదించారు. ఈ సంఘటన నేపథ్యంలో దేశంలోని పలు ప్రాంతాలలో శిలా విగ్రహాల కూల్చివేత కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జోక్యం చేసుకునేంత వరకు ఈ సంఘట నలు కొనసాగాయి. అయినా బిజెపి నేతలు అంతటితో ఆగలేదు. ఈ సంఘటనలను ప్రధాని మోడీ ఖండించి నప్పటికి, హోం మంత్రిత్వ శాఖ నివారణ చర్యలు తీసుకున్నప్పటికీ ఫలితం లేక పోయింది. అయితే త్రిపు ర రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యులపై దాడులు జరుగుతున్నాయని పలు వార్తా కథనాలు సూచిస్తున్నాయి.

టీకాల కొరతతో నైజీరియాలో 8 లక్షల మంది చిన్నారుల మృతి

అబుజా : గత ఐదేళ్ళ కాలంలో టీకాలు వేయని కారణంగా నైజీరియాలో దాదాపు 8లక్షల మంది చిన్నారులు మరణించారని జివిఐ (గ్లోబల్ అలయన్స్ ఫర్ వాక్సిన్స్ అండ్ ఇమ్యూనైజేషన్) తెలిపింది. జివిఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెత్ బర్కిలీ మాట్లాడుతూ, ఇటీవల జరిపిన సర్వే ప్రకారం, నైజీరియాలో కేవలం 30శాతం ప్రాంతాల్లో మాత్రమే వాక్సిన్‌లు వేశారని తెలిపింది. దీనివల్ల అనేకమంది చిన్నారులు నివారించదగ్గ వ్యాధులతోనే మరణించారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా వుండేందుకు దేశవ్యాప్తంగా టీకాల కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయనున్నట్లు బర్కిలీ తెలిపారు. ఈ కార్యక్రమానికి కలిసి రావాల్సిందిగా ఆయన ప్రభుత్వాన్ని, ఇతర ఆసక్తి గల పక్షాలను కోరారు. ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్లు అందచేసేందుకు 2000 జనవరిలో జివిఐ ఏర్పాటైంది.



■ ఇబ్బందులు సిడ్నీలోని దేశీయ విమానాశ్రయంలో సాంకేతిక లోపాలు తలెత్తి విమానాలు నిలిచి పోవటంతో అవస్థలు పడుతున్న ప్రయాణీకులు

ముషారఫ్ అరెస్టుకు ఆదేశాలు

ఆస్తులు జప్తు చేయాలన్న ప్రత్యేక ట్రిబ్యునల్

ఇస్లామాబాద్ : మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌ను అరెస్టు చేయాలని, ఆయన ఆస్తులన్నింటినీ జప్తు చేయాలని పాకిస్తాన్ ప్రత్యేక ట్రిబ్యునల్ ఆదేశించింది. 2007లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించినందుకు 'ప్రకటిత నేరస్తుడు'గా పేర్కొంటూ ముషారఫ్‌పై నమోదైన దేశద్రోహం కేసును ట్రిబ్యునల్ విచారించింది. 2014 మార్చిలో దేశద్రోహం ఆరోపణలపై ఆయనను అభిశంసించింది. ఈ ఎమర్జన్సీ కాలంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పలువురిని గృహ నిర్బంధంలో పెట్టారు. వందమందికి పైగా న్యాయమూర్తులను తొలగించారు. పెషావర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి యాహ్యా అఫ్రిది నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం మొదటిసారిగా విచారణ జరిపింది. విచారణ సమయంలో ముషారఫ్ ఆస్తులపై హోం మంత్రిత్వ శాఖ నివేదిక సమర్పించింది. ముషారఫ్ అరెస్టుకు ఆదేశించాలని, ఆయనను కోర్టు ముందు హాజరుపరచాలని ప్రాసిక్యూటర్ అక్రమ్ షేక్ కోర్టును కోరారు. ముషారఫ్‌ను విదేశాల నుండి వెనక్కి రప్పించాలంటే తీసుకోవాల్సిన చర్యలేంటని కోర్టు ఫెడరల్ దర్యాప్తు అధికారులను ప్రశ్నించింది. వారిచ్చిన సమాధానాన్ని పరిగణనలోకి తీసుకుని కోర్టు ముషారఫ్ అరెస్టుకు, ఆస్తుల జప్తుకు ఆదేశించింది.

ఉక్కు, అల్యూమినియంపై సుంకాల పెంపు

డిక్రీపై సంతకం చేసిన ట్రంప్

వాషింగ్టన్ : వాణిజ్య యుద్ధం తలెత్తుతుందనే హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, తాను అనుకున్నట్లుగానే ఉక్కు, అల్యూమినియంపై సుంకాలు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ డిక్రీపై సంతకాలు చేశారు. ఈ సుంకాల పెంపు నుండి కెనడా, మెక్సికోలను మినహాయించారు. త్వరలో మరిన్ని సుంకాలు వుండగలవని హెచ్చరించారు. అమెరికా ఉత్పత్తులపై అధికంగా సుంకాలు విధించే దేశాల నుండి వచ్చే దిగుమతులపై మరిన్ని పన్నులు వుంటాయని తెలిపారు. జాతీయ భద్రత ప్రాతిపదికగా ఇతర దేశాలకు మినహాయింపు ఇవ్వడానికి ద్వారాలు తెరిచి వుంచారు. ఉక్కు, అల్యూమినియం పరిశ్రమలకు చెందినవారితో సమావేశమైన ట్రంప్ ఈ మేరకు ప్రకటించారు.

పాకిస్తాన్ టెర్రరిస్ట్ నేతల అరెస్టులకు రివార్డు

వాషింగ్టన్ : ఆఫ్ఘనిస్తాన్ ఆధారిత తహ్రిక్-ఇ- తాలిబన్ పాకిస్తాన్ (టిటిపి)నేత మౌలానా ఫజుల్లాను అరెస్టు చేయడానికి అవసరమైన వివరాలు అందించిన వారికి 5 మిలియన్ డాలర్లు బహుమతిగా ఇవ్వనున్నట్లు అమెరికా ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. అలాగే జమ్మత్-ఉల్-అహరార్ (జెయుఎ) నేత అబ్దుల్ వలి, లష్కర్-ఇ-తొయిబా నేత మంగల్ బాగ్‌లకు అమెరికా ప్రభుత్వం మూడు మిలియన్ డాలర్ల చొప్పున రివార్డును ప్రకటించింది. పాకిస్తాన్ విదేశాంగ కార్యదర్శి తెహ్మీరా జంజువా వైట్‌హౌస్‌లోని ట్రంప్ అధికారిక కార్యాలయం ప్రతినిధులతో సమావేశం అయిన అనంతరం ఈ రివార్డులను ప్రకటించారు. తూర్పు ఆఫ్ఘనిస్తాన్‌లోని గిరిజన ప్రాంతాలలో టిటిపి ఉగ్రవాద సంస్థ అని రాష్ట్ర అధికారులు వెల్లడించారు.

2020 నాటికి పేదరికాన్ని పారదోలుతాం

బీజింగ్: పేదరిక నిర్మూలనకు మరిన్ని చర్యలు తీసుకోవాలని చైనా నిర్ణయించింది. గత ఐదేళ్ల కాలంలో పేదరికాన్ని తగ్గించడంలో గణనీయమైన ఫలితాలు సాధించిన చైనా రానున్న కాలంలో ఇంకా ఎక్కువ విజయాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు డైరెక్టర్ ఆఫ్ స్టేట్ కౌన్సిల్ లియు యోంగ్‌పూ తెలిపారు. 2018లో పేదరిక నిర్మూలనకు చైనా ప్రభుత్వం 106 బిలియన్ యూవన్‌లను కేటాయించింది. గత ఏడాదితో పోల్చుకుంటే 20 బిలియన్ యూవన్‌లను అధికంగా కేటాయించిందని లియు చెప్పారు. గత ఐదేళ్ల కాలంలో ఆరు కోట్ల 80 లక్షల మంది ప్రజలను పేదరికం నుండి బయటకు తెచ్చినట్లు యు తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పేదరిక నిర్మూలన చర్యల అమల్లో భద్రతను పెంచే విధంగా, అవినీతిని తగ్గించే విధంగా విధానాలను రూపొందించుకున్నట్లు లియు చెప్పారు. నవంబర్ 2015లో పేదరిక నిర్మూలన కోసం చైనా క్యాంపెయిన్ ప్రారంభించిన నాటి నుండి వారి విధులను నిర్వర్తించే క్రమంలో 400 మంది ప్రాణాలను సైతం లెక్క చేయలేదని చెప్పారు. గత ఏడాది పేదరిక నిర్మూలన కార్యక్రమంలో 28 ప్రావిన్స్‌లలో తప్పుడు ప్రవర్తన కింద 80 వేల మందిపై విచారణ జరిపి



చైనా ఆర్థికశాఖ మంత్రి లౌ జివి

శిక్షించినట్లు ఆర్థిక శాఖా మంత్రి లౌ జివి చెప్పారు. మొత్తం 730 మిలిన్ యువాన్ల మేరకు అవినీతి జరిగినట్లు గుర్తించామని చెప్పారు. 2020 నాటికి దేశంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దేశంలో ఉన్న ప్రజలందరినీ తలసరి వార్షిక ఆదాయం 2300 యువాన్ల కన్నా ఎక్కువ లభించేట్లు చేయనున్నారు. ఈ ఏడాది కోటి మంది ప్రజలను పేదరికం నుండి బయటకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఏడాది ముగిసే నాటికి మూడు కోట్ల మంది చైనీయులు జాతీయ పేదరికపు గీత కన్నా దిగువ భాగాన ఉన్నారు.

టారిఫ్‌లతో ప్రపంచ వాణిజ్యాన్ని నాశనం చేస్తున్నారు

- ట్రంప్‌పై ధ్వజమెత్తిన చైనా

ఇనుము, ఉక్కు దిగుమతులపై సుంకాలను పెంచటం ద్వారా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ వాణిజ్యాన్ని నాశనం చేస్తున్నారని చైనా ధ్వజమెత్తింది. ట్రంప్ చర్యలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ చర్యలతో తమ కంపెనీలు ఇబ్బంది పడితే తాము ప్రతీకార చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయితే ఈ చర్యలు ఎలా వుంటాయన్న విషయాన్ని వెల్లడించలేదు. కాగా ద.కొరియా వాణిజ్య మంత్రి పైక్ ఉన్ గ్యూ మీడియాతో మాట్లాడుతూ ఇతర దేశాలు ఈ వివాదాన్ని నివారించేందుకు సహకరించాలని కోరారు. ట్రంప్ చర్యలు ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా వున్నాయని జపాన్, ద.కొరియాలు ఆందోళన వ్యక్తం చేశాయి. స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా ఇటువంటి చర్యల విషయంలో అంతర్జాతీయ సమాజం సంయమనంతో వ్యవహరించాలని తాము కోరుతున్నట్లు ద.కొరియా విదేశాంగ మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీలంకలో చెలరేగిన హింస

- మసీదుల వద్ద అదనపు బలగాలు

కొలంబో : మెజారిటీ బౌద్ధులకు, మైనారిటీ ముస్లింలకు మధ్య తాజాగా ఘర్షణలు జరిగి, హింస చెలరేగిన నేపథ్యంలో దేశంలోని ఇతర ప్రాంతాలకూ హింస వ్యాప్తి చెందుతుందని భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో శుక్రవారం ప్రార్ధనల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మసీదుల వద్ద భద్రతా బలగాలను మోహరించారు. గత సోమవారం నుండి కాండీ జిల్లాలో ముస్లింలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ఘర్షణల్లో ఇద్దరు మరణించగా, అనేక ఇళ్లు, వ్యాపార సంస్థలు, మసీదులు ధ్వంసమయ్యాయి. గతవారం బౌద్ధ జాతీయుడు ఒకరు మరణించడంతో హింస ప్రారంభమైంది. మతోన్మాద హింస చెలరేగకుండా ముందు జాగ్రత్తగా పది రోజుల పాటు దేశంలో అత్యవసర పరిస్థితి విధించారు. సెంట్రల్ జిల్లాలో ముస్లింలు నివసించే ప్రాంతాల్లో శుక్రవారం తాజా హింస చెలరేగింది. ముస్లిం ప్రాంతాలపై దాడులు చేయడానికి అల్లరిమూక ప్రయత్నించింది. వెంటనే సైన్యం జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దింది. మరికొన్ని చోట్ల ముస్లింలు వుండే ప్రాంతాల్లో రాళ్ళు విసిరిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ముస్లింలకు చెందిన వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. రాజధాని కొలంబోలో కూడా ముస్లింల సంస్థలను మూసివేశారు. నగరంలోని మసీదుల వద్ద అదనపు బలగాలు మోహరించారు. ప్రస్తుతం కాండీలో పరిస్థితి ప్రశాంతంగానే వుందని పోలీసులు తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు మూతపడ్డాయి.

దైవ ధూషణ చట్టానికి సవరణలు

పాక్‌పై పెరుగుతున్న ఒత్తిడి

లాహోర్ : దైవ దూషణ చట్టానికి సవరణలు చేయాలని పాకిస్తాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. మతపరమైన స్వేచ్ఛను తీవ్రంగా ఉల్లంఘించే దేశాల జాబితాలోకి పాకిస్తాన్‌ను చేర్చేందుకు ఈ దైవ దూషణ చట్టం కూడా ఒక కారణమని అమెరికా విదేశాంగ శాఖ జనవరిలో పేర్కొంది. చాలా చిన్న నేరం చేసినా అంతిమంగా మరణశిక్ష విధించేలా చట్టంలోని నిబంధనలు వున్నాయని మానవ హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు. పాక్ సమాజాన్ని క్రమంగా నాశనం చేసే శక్తిగా ఈ చట్టం మారుతోందని ఈ చట్టాన్ని వ్యతిరేకించేవారు పేర్కొంటున్నారు. వ్యక్తిగత కక్షలతో ప్రత్యర్థులను శిక్షించడానికి ఈ చట్టాన్ని తరచుగా ఉపయోగిస్తున్నారని ఆరోపణలు వున్నాయి. అసియా బీబీ అనే క్రిస్టియన్ మహిళకు సంబంధించి 2009లో జరిగిన ఒక సంఘటన ఇప్పుడీ దైవదూషణ చట్టం గురించి మాట్లాడుకునేలా చేసింది. కొంతమంది ముస్లిం మహిళల కోసం బీబీ నీరు పట్టుకొచ్చేది. ఒకసారి వారికి పట్టుకువస్తున్న నీరు బీబీ తాగింది. దీంతో ఆగ్రహావేశులైన ఆ ముస్లిం మహిళలు ఆమెను మతం మారాలని డిమాండ్ చేశారు. ఆమె దానికి తిరస్కరించింది. ఐదు రోజుల తర్వాత ఆమె దైవదూషణకు పాల్పడిందంటూ ఒక అల్లరిమూక ఆమెపై ఆరోపణలు చేసింది. దానిపై ఆమెకు మరణశిక్ష విధించారు. ఈ నెల చివరిలో బీబీ పెట్టుకున్న పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారించనుంది. ఈ నేపథ్యంలో పాక్ దైవదూషణ చట్టంలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ పెరుగుతోంది.

ఆఫ్ఘన్ జిప్సీలను దెబ్బ తీస్తున్న హింసాకాండ

చట్టపరమైన గుర్తింపునకై డిమాండ్

కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్‌లో జోగి తెగకు చెందిన జిప్సీలు ఇప్పుడు తమకు చట్టపరమైన గుర్తింపు కావాలని కోరుతున్నారు. తాము తిరిగే ప్రాంతాల్లో హింసాకాండ చెలరేగి మొత్తంగా ధ్వంసం కావడంతో వారు వారి సంచార జీవితాలను వీడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రోజువారీ వివక్షకు వారింకా గురవుతునే వున్నారు. తమని సక్రమమైన పౌరులుగా గుర్తించని దేశంలో ఇక వారు సంచార జీవితాన్ని విరమించి ఒకచోటనే నివసించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రశాంతంగా వుండే బల్క్ ప్రావిన్స్ రాజధాని మజార్ ఇ షరీఫ్‌కు సమీపంలో స్థిర నివాసం ఏర్పరచుకోవాలని వీరిలో చాలామంది భావిస్తున్నారు. నేలను అద్దెకు తీసుకుని మట్టి ఇటుకలతో ఇళ్ళు కట్టుకుంటున్నారు. అయినా ఇక్కడ కూడా వారికి భద్రత లేదని భావిస్తున్నారు. జోగిలను ఆఫ్ఘన్లుగా ఆ దేశ రాజ్యాంగం గుర్తించడం లేదు. దాంతో ఇక్కడ వారికి గుర్తింపు కార్డు సంపాదించుకోవడం కూడా చాలా కష్టసాధ్యమవుతోంది. శాశ్వతంగా ఒకేచోట స్థిర నివాసం ఏర్పరచుకోవడానికి భూమి కొనుగోలుతో సహా పాలనాపరమైన ఏ చర్య తీసుకోవాలన్నా వారికి గుర్తింపుకార్డు అవసరమవుతోంది.

మొదటి పేజీ తరువాయి

స్వచ్ఛంద మరణానికి సుప్రీం ఓకే!

మిశ్రా నేతృత్వంలోని ఐదు గురు న్యాయమూర్తుల ధర్మాసనం గురువారం పై తీర్పు చెప్పింది. ఎవరెవరు ఈ స్వచ్ఛంద మరణా నికి అర్హులు, ఎవరికి అనుమతినివ్వాలి అనే విషయంపై కొన్ని నిబంధనలను రూపొందిం చింది. దీనిపై ఒక చట్టాన్ని తీసుకువచ్చే వరకు తాము జారీ చేసిన మార్గదర్శక సూత్రాలు అమల్లో వుంటాయని సుప్రీం స్పష్టం చేసింది. నలుగురు న్యాయమూర్తులు విడివిడి అభిప్రాయాలు తెలిపినప్పటికీ తీర్పు మాత్రం ఏకాభి ప్రాయంతో ఇచ్చినట్లు తెలిపింది.

ఎండలు మండుతాయి

ఉంటుందన్నారు. మార్చి నుంచి మేలో అధిక స్థాయిలో ఎండ తీవ్రత ఉంటుందన్నారు. వాతావరణంలో వచ్చే మార్పులను, గత 30 సంవత్సరాల స్థితిగతులను అంచనా వేసి వడగాల్పులకు సంబంధించి ముందస్తు సూచనలను చేస్తామన్నారు. వడగాల్పుల తీవ్రతను బట్టి తీసు కోవలసిన చర్యలపై జిల్లా యంత్రాంగానికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తామ న్నారు. 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే సాధారణ ఉష్ణోగ్రతలకు సంబం ధం లేకుండా అధిక ఉష్ణోగ్రతలుగా నమోదు చేసి వడగాల్పులుగా పేర్కొంటామ న్నారు. రాష్ట్రంలో వాతావరణ మార్పుల విషయంలో జారీ చేస్తున్న హెచ్చరికల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారన్నారు. ఒకేసారి లక్ష మందికి ఎంఎస్‌ఎంల ద్వారా సమాచారాన్ని అందించే వ్యవస్థను రూపొందించారని, అదే విధంగా సిగ్నల్స్ దొరకని ప్రాంతంలో స్మార్ట్ ఫోన్లకు సందేశాన్ని పంపే ఆధునిక వ్యవస్థలు రూపొందించడంలో ప్రయోగాత్మకంగా చర్యలు చేపడుతున్నారని వివరించారు. వారితో పాటు ఎపిఎస్‌డిపియస్ అధికారి రమణమూర్తి ఉన్నారు.

రాజీనామాలిచ్చినా కేంద్రంలో స్పందన లేదు..

నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. గవర్నర్ రాష్ట్ర బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించినా సానుకూలత రాలేదన్నారు. ఈ నేపథ్యంలో పరిమిత వనరులనే సంక్షేమానికి, అభివృద్ధికి వ్యయం చేస్తూ రాష్ట్ర ఆదాయాన్ని పెంచాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయం నుంచి శుక్రవారం సిఎం శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏడాదిన్నర దాటినా ఇఎపి ద్వారా ఇస్తామన్న నిధులు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో కనీసం ఆంధ్రప్రదేశ్ పేరు కూడా ప్రస్తావించ లేదన్నారు. విడుదలైన నిధులకు వినియోగ ధ్రువీకరణలు (యుసిలు) ఎప్పటికప్పుడు పంపించినా, పంపలేదంటూ కేంద్రం సాకులు చెబుతోందని సిఎం పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి ఇంతవరకు కేవలం రూ 2500 కోట్లే ఇచ్చి ఏం ఖర్చు పెట్టారని అడుగుతోందని మండిపడ్డారు. రాజధాని కోసం రైతులు రూ 40 వేల కోట్ల విలువైన 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారని, ఇది కేంద్రం ఇచ్చిన దాని కంటే విలువైనదని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి నిధులివ్వకుండా కేంద్రం మొండి చేయి చూపిందన్నారు. ఈ అంశాలన్నీ పరిశీలించాకే తుది నిర్ణయం తీసుకుని మంత్రులతో రాజీనామాలు చేయించామని వివరించారు. హుదూద్ తుఫానుకు ప్రధాని వెయ్యి కోట్లు సహాయం ప్రకటించి, రూ. 650 కోట్లే ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి ఇలావున్నా, రాష్ట్రంలో కష్టపడి సత్ఫలితాలను సాధించగలిగామని ఆయా రంగాల వారీ ప్రగతిని ప్రస్తావించారు. సేవలు, పరిశ్రమల రంగంలో కాస్త వెనుకబడి ఉన్నామని ఈ రంగాల్లో మరింత వృద్ధి సాధించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో సుస్థిర ఆర్థిక వృద్ధి సాధించాలని, అన్ని అంశాల్లో గ్లోబల్ బెంచ్ మార్కులు పెట్టుకుని పని చేయాలని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల అక్రిడిటేషన్ పొందాలన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. ఈ ఏడాది జూన్ నాటికి 29 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తి చేయాలని, ఆ తర్వాత మరో 21 ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలన్నారు.

ఏప్రిల్ నుంచి అన్ని శాఖల్లోనూ ఇ- ఆఫీస్

ఇ-ఆఫీస్ అమలు పురోగతిని సిఎం సమీక్షిస్తూ ఏప్రిల్ 1 నుంచి ప్రతి శాఖలో ఇ-ఆఫీస్ కచ్చితంగా అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈనెల 29 నుంచి సమగ్ర ఆర్థిక నిర్వహణ విధానం గో-లైన్ ప్రారంభిస్తామని ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర ముఖ్యమంత్రికి తెలిపారు. పాత విధానం ఈనెల 31 నాటికి పూర్తవుతుందన్నారు. ఈ విధానంపై పేటెంట్ రైట్స్ కోసం దరఖాస్తు చేయాలని సిఎం సూచించారు. అక్టోబర్ 2 నాటికి భూధార్ ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు వివరించారు. ఆరు శాఖల సమన్వయంతో భూ వివాదాలు పరిష్కరించి, డిజిటలైజేషన్ ద్వారా ప్రాపర్టీస్‌కు 11 డిజిట్లతో భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు.

బిజెపి, ఆరెస్సెస్ ఫాసిస్టు దాడులు

మొదటి పేజీ తరువాయి

అంటూ ప్లకార్డులతో పెద్ద ఎత్తున నినాదాలు హోరెత్తించారు. లెనిన్, అంబేద్కర్, పెరియార్‌ల చిత్రపటాలు చేబూని వామపక్ష కార్యకర్తలు తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో పాల్గొన్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ త్రిపురలో వామపక్ష కార్యకర్తలు, మద్దతు దారులను లక్ష్యంగా చేసుకొని బిజెపి, ఆరెస్సెస్ దాడులకు పూనుకుంటున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించని వారు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడతారని, బిజెపి, ఆరెస్సెస్ అలాంటి కోవకే చెందినవని దుయ్యబట్టారు. త్రిపుర ప్రజలు అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేయడమనే సుదీర్ఘ సాంప్రదాయాన్ని కలిగి ఉన్నారని గుర్తు చేశారు. స్వాతంత్రానికి ముందే ఫ్యూడల్ రాజుకు వ్యతిరేకంగా త్రిపుర ప్రజల పోరాడారని, రాష్ట్రంలో వామపక్షాల బలమైన పునాది నిర్మించేందుకు అండగా ఉన్నారని తెలిపారు. 1988-93 మధ్య కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం చేత సృష్టించబడిన ఉగ్రవాదంపై కూడా త్రిపుర ప్రజలు మహోన్నత పోరాటం సాగించారని గుర్తు చేశారు. ఆ ఉద్యమంలో 350 మంది వామపక్ష కార్యకర్తలు ప్రాణాలర్పించారని తెలిపారు. 1993లో త్రిపుర ప్రజలు కాంగ్రెస్‌ను ఓడగొట్టి, వామపక్షాలను గెలిపించారని, గత 25 ఏళ్లగా వామపక్ష ప్రభుత్వాన్ని ఆదరించారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత బిజెపి, ఆరెస్సెస్‌లు వామ పక్షాలపై హత్యాకాండను సాగిస్తున్నాయని మండిపడ్డారు. వారం రోజులుగా సిపిఎం కార్యాలయాలు, కార్యకర్తలపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నా బిజెపి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. దాడులపై విచారణ కూడా జరపడం లేదన్నారు. ఈ దాడుల్లో 600కు పైగా వామపక్ష కార్యకర్తలు గాయపడ్డారని, వామపక్ష మద్దతుదారులకు చెందిన 1539 ఇళ్లపై దాడి జరిగిందని, 196 ఇళ్ల దహనం చేయబడ్డాయని తెలిపారు. 134 పార్టీ, ప్రజా సంఘాల కార్యాలయాలను ధ్వంసం చేశారని, 600 కార్యాలయాలు బలవంతంగా ఆక్రమించుకున్నారని వివరించారు. వామపక్షాలు గతంలో చేసిన విధంగానే దాడులు తిప్పికొట్టి, ఆరెస్సెస్, బిజెపి కుతంత్రాలను ఓడించాలని సూచించారు. త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని, అంబేద్కర్, పెరియార్ విగ్రహాలపై దాడిని ఖండించిన ప్రకాశ్ కరత్.. ఆరెస్సెస్, బిజెపి ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిని ఈ ఘటనలు నిరూపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. అణచివేతకు, వామ పక్ష కార్యకర్తల ఇళ్లు, పార్టీ కార్యాలయాలపైన జరుగుతున్న దాడులకు బిజెపి, ఆరెస్సెస్ ముగింపు పలకాలని, దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కరత్ డిమాండ్ చేశారు.

బిజెపి నేతల ప్రోత్సాహంతోనే ప్రముఖుల విగ్రహాల కూల్చివేత, దాడులు జరుగుతున్నాయని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యులు కవితా క్రిష్ణన్ అన్నారు. బిజెపి, ఆరెస్సెస్ ఆటలు సాగనివ్వమని, దాడులను తిప్పికొడతామని హెచ్చరించారు.

దేశంలో బిజెపి, ఆరెస్సెస్‌లు ఫాసిస్టు పోకడలతో వ్యవహరిస్తున్నాయని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు అమానుషమని సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా అన్నారు. ఇలాంటి దాడులు కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఆపలేవని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్టులు, ఆ స్థాయిలోనే బిజెపి, ఆరెస్సెస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తారని స్పష్టం చేశారు.

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు మాట్లాడుతూ బిజెపి త్రిపురలో గెలిచిన తర్వాత విధ్వంసం సష్టిస్తోందని మండిపడ్డారు. విగ్రహాలను కూలదోయడం నాగరికత అనిపించుకోదన్నారు. దాడులతో వామపక్ష కార్యర్తలను భయపెట్టాలనుకోవడం అమాయకత్వమే అవుతుందన్నారు. త్రిపురలో జరుగుతున్న దాడులను ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని సిపిఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుష్పేంద్ర గ్రెవాల్, ఎస్.పుణ్యవతి, ఆర్.అరుణ్ కుమార్, సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి తివారి, సిపిఎం నేతలు నాయకులు నత్తు ప్రసాద్, జి.మమత, ఫార్వర్డ్ బ్లాక్ నేత అమ్రీష్ కుమార్, ఆరెస్పీ నేత ఆర్ఎస్ డాగర్, ఎస్‌యుసిఐ(సి) ఢిల్లీ కార్యదర్శి ప్రణ శర్మ, సిజిపిఐ నేత ప్రకాశ్ రావు, ఎస్ఎఫ్ఐ ఢిల్లీ కార్యదర్శి ప్రశాంత్ ముఖర్జీ, ఐద్వా నేత మొమునా మొల్లా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మరో షాక్

మొదటి పేజీ తరువాయి

చెబుతోంది. అయితే కేంద్రం మాత్రం ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తోంది. జిఎస్‌డిపిలో మూడు శాతం వరకు మాత్రమే రుణాన్ని తీసుకునేందుకు ఆస్కారం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న జిఎస్‌డిపికి, కేంద్రం గుర్తించిన జిఎస్‌డిపికి మధ్య భారీగా తేడా ఉండడంతో మార్కెట్ రుణాలకు అనుమతి కూడా తగ్గుతోంది. ఈ కారణాన్ని చూపి స్తూనే రాష్ట్ర రుణ దరఖాస్తును తిరస్కరించినట్లు తెలుస్తోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 293 (3)ని అనుసరించి మూడు శాతం రుణానికి అనుమతి ఇస్తున్నారు. అయితే కొన్ని ప్రత్యేక నిబంధనల మేరకు కొన్ని రాష్ట్రాలకు గత ఏడాది 3.5 శాతం వరకు ఈ పరిమితి పెంచారు. పక్కనున్న తెలంగాణకు కూడా 3.5 శాతం వర్తింపజేశారు. రాష్ట్రంలో అప్పులు ఎక్కువగా ఉండడం, జిఎస్‌డి పిలో మొత్తం రుణ శాతం, చేస్తున్న అప్పుల శాతం కూడా ఎక్కువగా ఉండడంతో రాష్ట్రానికి 3.5 శాతాన్ని వర్తింపజేసేం దుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేయడం లేదు. దీంతో రాష్ట్ర ఆర్థిక శాఖ రాసిన పలు లేఖలను కేంద్రం పక్కనపెట్టేసింది. ఇప్పుడు మార్కెట్ బారో యింగ్స్ కోసం చేసుకున్న దరఖాస్తును కూడా తిరస్కరిం చడంతో రాష్ట్ర ఆర్థిక శాఖకు కోలుకోలేని దెబ్బ తగిలినట్లుగానే భావిస్తున్నారు.

దేశంలో పెరుగుతున్న అత్యంత సంపన్నులు

మొదటి పేజీ తరువాయి

ఆసియాలో ప్రధానంగా చైనా, ఫిలిప్పీన్స్, భారత్‌లో వీరి సంఖ్య వృద్ధి చెందుతోందని పేర్కొంది. చైనాలో 104 శాతం, ఫిలిప్పీన్స్‌లో 84 శాతం, భారత్‌లో 71 శాతం ఉందని అంచనా వేసింది. కేవలం 5 మిలియన్ డాలర్లు అంతకుమించి తక్కువ సంపద కలిగిన వారి సంఖ్య గత ఏడాదిలో 47, 720లుగాఉంది. గడిచిన ఐదేళ్ళలో వీరి సంఖ్య 56 శాతానికి పెరిగి పోయిందని, రానున్న ఐదేళ్లలో 71 శాతానికి పెరగనున్నదని సంస్థ వెల్లడించింది.

10 టన్నుల ఎర్ర చందనం పట్టివేత

విలువ రూ.4 కోట్లు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ పోర్టులోని నౌకలో 10 టన్నుల ఎర్ర చందనం దుంగలను విశాఖ ఇంటిలిజెన్స్ అధికారులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుంది. చెన్నయ్ నుంచి విశాఖ మీదుగా చైనా వెళ్తున్న నౌకలో ఎర్ర చందనం అక్రమ రవాణా అవుతున్నట్లు హైదరాబాద్ ఇంటిలిజెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు విశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. అధికారులు పోర్టులో నౌకను నిలిపి తనిఖీలు నిర్వహించారు. రెండు కంటైనర్లలో 10 టన్నుల ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకుని విచారణ జరుపుతున్నారు.

హోదా ఆందోళన

మొదటి పేజీ తరువాయి

నిరసన చేపట్టారు. ప్రధానమైన ఆరు డిమాండ్లతో పాటు 'సేవ్ ఏపి' అని ముద్రించిన టీషర్టులతో సభ లోపలా, బయటా నిరసన తెలిపారు. ఏపికి ప్రత్యేక హోదా కోరుతూ వైసిపి ఎంపిలు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద (గేట్ నెంబర్ 1) ఆందోళన చేశారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ప్రత్యేక హోదా కోసం గురించి మాట్లాడితే చంద్రబాబు హేళన చేశారని, ఇప్పుడు చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారని వైసిపి ఎంపిలు ఆరోపించారు. అనంతరం లోక్‌సభలో హోదా, విభజన హామీల అమలును పట్టుబడుతూ ఏపి ఎంపిలు వెల్‌లోకి దూసు కెళ్లారు. మరోవైపు కాంగ్రెస్, టిఎంసి, సిపిఎం, అన్నాడిఎంకె, టిఆర్ఎస్ ఎంపిలు తమ తమ డిమాండ్లతో వెల్‌లోకి దూసు కెళ్లి పెద్ద ఎత్తున నినాదాలివ్వడంతో సభలో గందరగోళం నెలకొంది. ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి.

ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు

ఆంధ్రప్రదేశ్‌కు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీలు ప్రజలను మోసం చేశారని ఏపి కాంగ్రెస్ కమిటీ విమర్శించింది. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఓం ప్రకాశ్ రావత్‌కు ఏపి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎన్.రఘువీరా రెడ్డి నేతృత్వంలోని బృందం వినతిపత్రం సమర్పించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, ప్రజలను మోసం చేశారని, అందువలన బిజెపి, టిడిపిల గుర్తింపు రద్దు చేయాలని వినతి పత్రంలో పేర్కొంది.

అశోక్, సుజనా రాజీనామాలకు ఆమోదం

కేంద్ర మంత్రి పదవులకు సుజనా చౌదరి, అశోక్ గజపతిరాజు చేసిన రాజీనామాలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు. ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న టిడిపి తరపున కేంద్ర మంత్రి వర్గంలో ప్రాతినిథ్యం వహిస్తున్న పౌరవిమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు, శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి సుజనాచౌదరి గురువారం తమ పదవులకు రాజీనామాలు చేసిన సంగతి తెలిసిందే.

మేలో ట్రంప్-కిమ్ భేటీ

మొదటి పేజీ తరువాయి

అధినేతలూ శిఖరాగ్ర సదస్సుకు ఇప్పటికే అంగీకరించారు. సాధ్యమైనంత త్వరలో ట్రంప్‌తో భేటీ కావాలని కిమ్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని చుంగ్ చెప్పారు. దీనిపై ఆయన్ను అభినందించిన ట్రంప్ తాను కూడా మే నెలలో కిమ్‌తో భేటీ అవుతానని, కొరియా ద్వీపకల్పంలో శాశ్వత అణు నిరాయుధీకరణకు కృషి చేస్తామన్నారని ఆయన వివరించారు. అయితే ట్రంప్-కిమ్‌ల భేటీ ఎక్కడ జరుగుతుందన్న విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ఈ అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని నిర్ణీత ప్రదేశంలోనే ఈ భేటీ జరుగుతుందని వైట్‌హౌస్ వర్గాలు వివరించాయి

అవిశ్వాసంలో కలిసిరండి

బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేకహోదాపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంపై తాము పెట్టనున్న అవిశ్వాస తీర్మానంలో కలిసి రావాలని వైసిపి నేత బొత్స సత్యనారాయణ టిడిపికి సవాల్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రోజుకో రకంగా మాట్లాడుతూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో హోదా కంటే ప్యాకేజీ గొప్పదని చెప్పారని, ఇప్పుడు ప్రజల సెంటిమెంటు అంటున్నారని, అసలు హోదాపై ఆయన వైఖరేంటో అర్థం కావడం లేదని అన్నారు. అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పటి నుంచి ముఖ్యమంత్రి అనుసరిస్తున్న విధానాలు సరిగా లేవని అన్నారు.

చిన్న పరిశ్రమలపై చిన్న చూపే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరిశ్రమల రంగంలో అత్యంత ప్రధాన్యత కలిగిన చిన్న పరిశ్రమలపై రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం చిన్న చూపే చూపింది. బడ్జెట్‌లో గ్రామీణ, చిన్న పరిశ్రమలకు గతేడాది రూ.293 కోట్లు కేటాయించగా ఈ ఏడాది ఆ మొత్తాన్ని కాస్త రూ.216 కోట్లకు తగ్గించేశారు. అందులోనూ ఎంఎస్‌ఎంఇల ప్రోత్సహకానికి రూ.50 కోట్లు మాత్రమే కేటాయించారు. చిన్న పరిశ్రమలకు అందించే రుణాల కోసం గతేడాది రూ.36 కోట్లు కేటాయించగా ఈ ఏడాది కేవలం రూ.10 కోట్లు మాత్రమే విదిల్చారు. ఈ ఏడాది కొత్తగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల రాయితీల కోసం రూ.300 కోట్లు కేటాయించారు. ఆక్వా పరిశ్రమలకు కేవలం రూ.45 కోట్లతో సరిపెట్టేశారు. పారిశ్రామిక కారిడార్ల కోసం గతేడాది రూ.374 కోట్లు కేటాయిస్తే ఏడు ఏకంగా రూ.1173 కోట్లు కేటాయించారు. చేనేత పరిశ్రమలకు రూ.362 కోట్లు చక్కెర పరిశ్రమల కోసం రూ.5.70 కోట్లు కేటాయించారు. మొత్తంగా పరిశ్రమల శాఖకు గతేడాది రూ.2085 కోట్లు కేటాయించగా ఆ మొత్తాన్ని పెంచి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.3074 కోట్లు కేటాయించారు.


చిరంజీవి

బ్రహ్మానందానికి 'హాస్య నట బ్రహ్మ' బిరుదు

సినిమా రంగంలో నటుడిగా 40 ఏళ్ళ అనుభవం ఉన్న అలీ, 33 ఏళ్ళ అనుభమున్న నేను 'ఎ,బి'గా ఆప్యాయంగా పిలుచుకునేలా మా పేర్లుంటాయనీ బ్రహ్మానందం అన్నారు. బావా! అంటూ అంతే ఆప్యాయతగా పిలిచే వ్యక్తి గుండు హనుమంతరావు అని చెప్పారు. 33 ఏళ్ళలో 1100 చిత్రాల్లో హాస్య నటుడిగా మెప్పించిన బ్రహ్మానందానికి 'హాస్యనట బ్రహ్మ' అనే బిరుదును కాకతీయ కళావైభవ మహోత్సవంలో భాగంగా టి.సుబ్బిరామిరెడ్డి ప్రదానం చేయనున్నారు. ఈనెల 11న మహబూబ్‌నగర్‌లో ఈ వేడుక నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ 'కళలకు ఎల్లలు లేవు. కళల్లో ఈశ్వరత్వం ఉంటుంది. అలాంటి ఈశ్వరుడ్ని పూజించే సుబ్బరామిరెడ్డి ఈ అవార్డు వేడుకలు నిర్వహిస్తుండటం గొప్ప విషయం. ఆ దేవుడి దయ వల్ల ఎన్నో అవార్డులను స్వీకరించినప్పటికీ.. రేపు నేను తీసుకోబోయే అవార్డు విశిష్టమైందని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు.


అలీ, బ్రహ్మానందం, సుబ్బరామి రెడ్డి

సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ 'కాకతీయ లలిత కళాపరిషత్తు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వైభవంగా అప్పటి కాకతీయుల ఖ్యాతిని తెలియజేయాలనే ఉద్దేశంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. చలన చిత్ర పరిశ్రమకు చెందిన జయప్రద, డా.రాజశేఖర్, జీవిత, బాబూమోహన్, పరుచూరి గోపాలకృష్ణ, అలీ, కవిత, కేథరిన్ థ్రెసా, హంసానందిని, శ్రద్ధాదాస్, పృథ్వీ, రఘుబాబు, శ్రీనివాసరెడ్డి తదితరులను కాకతీయ పురస్కారాలతో సత్కరిస్తాం. మహబూబ్ నగర్‌కు చెందిన సాహిత్య, సంగీత, నృత్య కళాకారులు ఎల్లూరి శివారెడ్డి, కపిలవాయి లింగమూర్తి, గోరేటి వెంకన్న, చిక్కా హరీశ్, జంగిరెడ్డి, పద్మాలయా ఆచార్య, వంగీశ్వర నీరజ తదితరులను కాకతీయ అవార్డుతో సత్కరిస్తాం' అని తెలిపారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 'బ్రహ్మానందం తెలుగు రాష్ట్రాల్లో మరచిపోలేని గొప్ప నటుడు. కళాకారులకు, కవులకు, నటులకు కుల, మత, ప్రాంతీయ బేధాలుండవు. కని వినీ ఎరుగని రీతిలో ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేస్తాం' అని అన్నారు.


వెంకటేష్

వెంకీ ఆట మొదలెట్టేశారు

వెంకటేష్, తేజ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. దానికి 'ఆట నాదే వేట నాదే' టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. శ్రియ కథానాయికగా నటించే అవకాశం ఉంది. ఈ చిత్రం షూటింగ్ ఈనెల 12వ తేదీన ప్రారంభం కానుంది. దీనిలో భాగంగా ఆ చిత్రం ఫస్ట్‌లుక్ కోసం చేసిన ఫొటో షూట్‌లో పిక్ ఒకటి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తుంది. కళ్లజోడు పెట్టుకుని ఒక చేతిలో బ్యాగ్, మరో చేతిలో పుస్తకాలు పట్టుకుని పరుగెడుతున్న వెంకటేష్ ఫొటో అది. ఇందులో వెంకీ లెక్చరర్‌గా కనిపించనున్నాడు. దానికి తగ్గట్టే ఈ స్టిల్ ఉంది. శ్రియ ఇద్దరు పిల్లలు తల్లి పాత్రలో చేస్తున్నట్టు సమాచారం.

చైనాలో సైరా!

చిరంజీవి టైటిల్ పాత్ర పోషిస్తున్న 'సైరా నరసింహారెడ్డి' చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు రామ్ చరణ్. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితాధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇందులో చిరంజీవికి అమితాబ్ గురువుగా కనిపించబోతున్నారు. నయన తార కథానాయిక. విజయ్ సేతుపతి, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని సన్నివేశాలను చైనాలో చిత్రీకరిస్తున్నారు. చైనాలో విడుదల చేసే ఉద్దేశం కూడా ఉండడంతో అక్కడ షూట్ చేస్తే బాగుంటుందని భావించిందీ చిత్రబృందం. అందుకే అక్కడ చిత్రీకరిస్తోంది. 'బాహుబలి,' 'దంగల్', 'సీక్రెట్ సూపర్‌స్టార్', 'బజరంగీ భాయిజాన్' వంటి భారతీయ చిత్రాలకు చైనాలో ఆదరణ లభించింది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిత్రాన్ని అక్కడ విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. చైనా తర్వాత కొత్త షెడ్యూల్ కరళలోని కొచ్చిలో జరగనుంది. కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ బ్యానర్‌పై 200 కోట్ల బడ్జెట్‌తో సినిమా తెరకెక్కిస్తున్నారు.


'ధడక్' షూటింగ్‌లో జాన్వి

షూటింగ్‌కు శ్రీదేవి తనయ

శ్రీదేవి అకాలమరణంతో శోకంలో ఉన్న జాన్వి శుక్రవారం నుంచి షూటింగ్‌కు హాజరయ్యారు. సాహిద్ కపూర్ సోదరుడు ఇషాన్ ఖత్తర్, జాన్వి హీరో హీరోయిన్లుగా 'ధడక్' చిత్రం రూపొందుతోంది. శశాంక్ ఖైతాన్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. శ్రీదేవి మరణం తర్వాత ఈ చిత్రం షూటింగ్ పూర్తి నిలిచిపోతుందని, జాన్వి చిత్రీకరణకు వచ్చే అవకాశం లేదని వార్తలు ప్రచారమయ్యాయి. జాన్వి మాత్రం శుక్రవారం బంద్రాలో సినిమా సెట్స్‌లో ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్య పరిచారు. ఈ సందర్భంగా షూటింగ్‌లో పాల్గొన్న ఫొటోలో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నారు. ఈ ఫొటోలను చూసి అచ్చం శ్రీదేవిలా ఉందని నెటిజన్స్ కామెంట్స్ పెడుతున్నారు. మరో రెండు రోజులు పాటు బంద్రాలోనే చిత్రీకరణ జరగనుంది. కొత్త షెడ్యూల్ కలకత్తాలో ఉండనుంది.

'ఆఫీసర్' పోరాటం


నాగార్జున, మైరా సరీన్

రామ్ గోపాల్ వర్మ, నాగార్జున కాంబినేషన్‌లో 'ఆఫీసర్' చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసింది. ప్రస్తుతం ముంబాయిలో చిత్రీకరణ జరుగుతోంది. మే 25న విడుదల కానున్న ఈ చిత్రంలోని మరో లుక్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసింది. కథానాయిక మైరా సరీన్, నాగార్జున ఎవరిపైనో గన్స్‌తో కాల్చే సమయంలో తీసిన ఫొటోలుగా ఉన్నాయి. మాఫియా గ్యాంగ్‌కు ఓ పోలీస్ ఆఫీసర్‌కు మధ్య జరిగే పోరాటమే ఈ చిత్రం.

ట్రెండ్‌కు తగ్గ సినిమాలకు ఆదరణ


'ఐతే 2.ఓ' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేస్తున్న తలసాని శ్రీనివాస యాదవ్

ఇంద్రనీల్ సేన్‌గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మణాల్, మదాంజలి కీలక పాత్రధారులుగా రాజ్ మాదిరాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఐతే 2.ఓ'. ఫర్మ్ 9 పతాకంపై కె.విజయరామారాజు, హేమంత్ వల్లపురెడ్డి నిర్మిస్తున్నారు. ఈనెల 16న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'పెరిగిన టెక్నాలజీతో ఎలా సైబర్ క్రైమ్ చేస్తున్నారనే విషయాలను గమనిస్తూనే ఉన్నాం. దీన్ని ఓ సందేశంగా చూపిస్తూ 'ఐతే 2.0'ను రూపొందించారు. మెసేజ్‌తో పాటు ఇప్పటి ట్రెండ్‌కు తగ్గ సినిమాలను ప్రేక్షకులు చక్కగా ఆదరిస్తున్నారు' అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరా : కౌశిక్ అభిమన్యు, ఎడిటింగ్ : కార్తీక్ పల్లె, ఆర్ట్ డైరెక్టర్ : రాజీవ్ నాయర్, మాటలు, పాటలు : కిట్టు విస్సాప్రగడ, సంగీతం : అరుణ్ చిలువేరు.

నెల్లూరి పెద్దారెడ్డి


సతీష్ రెడ్డి, మౌర్యానీ

సతీష్ రెడ్డి, మౌర్యానీ, ముంతాజ్ హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి' దర్శకుడు వీజే రెడ్డి తెరకెక్కించారు. సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై సీహెచ్ రఘునాథ రెడ్డి నిర్మించారు. ప్రభాస్ శీను, అంబటి శీను, సమ్మెట గాంధీ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఆహ్లాదకరమైన ప్రేమ కథగా ఈ సినిమా తెరకెక్కింది. ఈ చిత్ర నేపథ్యం భావోద్వేగాలతో ఉన్నా కథనం ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

ఈ సందర్భంగా దర్శకుడు వీజే రెడ్డి మాట్లాడుతూ 'దాదాపు వంద థియేటర్లలో విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాం. నలుగురికి మంచి చేసే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. ఈ క్రమంలో అతనికి అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. వాటి పర్యవసానంగా కథ ఎలాంటి మలుపులు తిరిగింది అనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. చింతామణి నాటక రిహార్సల్స్ సన్నివేశాలు ప్రత్యేకంగా రూపొందించాం' అని అన్నారు.

బంద్‌తో ఏం సాధించారు

- తమిళం, మలయాళం, కన్నడ చిత్ర పరిశ్రమలో బంద్ కొనసాగుతుంటే ఇక్కడెందుకు నిలిపేశారు
- ప్రశ్నించిన ఆర్.నారాయణ మూర్తి



చిత్ర పరిశ్రమలో బంద్ అనేది బ్రహ్మాస్త్రం లాంటిది. అలాంటి బ్రహ్మాస్త్రాన్ని ఉపయోగించి తెలుగు ఫిలిం చాంబర్ వారు ఏం సాధించారో అర్థం కావడంలేదు. కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేదు 'అంటూ తెలుగు ఫిలిం ఛాంబర్‌పై విరుచుకుపడ్డారు ఆర్.నారాయణమూర్తి. డిజిటల్ సర్వీస్ రేట్లు తగ్గించాలంటూ దక్షిణాది చిత్రసీమ అంతా ఒక తాటిమీదకొచ్చి మార్చి రెండో తేదీ నుండి థియేటర్స్ బంద్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వారు, తెలుగు ఫిలిం చాంబర్ వారు సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం ఈ శుక్రవారం నుండి థియేటర్స్ బంద్‌ని విరమింపజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్, ఆర్.నారాయణమూర్తి ఫిలించాంబర్‌లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు.


నారాయణమూర్తి మాట్లాడుతూ "తమిళం, మలయాళం, కన్నడ భాషల చిత్ర పరిశ్రమల్లో ఇంకా థియేటర్స్ బంద్ కొనసాగుతుంటే తెలుగు ఫిలించాంబర్ అప్పుడే థియేటర్స్ బంద్‌ను ఎందుకు ఆపాల్సి వచ్చింది. ఐదేళ్ల తర్వాత ఫ్రీగా ఇస్తామంటూ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఇచ్చిన హామీలు అమలు కాకముందే ఎందుకు హఠాత్తుగా బంద్ విరమించుకున్నారు. ఈ బంద్ వల్ల సినీ కార్మికులు ఇబ్బంది పడ్డారు తప్ప ఒరిగిందేమీ లేదు. అయినా నిర్మాతలకు మంచి జరుగుతుందనే ఉద్దేశంతో అందరూ సహకరించారు. కానీ ఇలా మీ ప్రయోజనాల కోసం, మీ స్వార్థం కోసం బంద్‌ని హఠాత్తుగా ఆపేస్తారా? ఈ బంద్ వల్ల సాధించిందేమిటి? దీని కోసమైతే సురేష్ బాబు, జెమిని కిరణ్ , అల్లు అరవింద్ లాంటి పెద్దలు బంద్ వరకు వెళ్లకుండా ముందే మాట్లాడి సెటిల్ చేస్తే సరిపోయేది కదా? థియేటర్స్ బంద్ దాకా వెళ్లాల్సిన పనేంటి? గతంలో డా.రామానాయుడు, దాసరి నారాయణ వంటి పెద్దలు పదిమంది నిర్మాతల మంచి కోరేవారు తప్ప ఎప్పుడూ తామే బతకాలనీ, తమ స్వార్థం కోసం ఆలోచించలేదు. గతంలో కూడా లీజులు, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ మీద మేం ఎన్నో పోరాటాలు, నిరహార దీక్షలు చేశాం. కానీ ఐక్యత లేక విజయం సాధించలేకపోయాం. ఇప్పుడు కూడా సక్సెస్ కాలేకపోయాం. దీనికి కారణం మేజర్ సెక్టార్ వాళ్ల సపోర్ట్ లేకపోవడం వల్ల. తెలుగు రాష్ట్రాల సినిమాటోగ్రఫీ మంత్రులు ఈ విషయంలో కలగజేసుకుని చిన్న చిత్రాల నిర్మాతలకు న్యాయం చేయాలని కోరుకుంటున్నా. రెండు వేలు , రెండువేల ఐదువందలకు డిజిటల్ సర్వీస్‌లు ప్రొవైడ్ చేస్తామంటూ నూతన కంపెనీలు వస్తున్నా... వారిని ఎందుకు రానీయడం లేదు. కొత్త వారికి అవకాశం ఇస్తే కచ్చితంగా క్యూబ్, యుఎఫ్ ఓ వాళ్లు దిగిరాక మానరు. ఈ విషయంలో ఇకనైనా ప్రభుత్వం జోక్యం చేసుకోని ప్రతి ఒక్కరికీ మంచి జరిగేలా చూడాలని కోరుకుంటున్నాం' అని కోరారు.

చల్ చల్ గుర్రం...


రవి శంకర్

'రాజరథం' నుండి 'చల్ చల్ గుర్రం ...అనే పల్లవితో సాగే మూడో గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. ప్రముఖ నటుడు రవి శంకర్ మొట్ట మొదటిసారి తాను పోషిస్తున్న పాత్ర కోసం ఈ పాట పాడారు. మహాబలేశ్వర్, పూణేలోని మాల్షెజ్ ఘాట్ వంటి అందమైన ప్రదేశాలలో కనువిందుగా చిత్రీకరించారు. దర్శకుడు అనూప్ భండారి సహజమైన మంచు కోసం మాల్షెజ్ ఘాట్‌ని ఎంచుకున్నట్టు కనిపిస్తుంది. ఒకోసారి మంచు తీవ్రత తగ్గేవరకూ ఆగి షూటింగ్ చేసుకోవాల్సి వచ్చేదని గతంలో చిత్రబృందం తెలిపింది. అది ఆ మాటలు ఈ పాటకు దర్పణం పడుతున్నాయి. ఈ సినిమా కోసం దిలీప్ రాజ్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన పాతకాలపు సైడ్ కార్ ఉండే స్కూటర్ ఈ పాటకి అదనపు ఆకర్షణ. ఈ స్కూటర్ మనల్ని పాత జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లడం ఖాయం. ఇప్పటి వరకు విడుదలైన రెండు పాటల ట్యూన్లతో సరిపోయేలా ఉండే ఈ 'చల్ చల్ గుర్రం' సాహిత్యంలో చాలా అరుదైన తెలుగు పదాలని సినిమా కథకి సరిపోయేలా ఉపయోగించారని నిర్మాతలు తెలిపారు. రామజోగయ్య శాస్త్రి పదాల అల్లిక, అనూప్ భండారి స్వరపరిచిన బాణీ వలన ఈ పాట వీనుల విందుగా ఉంటూ సాహిత్య పరంగా ప్రత్యేకతని చాటుకుంది. ఈ చిత్రం ఈనెల 23న విడుదల కానుంది.

అఖిల్ మూడో చిత్రం



అఖిల్ అక్కినేని మూడో చిత్రం చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. 'తొలిప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఈయన సినిమా ఉండబోతుంది. ఈ డైరెక్టర్ కంటే ముందే చాలా మంది దర్శకులతో తన మూడో సినిమా కోసం చర్చలు జరిపారు గానీ వాళ్లు చెప్పిన కథలు అంతా నచ్చలేదు. దీంతో అట్లూరి కథకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ చిత్రం హాస్యభరితంగా తీయబోతున్నట్టు తెలిసింది. త్వరలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లబోతుంది. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించబోతున్నారు.

జర్నీ



ఉత్తర భారతం విహారానికి సిద్ధం

వాతావరణంలో మార్పులు మొదలయ్యాయి. వేడి పెరిగిపోతోంది. ప్రశాంతమైన చల్లని వాతావరణం కోసం అన్వేషించాల్సిన సమయం వచ్చేసింది. అలాంటి ప్రశాంతతతోపాటు చారిత్రక ప్రదేశాలకు చిరునామాగా నిలుస్తోంది ఉత్తర భారతదేశం. అక్కడి ప్రయాణంలో ప్రతి అడుగూ జీవితంలో మర్చిపోలేని ఎన్నో అనుభూతులను చేరువ చేస్తుంది. వాటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గ ప్రాంతం జమ్మూ-కాశ్మీర్. కాలుష్యంలేని స్వచ్ఛమైన గాలి అక్కడి సొంతం. అలాగే, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా ప్రాంతాలలోనూ పర్యాటక ప్రాంతాలకు కొదవలేదు. ఈ ప్రదేశాలన్నీ వేసవిలో విహారాలకు అనుకూలమైనవి. ఆ ప్రాంతాల సౌందర్యాన్ని, విశిష్టతను, సంస్కృతిని, సంప్రదాయాలను ఈ వారం 'జర్నీ'లో చూసొద్దాం..!!

జమ్మూ-కాశ్మీర్‌లోని అవంతీపూర్ ప్రసిద్ధ పర్యాటక కేంద్రం. శివ అవంతీశ్వర, అవంతీస్వామి విష్ణు పేరులో రెండు పురాతన ఆలయాలు ఇక్కడ ఉన్నాయి. వీటిని 9వ శతాబ్దంలో రాజా అవంతివర్మ నిర్మించాడు. ఈ దేవాలయ నిర్మాణంలో అనుసరించిన శిల్ప శైలి, గ్రీకుల శిల్ప శైలిని పోలి ఉంటుంది. ఇవి ప్రస్తుతం శిథిలావస్థలో దర్శనమిస్తాయి. అలాగే, జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రంలో బారాముల్లా మరో గుర్తింపు పొందిన పర్యాటక కేంద్రం. ఇది పురాతన నగరం. క్రీస్తుపూర్వం భీంసేన రాజా దీనిని నిర్మించారని చెబుతారు. ఈ ప్రదేశాన్ని మొఘలు చక్రవర్తి అక్బర్ క్రీస్తుశకం 1508లో దర్శించాడు. కాశ్మీరుకి వెళుతూ మార్గంమధ్యలో దాని అందానికి ముగ్ధుడైన జహంగీరు ఇక్కడే కొంతకాలం నివసించాలని నిర్ణయించుకున్నాడని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అలాగే, సుప్రసిద్ధ చైనా యాత్రీకుడు హ్యూయాన్ త్సాంగ్ కూడా ఒకసారి బారాముల్లాను సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది.


ధార్చుల ప్రకృతి అందాలు

ధార్చుల ఉత్తరాఖండ్‌లో పిథౌరగఢ్ జిల్లాలో ఇండో-నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఒక అందమైన పట్టణం. ఈ పట్టణం పేరు "ధార్", "చుల" అనే రెండు మాటలతో ఏర్పడింది. "ధార్" అంటే శిఖరం, "చుల" అంటే స్టవ్ అని హిందీలో అర్థం. ఈ హిల్ పట్టణం స్టవ్ ఆకారంలో ఉండడం వల్ల దీనికి ఈ పేరు వచ్చింది. ఈ పట్టణంలో మానస సరోవర్, మానస సరస్సులాంటి ప్రదేశాలు ప్రముఖ పర్యాటక ఆకర్షణలుగా నిలుస్తాయి. ఈ సరస్సు హిందూ, బౌద్ధమతాలలో గొప్ప ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. పర్యాటకులు ధార్చులను సందర్శించటానికి వచ్చినప్పుడు, సమీపంలో ఉన్న ఓం పర్వతం, ఆది కైలాష్, భారత్-నేపాల్, భారత్-చైనా సరిహద్దు, నారాయణ్ ఆశ్రమం మొదలైన వాటినీ సందర్శించవచ్చు.




చంబ

చంబ ప్రాంతమూ ఒక అందమైన హిల్ స్టేషన్. ఇది ఉత్తరాఖండ్ లోని తెహ్రి గర్వాల్ జిల్లాలో ఉంది. ఇది సముద్ర మట్టానికి సుమారు 1524 మీటర్ల ఎత్తులో ఉంది. అందమైన దృశ్యాలకు, నిర్మల వాతావరణానికి చిరునామాగా ఈ ప్రదేశం పేరు పొందింది. చంబా ప్రాంతం దేవదారు, పైన్ చెట్లతో నిండి, ప్రకృతి ప్రియులకు ఒక స్వప్న ప్రపంచంలా ఉంటుంది. ఈ హిల్‌స్టేషన్‌లో ఆపిల్, అప్రికాట్ తోటలు అధికం. తెహ్రి డ్యామ్ పర్యటనకు వెళ్లేవారికి చంబ హిల్ స్టేషన్ ఒక పూట బసకు అనుకూలంగా ఉంటుంది.



అర్కి

అర్కి హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్ జిల్లాలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం. అక్కడున్న చారిత్రక నిర్మాణాలు పర్యాటకులను ఇట్టే ఆకర్షిస్తాయి. అర్కి కోట, అర్కి ప్యాలెస్ వంటి చారిత్రక కట్టడాలు చూస్తే మనస్సుకు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. అక్కడున్న అద్భుత కళాఖండాలు సందర్శకుల హృదయాలను కట్టిపడేస్తాయి. అక్కడికి దగ్గరలోనే పురాతన ఆలయాలు దర్శనమిస్తాయి. వాటిలో లుటూరు మహాదేవ ఆలయం, దుర్గ ఆలయం, శకుని మహాదేవ ఆలయం ప్రధానమైనవి. దుర్గ ఆలయం నిర్మాణం శిఖరం తీరులో ఉండగా, శకుని మహాదేవ ఆలయం అత్యంత ఎత్తులో ఉంటుంది.



లుధియానా

సట్లెజ్ నది ఒడ్డున ఉన్న లుధియానా పంజాబ్‌లోని అతిపెద్ద నగరం. రాష్ట్రం నడిబొడ్డున ఉన్న ఈ నగరం కొత్త నగరం, పాత నగరంగా విభజించబడింది. లోధి వంశం పేరు మీద ఈ నగరం 1480లో స్థాపించబడింది. లుధియానాలో ఉండే స్థానికులు మర్యాదలకు మారుపేరుగా నిలుస్తారు. ఈ నగరం సందర్శకులకు వినోదాన్ని అందించే అనేక పర్యాటక ఆకర్షణలకు నిలయం. గురుద్వారా మంజీ సాహిబ్, గురునానక్ భవన్, ఫిల్లార్ ఫోర్ట్, మహారాజా రంజిత్‌సింగ్ యుద్ధ మ్యూజియం, గురునానక్ స్టేడియం, రాఖ్ బాగ్ పార్కు వంటి అనేక ప్రాంతాలు లుధియానాలో పర్యటకం కోణంలో ప్రసిద్ధమైనవి.



బితూర్

కాన్పూర్ నుంచి 22 కిలోమీటర్ల దూరంలో గంగా నది ఒడ్డున సుందర ప్రకృతి దృశ్యాల పట్టణమే బితూర్. సహజసిద్ధ అందాలతో ఎంతో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించే ప్రదేశమేకాక, విశ్రాంతికి అనువైనదిగానూ బితూర్ ప్రసిద్ధి చెందింది. ఒక ప్రధాన హిందూ తీర్థయాత్రా కేంద్రంగానూ.. గొప్ప చారిత్రక ప్రదేశంగానూ గుర్తింపు పొందింది. ఇక్కడి ఆలయాల ప్రశాంత పరిసరాల్లో తిరుగుతూ, నదిలో బోటు షికారు చేస్తూ ప్రకృతిలోని అందాలన్నీ ఆస్వాదించవచ్చు.



అల్మోర

అల్మోర కుమావ్ ప్రాంతంలో ప్రసిద్ధ హిల్‌స్టేషన్. పర్యాటకులు మంచుతో నిండిన హిమాలయ శిఖరాలను అల్మోర కొండల నుంచి వీక్షించి, ఆనందించవచ్చు. ఈ ప్రదేశం ఏటా ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇక్కడ అందమైన సూర్యోదయ, సూర్యాస్తమయ దృశ్యాలు ఎంతో రంజింపచేస్తాయి. సిమ్టోల, మర్టోల అనే ప్రదేశాలు పర్యాటక విడిదికి అనుకూలమైనవి. అల్మోర పట్టణం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో గల జింకల పార్క్ ప్రసిద్ధి చెందింది. దీనిలో అనేక లేళ్లు, చిరుతలు, హిమాలయ ఎలుగుబంట్లు చూడవచ్చు. ఈ ప్రదేశంలోని గోవింద్ వల్లభపంత్ మ్యూజియం, బిన్సార్ వన్యమృగ సంరక్షణ కేంద్రం తప్పక చూడాల్సినవి. ఇక్కడకు వచ్చే పర్యాటకులు ట్రెక్కింగ్, మౌంటెన్ బైకింగ్ ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయి.



సేకరణ : చందు

శిఖరాగ్రాన రెయిన్‌బో రంగులు



వరుస సెలవు దినాలు వస్తే చాలు ఎక్కడికి వెళ్దాం? ఏ ప్రదేశాన్ని చుట్టేద్దాం అంటూ ఆలోచిస్తారు పర్యాటకప్రియులు. ఏ పర్యాటక ప్రదేశానికి వెళ్లి సేద తీరుదామా అని.. నెట్టింట్లోకి వెళ్లి మరీ వెతికేస్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా తప్పక చూడాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. అలాంటి ఆసక్తికర ప్రదేశాలలో అందాలతో కనువిందు చేస్తూ ఆశ్చర్యపరిచేవి రైన్ బో రంగుల కొండలు. ఎందుకంటే, విహారానికి వెళ్లేప్పుడు కంటికి కనిపించే ప్రతి దృశ్యం వినూత్నంగానే కనిపిస్తుంది. చుట్టూ ఉన్న ప్రకృతి అందాలు ఎన్నో సొబగులతో మనల్ని మురిపిస్తాయి. కొండలు, గుట్టలు, లోయలు, నదులు, చెట్లు, కొమ్మలు, ఆకులు, పూలు ఇలా ప్రతి దృశ్యమూ ఆకట్టుకునేదే! ప్రకృతిసిద్ధమైన దృశ్యాలను చూసేందుకు ప్రతి ఒక్కరి మనసూ ఉవ్విళ్లూరుతుంది. నిజానికి ఈ రైన్‌బో కొండలు చైనా, పెరు, కెనడా ప్రపంచంలో ఈ మూడుచోట్ల మాత్రమే ఉన్నాయి. అందులో చైనా, పెరు దేశాలలో ఉన్న కొండలు ప్రసిద్ధి చెందాయి. ఆకాశాన్ని అంటే శిఖారాలు వివిధ రంగులలో దర్శనమిస్తూ సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతాయి. వినూత్న రంగుల తివాచీలా కనిపించే ఇక్కడి ప్రకృతిసహజమైన అందాలు.. పర్యాటకుల కెమేరాలకు పనిచెప్పక మానవు. అందుకే విహారాల జాబితాలో ఈ రైన్‌బో కొండలకు ప్రత్యేక స్థానం లభించింది. ★



'జర్నీ'కి ఆహ్వానం



మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.

మా చిరునామా

జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చిన్నారి



మేమెవరం?


మేమొకరం పోతే
ఒకరం పనికిరాం..
కాళ్ళకు సేవ చేస్తాం..
కొందరికి ఉపాధినిస్తాం..

జవాబు : చెప్పులు

జోక్:

టీచర్ : బంటీ! రైలు ప్రమాదాలను ఎలా తగ్గించ వచ్చో చెప్పు?
బంటి : రైలు పట్టాలపై 'speed breakers' పెడితే సరి. ఇక ప్రమాదాలే జరగవు టీచర్!

చుక్కలు కలపండి!




పిల్లలూ..! పైనున్న చిత్రంలోని చుక్కలను కలిపి, రంగులు వేయండి!

గాల్లోనే జీవించే పక్షులు




పిల్లలూ..! మనం గాలిలో ఎగిరే పక్షులను తరచూ చూస్తూనే ఉంటాం. అయితే అవి కొంతసేపు గాలిలో ఎగిరి, మరి కొంతసేపు విశ్రాంతి తీసుకుంటాయి. ఇది మనకు పక్షుల గురించి తెలిసిన విషయం. కానీ ఒక జాతి పక్షులు గాలిలోనే సుమారు ఆరునెలలు ఎగురుతాయట! అవే స్విఫ్ట్ పక్షులు. అవి వాటి జీవిత కాలంలో ఎక్కువభాగం గాలిలోనే ఎగురుతాయని చాలామంది చెబుతుంటారు. కానీ ఇది నిజం అని ఇప్పటి వరకూ ఎవరూ నిరూపించలేకపోయారు. ప్రస్తుతం ఒక అధ్యయనం ఇందులో కొంత నిజం ఉందని సూచించింది. ఆల్పైన్ స్విఫ్ట్‌లు వరుసగా ఆరునెలలు గాలిలోనే గడుపుతాయనీ.. యూరప్‌లో తమ ప్రత్యుత్పత్తి కాలం ముగిసిన తర్వాత ఉత్తర అమెరికాకు వలస వస్తాయనీ.. తర్వాత ఏ మాత్రం విశ్రాంతి తీసుకోకుండా గాలిలోనే గడుపుతాయనీ తేలింది. ఇంతవరకూ అటువంటి దీర్ఘకాలిక గమన (చలన)ం సముద్రంలో జీవిస్తున్న జంతువులకు మాత్రమే ఉన్నాయని గమనించినట్లుగా.. సెంపేంచ్‌లోని స్విస్ ఆర్నిథోలోజికల్ సంస్థ ఫెలిక్స్ లీచ్‌టీ పేర్కొన్నారు. లీచ్‌టీ తన సహచరులు మూడు ఆల్పైన్ పక్షులకు 1.5 గ్రాముల డేటా లాగర్లను అమర్చిన తర్వాత సంవత్సరంలోగా వాటిని పట్టుకున్నారు. ఆ మూడు పక్షుల మీద జరిపిన పరిశోధనల్లో కొంతవరకు ఇది నిజం అని తేలింది. ★





నేను గీసిన బొమ్మ





గొర్లా దివ్యా,
6వ తరగతి, శ్రీఆదర్శ హైస్కూల్, తిమ్మాపురం,
ఎస్. రాయవరం, విశాఖపట్నం.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



మహిళా హాకీ జట్టు విజయం

సియోల్ : దక్షిణకొరియా పర్యటనలో ఉన్న భారత మహిళా హాకీ జట్టుకు ఆతిథ్య జట్టుపై మరో విజయం లభించింది. శుక్రవారం సఫారీ జట్టుతో నాల్గో మ్యాచ్‌లో తలపడి 3-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 3-1తో ఆధిక్యతలో భారత హాకీజట్టు నిలిచింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. దక్షిణకిరియాలోని జించున్ నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా మహిళా జట్టు ఆద్యంతం కొరియాపై ఆధిక్యతను ప్రదర్శించింది. భారత్ తరపున గుర్జీత్ కౌర్ ఆట ప్రారంభమైన రెండో నిమిషంలోనే గోల్ చేసి 1-0 ఆధిక్యతలో నిలిపింది. దీపిక 14వ నిమిషంలో మరో గోల్స్ చేసి తొలి క్వార్టర్‌లోనే ఆతిథ్య జట్టుపై 2-0 ఆధిక్యతను సంపాదించిపెట్టారు. నాల్గో క్వార్టర్‌పై పూనమ్ రాణి 47వ నిమిషంలో ఫీల్డ్ గోల్స్ సాధించి భారత్‌కు తిరుగులేని 3-0 గోల్స్ సాధించి పెట్టారు.

భారత్ చేజేతులా...



- అజ్లాన్‌షా హాకీలో ఐర్లాండ్ చేతిలో పరాజయం

కౌలాలంపూర్ : 27వ అజ్లాన్‌షా హాకీ టోర్నీలో భారత హాకీజట్టు బలహీన ఐర్లాండ్ చేతిలో ఓటమిపాలైంది. శుక్రవారం ఐర్లాండ్‌తో తలపడిన 2-3 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. తొలి రెండు క్వార్టర్లు ముగిసే సరికి 2-1 ఆధిక్యతలో నిలిచినప్పటికీ మూడో క్వార్టర్‌లో ప్రత్యర్థి జట్టుకు రెండు గోల్స్ సమర్పించుకొని 2-3 ఆధిక్యతలో ఐరిష్ జట్టు నిలిచింది. ఈ పరాజయంతో టీమిండియా కాంస్య రేసునుండి కూడా నిష్క్రమి ంచి 4 పాయింట్లతో ఐదోస్థానంలో నిలిచింది.

నేటి తుది మ్యాచ్‌లు...

బంగారు-రజితం : ఆస్ట్రేలియా × ఇంగ్లండ్
కాంస్య పతకం : అర్జంటీనా × మలేషియా
5-6 స్థానాలకు : భారత్ × ఐర్లాండ్

అంజుమ్ మోద్గిల్‌కు రజితం



మెక్సికో : ప్రపంచకప్ షూటింగ్‌లో మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్ విభాగంలో భారత్‌కు మరో పతకం లభించింది. శుక్రవారం జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ సీనియర్ ప్రపంచకప్ టోర్నీలో భారత క్రీడాకారిణి అంజుమ్ మోద్గిల్ 454.2 పాయింట్లు సాధించి రజత పతకాన్ని దక్కించుకుంది. చైనాకు చెందిన రుజియో (455.4) స్వర్ణం గెలవగా ఇదే దేశానికి చెందిన టింగ్ సున్ (442.2) కాంస్యంతో సరిపెట్టుకుంది.



శీతాకాల పారా ఒలింపిక్స్ ప్రారంభం

ప్యాంగ్‌చంగ్ (దక్షిణకొరియా) : దక్షిణ కొరియాలోని ప్యాంగ్‌చంగ్‌లో శీతాకాల పారా (విభిన్న ప్రతిభావంతులు) ఒలింపిక్స్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 18 వరకు జరిగే ఈ పోటీల్లో 48 దేశాల నుండి 570 మంది వికలాంగ క్రీడాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించనున్నారు. వివిధ విభాగాల్లో విజయం సాధించిన అథ్లెట్లకు 80 పతకాలు బహూకరించనున్నారు. ఒక్క స్కీయింగ్ విభాగానికే 30 బంగారు పతకాలు లభించనున్నాయి.

షమీపై నాన్‌బెయిలబుల్ కేసు



కోల్‌కత్తా : టీమిండియా పేసర్ మహమ్మద్ షమీ (27) చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. శుక్రవారం అతడి భార్య హసీన్ జహాన్ ఫిర్యాదు మేరకు కలకత్తా పోలీసులు షమీ, అతడి సోదరుడిపై రేప్, గృహహింస, హత్యాయత్నం కేసులను నమోదు చేశారు. తనపై గృహహింసకు పాల్పడుతున్నాడని షమి భార్య ఇటీవల న్యాయవాదితో కలిసి కోల్‌కతా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడు షమితో పాటు మరో నలుగురిపై ఐపీసీ 498ఏ, 323, 307, 376, 506, 328, 34 సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జెఎన్‌టియు క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

జెఎన్‌టియు పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల సెంట్రల్ క్రీడా పోటీలు గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం కంటెపూడి నలంద ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 8 జిల్లాల నుండి 30 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 72 జట్లు, 600 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. తొలిరోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, షటిల్, టేబుల్‌టెన్నీస్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

నేడు బంగ్లాతో లంక ఢీ

కొలంబో : నిదహస్ టీ20 ట్రై సిరీస్‌లో భాగంగా నేడు శ్రీలంక జట్టు బంగ్లాదేశ్‌తో తలపడనుంది. లంక జట్టు తొలి మ్యాచ్‌లో టీమిండియాతో తలపడి ఘన విజయం సాధించగా... బంగ్లాదేశ్ తొలి మ్యాచ్ భారత్‌పై ఓటమిపాలైంది. లంక జట్టులో పెరీరా విధ్వంసక ఇన్నింగ్ ఆడి ఆ జట్టును ఒంటిచేత్తో గెలిపించాడు. బంగ్లాదేశ్ సైతం తొలిమ్యాచ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.

అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖకు రూ. 523 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖకు రూ 523.7 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. గతేడాది బడ్జెట్ అంచనాలు 363.6 కోట్లు కాగా సవరించిన అంచనాలు రూ 377.3 కోట్లు. వాటిలో మొక్కలు నాటే కార్యక్రమానికి రూ 17.8 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది పర్యావరణ, అటవీ శాఖకు కొత్త కార్యక్రమాలకు నిధులు కేటాయించింది. వాటిలో నగర వనాలకు రూ 25 కోట్లు, వన సంజీవని కార్యక్రమానికి రూ 75 కోట్లు, జంతు ప్రదర్శన శాలల అభివృద్ధికి రూ 10 కోట్లు, ఎర్ర చందనం పరిరక్షణ, అక్రమ రవాణా నివారణకు రూ 25 కోట్లు, వన విహారి కార్యక్రమానికి రూ 10 కోట్లు కేటాయించింది. అయితే శాస్త్ర సాంకేతిక రంగానికి మాత్రం అతితక్కువగా కేటాయించింది. గతేడాది కేటాయించినట్లే శాస్త్ర పరిశోధనకు కేవలం రూ 8 లక్షలు ఈ బడ్జెట్‌లోనే కేటాయించింది.

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఔట్ సోర్సింగ్ ఆఫీసర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడ కేంద్రంగా పని చేసే ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)కు పది మంది సైంటిఫిక్ ఆఫీసర్లు, మరో పది మంది సైంటిఫిక్ అసిస్టెంట్లను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల అయ్యింది. ఎఫ్ఎస్ఎల్‌కు సైంటిఫిక్ సిబ్బంది కావాలని గతంలోనే డిజిపి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సైంటిఫిక్ ఆఫీసర్‌కు రూ.31,460, అసిస్టెంట్‌కు రూ.28,940 నెల జీతంగా నిర్ణయించారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు ఎపిఎస్‌ఆర్టీసి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనుంది. విద్యార్థులు రాయతీ బస్సు పాసు కలిగి, పదో తరగతి పరీక్ష హాల్ టికెట్ చూపించి వారి నివాస ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రం వరకు వెళ్లే వెసులుబాటు కల్పించనున్నట్లు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఉచిత ప్రయాణం ఈ నెల 15 నుంచి 28 తేదీ వరకు కల్పించనున్నట్లు పేర్కొంది.

ఆర్టీసీని ఆదుకోలేదు

కేటాయింపులు రవాణా మంత్రి హామీకే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర రవాణాకు వెన్నెముకగా ఉన్న ఎపిఎస్ ఆర్టీసిని పూర్తి స్థాయిలో ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. రాష్ట్ర బడ్జెట్‌లో అరకొర నిధులే కేటాయించడం ఇందుకు నిదర్శనం. ఆర్టీసిని ఆదుకునేందుకు బడ్జెట్‌లో రూ.900 కోట్లు కేటాయిస్తామని రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గొప్పగా ప్రకటనలు గుప్పించారు. తీరా బడ్జెట్‌లో చూస్తే కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు రూ.200 కోట్లు, ఆర్టీసి అందిస్తున్న వివిధ రాయితీలను తిరిగి చెల్లించేందు కోసం రూ.290 కోట్లను కేటాయించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసిని ఆదుకునేందుకు కనీసం రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని ఆర్టీసి కార్మిక సంఘాలు డిమాండ్ చేయడంతో రూ.900 కోట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి హామీ ఇచ్చారు. ఈ కేటాయింపులు హామీలకే పరిమితమయ్యాయి.

కేటాయింపులు రూ. కోట్లలో...

విషయం	2017-18 అంచనా	ఖర్చు	2018-19 అంచనా
ఆర్టీసి రాయితీలకు	121	121	290
బస్సుల కొనుగోలుకు	-	-	200
సచివాలయ సేవలకు	-	-	64.70

కార్మికులను విస్మరించారు



ఆర్టీసి కార్మికులను విస్మరించారు. కార్మికుల శ్రేయస్సు కోసం ఒక్క రుపాయి కూడా కేటాయించలేదు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఆర్టీసికి ఏ మాత్రమూ సరిపోవు. ఆదాయానికి, ఖర్చుకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రభుత్వమే భర్తీ చేయాలి. ఆర్టీసి నష్టాన్ని పూడ్చాల్సిన ప్రభుత్వం పట్టించుకోవపోవడం శోచనీయం. కేటాయింపులతో పెద్ద మేలేమీ జరగదు. బస్సుల కోసం కేటాయించిన మొత్తాన్ని గ్రామీణ ప్రాంతాలకు బస్సులను నడిపేందుకు వినియోగించాలి.

- సిహెచ్ సుందరయ్య, ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి

ఆర్థికంగా ఆదుకునేందుకు చాలవు



ఆర్టీసిని ఆర్థికంగా ఆదుకునేందుకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు చాలవు. నష్టాన్ని భర్తీ చేసే ప్రయత్నం కూడా చేయలేదు. కనీసం రూ.వెయ్యి కోట్లు కేటాయించా ల్సింది. గతంలో హామీ ఇచ్చిన డీజిల్‌పై పన్ను రాయితీ ప్రస్తావనా లేదు. వేతన సవరణ కూడా చేయాల్సి ఉంది. ఆర్టీసిని ప్రభుత్వమే ఆదుకోవాలి.

- పలిశెట్టి దామోదర్, అదనపు ప్రధాన కార్యదర్శి, ఆర్టీసి ఇయు

రెవెన్యూ లోటు భర్తీకి కేంద్రం సిద్ధం

- బిజెపి నాయకురాలు పురందేశ్వరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడిన రెవెన్యూ లోటును భర్తీ చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని బిజెపి మహిళా మోర్చా ఇన్‌ఛార్జి దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొన్ని అంశాల్లో కేంద్రంపై దుష్ప్రచారం సాగుతోందని, హోదా ఉన్న, లేని రాష్ట్రాలకు కేటాయింపుల్లో వ్యత్యాసాన్ని తొలగించాలని 14వ ఆర్థిక సంఘం సూచించిందని ఆమె వివరించారు. హోదాతో పారిశ్రామిక పన్ను రాయితీలు, ప్రోత్సహకాలు వస్తాయనుకోవడం పొరపాటేనన్నారు. కొన్ని రాష్ట్రాలకు హోదాను పొడిగించడం వాస్తవం కాదని, ఇప్పటికే ఇస్తున్న పన్ను రాయితీలనే కొన్నేళ్లు కొనసాగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చామన్నారు. ఐదేళ్ల రెవిన్యూ లోటు రూ.22 వేల కోట్లుగా కేంద్రం లెక్కించిందని చెప్పారు. సాధారణంగా 10 నెలలకే రెవిన్యూ లోటు పరిగణలోకి తీసుకుంటారని, రాష్ట్రం విషయంలో 12 నెలలకు లెక్కించడం జరిగిందన్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి రెవిన్యూ లోటు విషయంలో ఏకాభిప్రాయం లేదని, అధికారులు కూర్చొని ఒక నిర్ణయానికి రావాల్సి ఉందన్నారు. పార్టీల మధ్య సత్సంబంధాలు కొనసాగుతున్నాయని, ఎన్డీఎలో టిడిపి కొనసాగుతుందని తెలిపారు. బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు దారా సాంబయ్య, కార్యవర్గ సభ్యులు రామినేని వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్‌ఒ పోస్టుల అభ్యర్థులకు ఎపిపిఎస్‌సి మార్కులు విడుదల

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

సహాయ గణాంకాధికారుల (ఎఎస్‌ఒ) పోస్టులకు నిర్వహించిన పరీక్షలకు సంబంధించి ఎపిపిఎస్‌సి శుక్రవారం మార్కులను విడుదల చేసింది. గతేడాది అక్టోబర్ 13న ఈ పరీక్షను నిర్వహించారు. అభ్యర్థులకు వచ్చిన మార్కుల జాబితాను www.psc.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచిన్నట్లు ఎపిపిఎస్‌సి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు రెండో విడత పల్స్ పోలియో

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెండో విడతగా రాష్ట్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఇప్పటికే ఈ కార్యక్రమం పై ప్రచారం నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ ఏడాది జనవరి 28న మొదటి విడత పల్స్ పోలియో నిర్వహించారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు రెండో విడత పల్స్ పోలియో చుక్కలు వేయనున్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4, Akulavari Street, Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68